సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

గురువారం 13-2-2020

సంపుటి: 12
సంచిక: 323

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

ఎకానమీకి వైరస్!!

ప్రపంచ వృద్ధి రేటు అంచనాలు కట్. 2.2 శాతానికి కుదించిన ఈఐయూ- **బిజినెస్**లో

... గెలుస్తామనుకున్నాం!

అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్‌పై హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ - **స్పోర్ట్స్**లో

● భారీ పెంపు

గ్యాస్ సిలిండర్

వంటగ్యాస్ ఎల్పీజీ ధర అమాంతం పెరిగింది. సిలిండర్‌పై రూ.144.5 పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో ఢిల్లీలో రూ.714గా ఉన్న సిలిండర్ ధర రూ.858.50కి చేరుకుంది. 2014 జనవరి తర్వాత వంటగ్యాస్ ధర ఇంత భారీస్థాయిలో పెరగడం ఇదే తొలిసారి.

- 5లో

● ముహూర్తం ఖరారు

16న ప్రమాణం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయభేరి మోగించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రామ్‌లీలా మైదానం ఈ కార్యక్రమానికి వేదిక కానుంది.

- 5లో

● పదకొండేళ్ల జైలు

హఫీజ్‌కు శిక్ష

ముంబై ఉగ్రదాడుల సూత్రధారి, జమాత్ ఉద్ దవా అధ్యక్షుడు హఫీజ్ సయీద్‌కు పాక్‌లో జైలు శిక్ష పడింది. ఉగ్రవాదానికి నిధులు అందించారన్న కేసులో విచారణ జరిపిన పాకిస్థాన్‌లోని ఉగ్రవ్యతిరేక కోర్టు పదకొండేళ్ల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది.



- 5లో

● ట్రంప్‌కు గ్రాండ్ వెల్‌కమ్

అదిరే ఆహ్వానం

ఫిబ్రవరి 24న భారత్‌కు రానున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చిరస్మరణీయ ఆహ్వానం పలుకుతామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ట్రంప్ భారత పర్యటన అమెరికా-భారత్ మధ్య స్నేహం బలపడేందుకు ఉపకరిస్తుందని మోదీ ట్వీట్ చేశారు.

- 5లో

యూపీ తరహాలో 'రెవెన్యూ కోడ్'

తెలంగాణ భూచట్టం వైపు ముఖ్యమంత్రి కేసీఆర్ మొగ్గు

భూ సంబంధిత చట్టాలన్నీ ఒకే గొడుగు కిందకు తెచ్చే యోచన

యూపీ రెవెన్యూ చట్టాన్ని అధ్యయనం చేయాలని సీఎస్ సోమేశ్‌కుమార్, సలహాదారు రాజీవ్‌శర్మకు సీఎం ఆదేశాలు

టైటిల్ గ్యారంటీ చట్టానికి న్యాయపరమైన చిక్కులు వస్తాయనే అభిప్రాయం

రెవెన్యూ చట్టం కోసమే ప్రత్యేకంగా మళ్లీ కలెక్టర్ల కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్

భూ పరిపాలన, హక్కులపై ఉన్న గందరగోళాలకు తెరదించుతూ, దీనికి సంబంధించిన అన్ని చట్టాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఉత్తరప్రదేశ్ తరహాలో తెలంగాణ రెవెన్యూ కోడ్‌ను తేవాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు యూపీ సర్కారు 2016లో అమల్లోకి తెచ్చిన రెవెన్యూ కోడ్‌ను సమగ్రంగా అధ్యయనం చేసి రాష్ట్రం కోసం కొత్త రెవెన్యూ కోడ్‌కు రూపకల్పన చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ యూపీ కోడ్ అధ్యయనం చేసే పనిలో పడినట్లు సమాచారం. వాస్తవానికి, నిజాం రాష్ట్రంలో 'ఫస్లీ-1317'చట్టాన్ని రూపొందించారు. ఈ ఫస్లీయే ఇప్పటివరకు అమల్లోకి వచ్చిన అన్ని రెవెన్యూ చట్టాలకు భూమికగా వస్తోంది. భూ పరిపాలనకు సంబంధించిన అన్ని చట్టాలు, భాగాలు, అధ్యాయాలు, సెక్షన్లు అన్నీ ఈ చట్టంలో సమగ్రంగా ఉండేవి. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత భూపాలన, హక్కులకు సంబంధించిన ఒక్కో అంశంపై ఒక్కో చట్టం చేశారు. లేదంటే చట్టంలోనే సబ్ సెక్షన్లుగా నియమ నిబంధనలను విడగొట్టారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 124 రెవెన్యూ చట్టాలు/రూల్స్ అమల్లో ఉన్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి యూపీ తరహాలో తెలంగాణ రెవెన్యూ కోడ్ అమల్లోకి తేవాలనేది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. అదే తరహాలో కాలంచెల్లిన చట్టాలకు చరమగీతం పాడాలని యోచిస్తోంది. మరోవైపు పాశ్చాత్య దేశాలే కాకుండా, పొరుగు రాష్ట్రంలోనూ అమలు చేస్తున్న టైటిల్ గ్యారంటీ చట్టాన్ని ఇక్కడ కూడా ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నా, ఇది అమల్లో కష్టసాధ్యమని, న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయనే మీమాంసలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 'తెలంగాణ రెవెన్యూ కోడ్ లేదా తెలంగాణ భూచట్టం' వైపు ముఖ్యమంత్రి కేసీఆర్ మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. కోడ్‌కు తుదిరూపు ఇచ్చేముందు ప్రత్యేకంగా కలెక్టర్ల సమావేశం నిర్వహించి కోడ్‌పై విస్తృతంగా చర్చించాలని కూడా ఆయన నిర్ణయించినట్లు సమాచారం.

యూపీ చట్టం ఇది...

దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో కూడా రెవెన్యూ వ్యవస్థ గందరగోళంగా ఉండేది. భూ చట్టాల అమల్లో ఉన్న ఇబ్బందులకు పరిష్కారంగా రెవెన్యూ కోడ్ రూపొందించాలని ఆ రాష్ట్ర లా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ సిఫారసు మేరకు 2006 సంవత్సరంలో యూపీ రెవెన్యూ కోడ్‌ను అక్కడి ప్రభుత్వం రూపకల్పన చేసింది. 2012లో దీన్ని అసెంబ్లీ ఆమోదించింది. ఆ తర్వాత 2016 నుంచి ఈ కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ కోడ్‌లో మొత్తం 16 అధ్యాయాలు, 234 సెక్షన్లు ఉన్నాయి. భూపరిపాలన, భూహక్కులకు

మిగతా 2వ పేజీలో ▶

బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీకి జ్ఞాపికను అందిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

ఉగాదికి రండి

ఇళ్ల పట్టాల పంపిణీలో పాల్గొనండి

ప్రధాని మోదీకి ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి

- గంటా నలభై నిమిషాల పాటు సాగిన సమావేశం..
- రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర చర్చ.. సాయం కోసం వినతి
- సవరించిన పోలవరం అంచనాలు, దిశ చట్టం ఆమోదానికి విన్నపం

2 లో

'కోవిడ్' మృతులు

1,115

● రోజులు గడుస్తున్నా చైనాలో కోవిడ్-19 (కరోనా వైరస్) కల్లోలానికి అంతం లేకుండా పోతోంది. గత ఏడాది డిసెంబర్‌లో తొలికేసు నమోదైన నాటి నుంచి చూస్తే మంగళవారం నాటికి వైరస్ బాధితుల మరణాల సంఖ్య 1,115కు చేరింది. ప్రస్తుతం 44,763 మంది వ్యాధి బారినపడినట్లు చైనా అధికారులు తెలిపారు. - 5లో

నిజమే సార్! అక్కడంతా మనవాళ్లే
పీఎం, మంత్రులు, ఎంపీలు...!

పెట్టుబడులతో మరిన్ని కంపెనీలొస్తున్నాయి

ఐటీ, పరిశ్రమల శాఖ కార్యక్రమాలపై సమీక్షలో మంత్రి కేటీఆర్

- అవసరమైన మౌలిక వసతులు, ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో త్వరలో పెట్టుబడులు..
- జూలైలో అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్ 'టీ వర్క్స్' ప్రారంభం
- హైదరాబాద్ నలుమూలలా ఐటీ పరిశ్రమల విస్తరణ
- ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఏర్పాటుకు ఐటీ కంపెనీల ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ముందుకొస్తున్నాయని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులు, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఐటీ, పరిశ్రమల శాఖ కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ రంగాల అవసరాల కోసం రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సౌకర్యాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనుల పురోగతి, భూ సేకరణ తదితర అంశాలపైనా సమీక్ష నిర్వహించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో పెట్టుబడులకు ఆసక్తి

బుగ్గపాడు, బండమైలారం, బండ తిమ్మాపూర్ ఫుడ్‌పార్కుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న కంపెనీల వివరాలను అధికారులు మంత్రికి నివేదించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఇప్పటికే హట్సన్ అగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్ రూ.207 కోట్ల పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా గోవింద్‌పూర్‌లో దేశంలోనే అతిపెద్ద ఐస్‌క్రీం తయారీ ప్లాంటును నిర్మిస్తోందన్నారు. వంద మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యమున్న ఈ ప్లాంటు ద్వారా సుమారు 4 వేల మంది పాడి రైతులకు మేలు కలగడంతో పాటు, ఐదు వందల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సంబంధించి ఆయా కంపెనీలు త్వరలో అధికారిక ప్రకటన చేసే అవకాశముందని అధికారులు వెల్లడించారు. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి అనువైన వాతావరణం రాష్ట్రంలో ఉందని మంత్రి కేటీఆర్ వివరిస్తూ.. వరంగల్

మిగతా 2వ పేజీలో ▶

సచివాలయ భవనాల్ని కూల్చొద్దు

- తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు అలాగే ఉంచాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం..
- ప్లాన్లు, డిజైన్ల ఖరారులో ఆలస్యం ఎందుకని ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు సచివాలయ భవనాలను కూల్చొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు లిఖితపూర్వక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మౌఖికంగా ఈ ఆదేశాలు ఉండగా.. ఇప్పుడు రాతపూర్వకంగా వాటిని వెలువరించింది. సచివాలయ భవనాలను కూల్చొద్దంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ప్రొఫెసర్ కేఎల్ విశ్వేశ్వర్‌రావు తదితరులు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. కొత్తగా నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వం ఇంకా ప్లాన్‌లు రూపొందించలేదని, ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసినట్లు ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కొత్తగా రూపొందించే ప్లాన్‌లను మంత్రివర్గ సమావేశం ఆమోదించే వరకూ ప్రస్తుత సచివాలయ భవనాల్ని కూల్చవద్దని, తామిచ్చే తుది ఉత్తర్వుల వరకూ వాటిని అలాగే ఉంచాలని పేర్కొంది. కొత్తగా సచివాలయ భవనాల్ని నిర్మించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న తర్వాత ప్లాన్‌లు, డిజైన్లను తయారుచేసి వాటిని ఖరారు చేయడానికి ఎందుకు

మిగతా 2వ పేజీలో ▶

సమ్మక్క బ్యారేజీ..!

తుపాకులగూడెం బ్యారేజీకి సీఎం కేసీఆర్ నామకరణం

- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశం
- నేడు కాళేశ్వర ఆలయం, ప్రాజెక్టును సందర్శించనున్న ముఖ్యమంత్రి
- లక్ష్మీ బ్యారేజీ నుంచి ఎల్లంపల్లికి నీటి విడుదలపై నేడు దిశానిర్దేశం

నిర్మాణంలో ఉన్న తుపాకులగూడెం బ్యారేజీ

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిపై నిర్మిస్తున్న తుపాకులగూడెం బ్యారేజీకి తెలంగాణ ఆదివాసీ వీర వనిత, వన దేవత.. 'సమ్మక్క'పేరు పెట్టాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు బ్యారేజీకి 'సమ్మక్క బ్యారేజీ'గా నామకరణం చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్‌రావును ఆదేశించారు. ముక్కోటి దేవతల కరుణాకటాక్షాలు బలంగా ఉండటంతోనే రాష్ట్రంలో అభివృద్ధి అనుకున్న రీతిలో సాగుతోందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తై బీడు భూముల్లోకి కాళేశ్వరం నీళ్లు చేరుకుంటున్న శుభ సందర్భంలో ఇప్పటికే పలు బ్యారేజీలకు, రిజర్వాయర్లకు దేవతామూర్తుల పేర్లను పెట్టుకున్నామని సీఎం గుర్తు చేశారు. కాగా, సీఎం కేసీఆర్ గురువారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. బుధవారం రాత్రి ఆయన కరీంనగర్ జిల్లా తీగలగట్టుపల్లిలోని తన నివాసానికి చేరుకుని అక్కడే బస చేశారు. గురువారం ఉదయం అక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత లక్ష్మీ బ్యారేజీని సందర్శించి, అక్కడే మధ్యాహ్న భోజనం చేసి తిరిగి తీగలగట్టుపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

నీటి విడుదలపై సమీక్ష...

సీఎం కేసీఆర్ బుధవారం ప్రగతి భవన్‌లో ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వర్లు, ఓఎస్‌డీ శ్రీధర్ దేశ్‌పాండేతో సమీక్ష నిర్వహించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులోకి అనుకున్న రీతిలో సాగునీరు చేరుతోంది. బ్యారేజీలు నిండుకుండలా మారినయ్. రానున్న వానా కాలం నుంచి వరద నీటి ప్రవాహం పెరుగుతుంది. ప్రాణహిత ద్వారా లక్ష్మీ బారేజీకి చేరుకునే వరద నీటిని ఎప్పటికప్పుడు ఎగువకు ఎత్తిపోసే దిశగా.. అటు నుంచి కాలువలకు మళ్లించేలా.. ఇరిగేషన్ శాఖ అప్రమత్తం కావాలి. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలి'అని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్ కుమార్,

మిగతా 2వ పేజీలో ▶

మార్చి 6న ఐసెట్ నోటిఫికేషన్

- 9వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- వికలాంగులకు ఫీజు తగ్గింపు.. మే 20, 21 తేదీల్లో ఐసెట్ ప్రవేశపరీక్ష - 3లో

ప్రతీకారంతోనే కాల్పులు

- అక్కన్నపేట కాల్పుల ఘటనకు సంబంధించి రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన అంశాలు - 4లో

వరంగల్ ఐటీ క్లస్టర్‌లో క్వాడ్రెంట్ రిసోర్స్

ఐదు వందల మందికి ఉపాధి, 16న శంకుస్థాపన

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పురోగమిస్తున్న వరంగల్ నగరంలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు మరో ఐటీ కంపెనీ ముందుకు వచ్చింది. ఐటీ ప్రొడక్ట్ డిజైన్, డెవలప్‌మెంట్ రంగంలో ఐటీ అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు క్వాడ్రెంట్ రిసోర్స్ సంస్థ ప్రకటించింది. ఈ నెల 16న వరంగల్ నగర శివారులోని మడికొండ ఐటీ క్లస్టర్‌లో డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ సెంటర్ ద్వారా 500 మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని ఐటీ శాఖ వర్గాలు వెల్లడించాయి. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ కార్యకలాపాలను విస్తరించడంలో భాగంగా వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఐటీ టవర్లను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వరంగల్ ఐటీ టవర్‌లో ఇదివరకే కార్యకలాపాలు ప్రారంభం కాగా, టెక్ మహీంద్ర, సియాంట్ వంటి దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరించాయి.

18న కరీంనగర్ ఐటీ టవర్స్ ప్రారంభం

కరీంనగర్‌లో కొత్తగా నిర్మించిన ఐటీ టవర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు ఈ నెల 18న ప్రారంభించనున్నారు. గతేడాది డిసెంబర్‌లోనే ఐటీ టవర్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేసినా మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఐదంతస్తుల్లో నిర్మించిన కరీంనగర్ ఐటీ టవర్స్‌లో మూడువేల మంది స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయని ఐటీ శాఖ అంచనా వేస్తోంది.

ఇద్దరు జిల్లా కలెక్టర్లకు జరిమానాపై హైకోర్టు స్టే

ఆర్డీవో జైలు శిక్షలోనూ హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు ఐఏఎస్ అధికారులైన జిల్లా కలెక్టర్లకు జరిమానా, సిద్దిపేట ఆర్డీవోకు జైలు శిక్ష విధిస్తూ సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన తీర్పు అమలుపై స్టే ఉత్తర్వులు జారీ చేస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం భూసేకరణలో తామిచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించారనే కోర్టుధిక్కార కేసులో సిద్దిపేట కలెక్టర్ పి.వెంకటరామిరెడ్డి, గతంలో కలెక్టర్‌గా పనిచేసిన సిరిసిల్ల కలెక్టర్ కృష్ణ భాస్కర్‌లకు రూ.2వేలు జరిమానా, సిద్దిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డికి రెండు నెలలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ గత నెల 24న సింగిల్ జడ్జి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు తీర్పు చెప్పారు. దీన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ వ్యాజ్యాన్ని బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి లతో కూడిన ధర్మాసనం స్టే ఉత్తర్వులు జారీచేసింది. సింగిల్ జడ్జి తీర్పునకు విరుద్ధంగా భూసేకరణకు డిక్లరేషన్, అవార్డు జారీ చేశారని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నివేదికను తెలుగులో రైతులకు ఇవ్వకపోవడం వల్ల వారు అభ్యంతరాలు చెప్పలేకపోయారని సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్నారు. అధికారుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ వాదిస్తూ, కోర్టు ఆదేశాల్ని అమలు చేయాలని కింది స్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్లు ఆదేశించారని, కోర్టు ధిక్కారానికి పాల్పడలేదని చెప్పారు. స్టే ఉత్తర్వులు జారీ చేసిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

అవినీతి కేసులో మున్సిపల్ కమిషనర్ డిస్మిస్

సాక్షి, హైదరాబాద్: లంచం తీసుకున్న కేసులో మున్సిపల్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఏసీబీ న్యాయస్థానం తీర్పునిచ్చింది. లావూరి బలోజి నాయక్ 2010లో భువనగిరి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సమయంలో పెండింగ్ బిల్లులను క్లియర్ చేసేందుకు చుంచు శివకుమార్ అనే వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేశాడు. ఈమేరకు శివకుమార్ ఏసీబీని ఆశ్రయించగా.. వారు ఆయనకు బలోజి నాయక్‌కు లంచం ఇవ్వాలని సూచించారు. దీంతో బలోజి నాయక్ తన డ్రైవర్ లాలూ ద్వారా శివకుమార్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో వాదనలు విన్న ఏసీబీ న్యాయస్థానం బలోజి నాయక్‌ను విధుల నుంచి తొలగిస్తూ తీర్పునిచ్చింది. దీంతోపాటు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించింది. ఈ మేరకు ఏసీబీ డీజీ పూర్ణచంద్ర రావు ప్రకటన విడుదల చేశారు.

జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం భేష్

15వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్‌నారాయణ్ కితాబు

సాక్షి, హైదరాబాద్: వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లలో రాష్ట్రం బాగా పనిచేస్తోందని 15వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ్ ప్రశంసించారు. బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో బీఆర్‌కేఆర్ భవన్‌లో సమావేశమయ్యారు. జీఎస్టీ సర్కిళ్ల హేతుబద్ధీకరణ, ఎకనమిక్ ఇంటలిజెన్స్ విభాగాలు, వ్యూహాత్మక పన్నుల విభాగాల ఏర్పాటు, సమర్థవంతంగా ఐటీ, యాప్‌ల వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం మంచి ఫలితాలు సాధిస్తోందని సీఎస్ ఆయనకు వివరించారు. జీఎస్టీ ఎగవేతదారులకు నోటీసుల జారీ, పెండింగ్ జీఎస్టీ రిటర్న్స్ విషయంలో ఎస్ఎంఎస్‌లు పంపడం, ఆటోమెటిక్‌గా 3ఏ నోటీసులు జారీ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పన్నుల ఎగవేతను నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. రాష్ట్రాలతో ఐజీఎస్టీ సమాచారం పంచుకోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, జీఎస్టీ వసూళ్లలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు అందించాలని ఈ సమావేశంలో అజయ్‌నారాయణ్‌కు రాష్ట్ర అధికారులు విజ్ఞప్తి చేయగా, ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జి.ఆర్.రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్‌లతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ సోమేశ్‌కుమార్‌ను కలిసిన 15వ ఆర్థికసంఘం సభ్యుడు అజయ్ నారాయణ్

సమ్మక్క బ్యారేజీ!

▶ మొదటి పేజీ తరువాయి

రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లక్ష్మి బ్యారేజీలో ప్రస్తుతం 16.12 టీఎంసీ నిల్వలకు గాను 14 టీఎంసీల మేర నిల్వలు ఉన్నాయి. దీంతో లక్ష్మి పంప్‌హౌజ్ పరిధిలో 11 పంప్‌లను రోజుకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా సిద్ధం చేశారు. ఎల్లంపల్లి నుంచి నీటిని మిడ్‌మానేరు రిజర్వాయర్ ద్వారా ఎల్ఎండీకి తరలిస్తుండటంతో ఎల్లంపల్లిలో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఎల్లంపల్లిలో 20 టీఎంసీలకు గాను ప్రస్తుతం 5 టీఎంసీల మేర నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో లక్ష్మి బ్యారేజీలో ఉన్న నీటిని ఎల్లంపల్లికి తరలించడంపై కేసీఆర్ గురువారం నాటి పర్యటన సందర్భంగా అధికారులకు ఆదేశాలిచ్చే అవకాలున్నాయి. ఇదిలా ఉండగా, తుపాకులగూడెం బ్యారేజీకి వనదేవత శ్రీసమ్మక్క పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం పట్ల రాష్ట్ర గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ధన్యవాదాలు తెలిపారు.

బుధవారం శ్రీనగర్‌లోని దాల్ లేక్‌లో షికారా (పడవ)పై విహరిస్తున్న యూరోపియన్ యూనియన్ ప్రతినిధి బృందం. కశ్మీర్‌లోని పరిస్థితిని అంచనా వేసేందుకు ఈ బృందం ఇక్కడికి వచ్చింది.

హమ్మయ్య 'పరపతి' దక్కింది..!

- ఆర్టీసీ సిబ్బంది రుణాలకు గ్రీన్‌సిగ్నల్
- పరపతి సంఘం బకాయిలు చెల్లించనున్న ఆర్టీసీ
- రూ.600 కోట్ల రుణానికి పూచీకత్తు ఇవ్వనున్న ప్రభుత్వం
- సీఎంతో చర్చించిన రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇళ్ల నిర్మాణం తదితరాల కోసం కొంతకాలంగా గుట్టలుగా పేరుకుపోయిన ఆర్టీసీ ఉద్యోగుల దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం లభించబోతోంది. తమ జీతాల నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేసి ఏర్పాటు చేసుకున్న నిధిని ఆర్టీసీ సొంత అవసరాలకు వాడేసుకోవటంతో ఈ సమస్య వచ్చి పడింది. తిరిగి దాన్ని చెల్లించే పరిస్థితి లేకపోవటంతో సంస్థ చేతులెత్తేసింది. దీంతో ఉద్యోగుల దరఖాస్తులు పేరుకుపోవడంతో రుణాలు రాక వారి కుటుంబాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పుడు బ్యాంకు నుంచి రుణం పొంది ఆ బకాయిలను తీర్చేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. అవి రాగానే ఉద్యోగుల దరఖాస్తులు కొలిక్కిరానున్నాయి. తీవ్ర నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి జీతాలు కూడా చెల్లించే పరిస్థితి లేక ఉద్యోగుల సహకార పరపతి సంఘం (సీసీఎస్) నిధులను వాడేసుకుంటూ వచ్చింది. అలా ఏకంగా రూ.560 కోట్లు వినియోగించుకోవటంతో ఆ నిధి కాస్తా ఖాళీ అయింది. దీంతోపాటు ఉద్యోగుల భవిష్యనిధి (పీఎఫ్)కు సంబంధించి కూడా దాదాపు రూ.800 కోట్లు వాడేసుకుంది. దీనిపై ఇటీవల హైకోర్టు కూడా తీవ్రంగా పరిగణించింది. వాడేసుకున్న భవిష్య నిధి మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశించింది. దీంతో ఈ రెండు బకాయిలను వెంటనే చెల్లించాల్సిన పరిస్థితి ఆర్టీసీ ముందుంది. కానీ చేతిలో నిధులు లేక బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే దాదాపు రూ.1400 కోట్లు బ్యాంకు రుణాలు పేరుకుపోయి ఉన్నాయి. వాటి వడ్డీ కూడా కొంతకాలంగా సరిగ్గా చెల్లించటం లేదు. బ్యాంకు రుణాలు సహా ఇతర అప్పులకు గాను సాలీనా రూ.180 కోట్ల వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి ఉంది. అదీ చెల్లించటం లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ రుణం అంటే బ్యాంకులు స్పందించడం లేదు. ఇటీవల ఆర్టీసీ బస్సుల చార్జీలు పెంచటంతో ఒక్కసారిగా ఆదాయం పెరిగింది. కొన్ని పొదుపు చర్యలతో ఖర్చులను తగ్గించుకోవటం ద్వారా ఆదాయం అదనంగా పెరిగినట్టయింది. ఈ నేపథ్యంలో 'పరపతి'పెరగటంతో బ్యాంకులు అప్పులు ఇస్తాయన్న నమ్మకం ఆర్టీసీకి కలిగింది. గతంలో రూ.600 కోట్ల అప్పు కోసం ప్రభుత్వ పూచీకత్తు కావాలంటూ చేసిన ప్రతిపాదన పెండింగులో ఉండటంతో, దాన్ని మరోసారి ప్రభుత్వం ముందుంచింది. కానీ దానికి స్పందన రాలేదు. బుధవారం రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆర్టీసీ ఈడీలు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. సమావేశానంతరం మంత్రి సీఎం కేసీఆర్ కార్యాలయానికి వెళ్లి ఈ విషయంపై చర్చించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించటంతో మరో రెండుమూడు రోజుల్లో రూ.600 కోట్ల పూచీకత్తు లోన్‌కు సంబంధించి ఉత్తర్వు విడుదల కాబోతోంది. ఆ వెంటనే రుణం పొంది సీసీఎస్, పీఎఫ్ బకాయిలను ఆ మేరకు తీర్చాలని నిర్ణయించారు.

వారం రోజుల్లో ఉద్యోగ భద్రత విధివిధానాలు

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు సంబంధించి ఉద్యోగ భద్రతపై వారం రోజుల్లో విధివిధానాలను రూపొందించాలని మంత్రి అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బస్సుల్లో ప్రయాణికులు టికెట్ తీసుకోకపోతే కండక్టర్లను సస్పెండ్ చేసే విధానం కొనసాగుతుండటంతో ఉద్యోగుల్లో ఆందోళన ఉంది. చిన్నచిన్న ప్రమాదాలకు కూడా డ్రైవర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటాన్నీ వారు తప్పు పడుతున్నారు. ఈ రెండు విషయాల్లో వారిలో ఉద్యోగ భద్రత ఉండేలా చూడనున్నారు. టికెట్ తీసుకునే బాధ్యత ఇక ప్రయాణికులదే. తీసుకోకుంటే వారిపైనే చర్యలు తీసుకునేలా ఆదేశాలు రానున్నాయి. కండక్టర్లు, డ్రైవర్లపై క్రమశిక్షణ చర్యల విషయంలో అనుసరించాల్సిన పద్ధతులపై త్వరలో స్పష్టత రానుంది. ఇక డిపోల్లో ఉద్యోగులను వేధిస్తున్నారంటూ అధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నందున వీటిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులతో స్నేహభావంతో మెలిగి సంస్థ పురోగతి కోసం యత్నించాలని ఆయన ఆదేశించారు. ఇక నుంచి ప్రతి మంగళవారం ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలు, ఇతర అత్యవసర సెలవుల విషయంలో మానవతాధృక్పథంతో స్పందించాలన్నారు. బస్సుల్లో సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రత్యేక సందర్భాల్లో వారిని విధిగా విష్ చేయాలని ఎండీ సునీల్‌శర్మ పేర్కొన్నారు. సిటీ బస్టాపులు, కూడళ్లలో బస్సుల వివరాలు తెలిపే ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో ఈడీలు పురుషోత్తం, వినోద్, టీవీరావు, యాదగిరి, వెంకటేశ్వరరావు, ఎఫ్ఏ రమేశ్, ఎస్ఎల్ఓ శ్రీలత, సీపీఎం సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాల్ని కూల్చొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించింది. వాటిని సిద్ధం చేయకుండా కొత్తగా నిర్మాణాలు ఎలా చేయగలరని అడిగింది. ప్లాన్‌లు, డిజైన్లు చేసేందుకు ఇంజనీర్లు కష్టపడాల్సి వచ్చేదని, ఇప్పుడు అంతా కంప్యూటరీకరణ కదా, ఇంకా వాటి విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని నిలదీసింది. నిర్మాణాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోకముందే, అపరిపక్వత దశలోనే పిల్స్ దాఖలు చేశారని అదనపు ఏజీ బదులిచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మంత్రివర్గం నిర్ణయంతీసుకుంది కదా, పిల్స్ అపరిపక్వత ఎలా అవుతాయని ప్రశ్నించింది. అనంతరం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు సచివాలయ భవనాలు కూల్చొద్దని ఆదేశాలు జారీచేసింది.

పిల్స్ కొట్టేయాలి..

'కొత్తగా నిర్మించబోయే సచివాలయ భవనాల డిజైన్ రూపొందించే బాధ్యత వివిధ ఆర్కి టెక్ట్స్ సంస్థలకు ఇచ్చాం. అవి నమూనా ప్లాన్‌లే ఇచ్చాయి. కొత్త నిర్మాణం 8 నుంచి 9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చేసే నిర్మాణంలో అదే స్థాయి నిపుణులను భాగ స్వామ్యం చేస్తాం. దీనికి రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకూ ఖర్చవుతుంది. ఇప్పుడు 32 శాఖలకు 4.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోనే భవనాలు ఉన్నాయి. పాలనాపరంగానే కాకుండా రక్షణపరంగా కూడా అవి యోగ్యంగా లేవు. అగ్ని ప్రమాదం జరిగితే నివారణ చర్యలు తీసుకునే విధంగా కూడా లేవు. వేర్వేరు చోట్ల విడివిడిగా భవనాలు ఉన్నాయి. కొత్త భవనాలు నిర్మించిన తర్వాతే అవే 32 శాఖలకు ఎంత విస్తీర్ణం కేటాయించాలో నిర్ణయిస్తాం. గ్రీన్ జోన్, పార్కింగ్‌లపై ఆర్కి టెక్ట్స్ ఇచ్చిన తర్వాతే కేబినెట్ ఆమోదిస్తుంది. అంచనా ప్రతిపాదన విషయంలోనే కేబినెట్ నిర్ణయంతీసుకుంది. ఇందుకు భిన్నంగా ఉన్నతమైన నిర్ణయం తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. అందుకే తుది ప్రణాళికను హైకోర్టుకు నివేదించలేకపోతున్నాం. పిల్స్‌ను కొట్టేయాలి' అని రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ అదనపు కౌంటర్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

యూపీ తరహాలో 'రెవెన్యూ కోడ్'

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన అన్ని చట్టపరమైన అంశాలు ఈ కోడ్‌లోనే పొందుపరిచారు. అంతకు ముందు మనుగడలో ఉన్న 32 చట్టాలను కోడ్ రాకతో అక్కడి ప్రభుత్వం రద్దు చేసింది. ఇదే తరహాలో 1999లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ కోడ్ రూపొం దించారు. అప్పటికే ఉన్న 191 చట్టాలను క్రోడీకరించి ఆంధ్రప్రదేశ్ భూమి రెవెన్యూ కోడ్-1999 పేరుతో తయారు చేశారు. ఇందులో 17 భాగాలు, 47 అధ్యాయాలు, 260 సెక్షన్లను పొందుపరిచారు. భూపాల నకు సంబంధించిన చట్టాలన్నింటినీ ఒకే చోటకు తెచ్చే ప్రయత్నానికి కేంద్రం మోకాలడ్డింది. శాసనసభ ఆమోదముద్ర వేసిన బిల్లును కేంద్రానికి పంపగా 146 ప్రశ్నలతో తిప్పి పంపింది. దీంతో కోడ్ అటకెక్కింది. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో తెలంగాణ రెవెన్యూ కోడ్‌ను యూపీ కోడ్ ఆధారంగా తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది.

మా దోస్త్‌ను కూడా వదలలేదు?

కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ మరోసారి రెవెన్యూశాఖపై అసహనం వ్యక్తం చేశారు. డబ్బులివ్వందే పనులు కావడం లేదని మండిపడ్డారు. 'పాస్ పుస్తకం కోసం మా దోస్తు పోతే వీఆర్వో పైసలు అడిగిండు. అసలేం జరుగుతోంది. విజయారెడ్డిని అన్యాయంగా పోగొట్టుకున్నం. చిన్న పిల్లలు అన్యాయమైపోయారు. ఇలాంటి సంఘటనల తర్వాత కూడా రెవెన్యూ వాళ్లు మారరా? కనువిప్పు కలగాలి. ఇప్పటికే రెవెన్యూ వ్యవస్థ భ్రష్టు పట్టిపోయింది. భూ రికార్డుల ప్రక్షాళనను లోపభూయిష్టంగా చేశారు. భూ రికార్డులు సరిగ్గా ఉన్న ప్రాంతాల్లో 3 శాతం జీడీపీ అదనంగా వస్తోందని రుజువైంది. ఇప్పటికైనా మార్పు రావాలి'అని సీఎం కేసీఆర్ కలెక్టర్ల సమావేశంలో వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఉగాదికి రండి

ఇళ్ల పట్టాల పంపిణీలో పాల్గొనండి

ప్రధాని నరేంద్ర మోదీకి ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి

బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన అనేక కీలక అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్చించారు. బుధ వారం సాయంత్రం 4.15 గంటలకు ప్రధాని నివాసానికి చేరుకున్న ముఖ్యమంత్రి.. గంటా నలభై నిమిషాల పాటు మోదీతో సమావేశమయ్యారు. రాష్ట్ర అంశాలపై ఒక లేఖ అందిస్తూ అందులోని విషయాలన్నింటినీ కూలంకషంగా వివరించారు. ఈ ఏడాది మార్చి 25వ తేదీ.. ఉగాది రోజున 25 లక్షల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ కార్యక్రమానికి రావాలని ప్రధాన మంత్రిని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. నవరత్నాల్లో భాగంగా 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా దీన్ని చేపట్టామని తెలిపారు. ఈ చారిత్రక కార్యక్రమానికి రావాల్సిందిగా కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో 800 ఎకరాల ఉప్పు భూములను ఇళ్ల స్థలాల కోసం ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాల్సిందిగా సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానికి సీఎం వైఎస్ జగన్ సమర్పించిన వినతిపత్రంలోని అంశాలు ఇవీ..

పోలవరం సవరించిన అంచనాలను ఆమోదించండి

'2021 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. ముంపు ప్రాంతాల్లో ఉన్న అన్ని కుటుంబాలను తరలించడానికి సహాయ, పునరావాస పనులను అనుకున్న షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు కేంద్రం నుంచి సహకారం కావాలి. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.55,549 కోట్లు. ఇందులో ఆర్ అండ్ ఆర్ కోసమే రూ.33,010 కోట్ల మేర అవసరం అవుతుంది. కేంద్ర జల వనరుల శాఖలోని సాంకేతిక సలహా కమిటీ పోలవరం అంచనాలు రూ.55,549 కోట్లకు ఆమోదం తెలిపినా, సవరణ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంది. ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని వీలైనంత త్వరగా వీటికి ఆమోదం తెలిపేలా చూడాలి. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తంలో ఇంకా రూ.3,320 కోట్లు రావాల్సి ఉంది. ఈ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర జల వనరుల శాఖను ఆదేశించండి.

ప్రత్యేక హోదా కేంద్రం పరిధిలోనిదని ఆర్థిక సంఘం చెప్పింది

అభివృద్ధి పరంగా అసమతుల్యతను నివారించడానికి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి. ప్రత్యేక హోదా తమ పరిధిలో లేదని 15వ ఆర్థిక సంఘం స్పష్టం చేసింది. ప్రత్యేక హోదా అన్నది కేంద్ర ప్రభుత్వం పరిధిలోనిదని, తగిన నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వమే తీసుకోవచ్చని చెప్పింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం విభజన అనంతరం తొలి ఆర్థిక సంవత్సరపు రెవెన్యూ లోటును భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ రెవెన్యూ లోటు రూ.22,948.76 కోట్లు ఉన్నట్లు కాగ్ నిర్ధారించింది. ఇందులో ఇంకా రూ.18,969.26 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ మొత్తాన్ని ఇప్పించాలి' అని సీఎం వైఎస్ జగన్ ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య ఉన్న అసమతుల్యతను తొలగించి సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పరిపాలన వికేంద్రీకరణ, రాజధాని కార్యకలాపాల వికేంద్రీకరణ కోసం ప్రణాళికలు రూపొందించుకున్నాం. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా విశాఖపట్నం, జ్యుడిషియల్ క్యాపిటల్‌గా కర్నూలు, లెజిస్లేటివ్ క్యాపిటల్‌గా అమరావతి.. ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందు కోసం ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాలకు సమగ్రాభివృద్ధి చట్టం-2020కి అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. ఇందులో భాగంగా హైకోర్టును కర్నూలుకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖకు తగిన ఆదేశాలు ఇవ్వాలి. ప్రజల మంచి కోసం, మెరుగైన పాలన కోసం శాసన మండలి ప్రభుత్వానికి సలహాలివ్వాల్సింది పోయి అడ్డుపడే ధోరణితో వ్యవహరిస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం చేసిన బిల్లులను అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆంధ్రప్రదేశ్ శాసనసభ.. శాసన మండలిని రద్దు చేస్తూ సిఫారసు చేసింది. తదనంతర చర్యల కోసం కేంద్ర న్యాయ శాఖను ఆదేశించండి.

పెట్టుబడులతో మరిన్ని కంపెనీలొస్తున్నాయి

▶ మొదటి పేజీ తరువాయి

మెగా టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. టెక్స్‌టైల్ పార్కులో అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కేటీఆర్ ఆదేశించారు.

త్వరలో 'టీ హబ్'రెండో దశ పూర్తి

వివిధ రంగాల్లో స్టార్టప్‌ల ద్వారా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న 'టీ హబ్'రెండో దశ భవన నిర్మాణం త్వరలో పూర్తవుతుందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. రెండో దశ ప్రారంభం తర్వాత టీ హబ్ దేశంలోనే అతిపెద్ద ఐటీ ఇంక్యుబేటర్‌గా అవతరిస్తుందన్నారు. దీంతో పాటు ఈ ఏడాది జూలైలో దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్ 'టీ వర్క్స్'ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఐటీ పరిశ్రమలను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు స

మార్చి 6న ఐసెట్ నోటిఫికేషన్

9వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

వికలాంగులకు ఫీజు తగ్గింపు • మే 20, 21 తేదీల్లో ఐసెట్ ప్రవేశపరీక్ష

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఐసెట్-2020) నోటిఫికేషన్‌ను మార్చి 6వ తేదీన జారీ చేయాలని ఐసెట్ కమిటీ నిర్ణయించింది. దరఖాస్తులను వచ్చే నెల 9 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు ఐసెట్ కన్వీనర్ కె.రాజిరెడ్డి వెల్లడించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన సెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ తేదీలతోపాటు నిబంధనలను, అర్హతలను కమిటీ ఖరారు చేసింది. ముఖ్యంగా యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) జాయింట్ కమిటీ, ఏఐసీటీఈ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ)/డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు (డీఈబీ) గుర్తింపు కలిగిన యూనివర్సిటీల పరిధిలో దూర విద్య ద్వారా డిగ్రీ పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. అలాగే రెగ్యులర్ డిగ్రీ చేసిన వారు, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేసింది. ఎంబీఏలో ప్రవేశాల కోసం ఐసెట్ ప్రవేశ పరీక్ష రాసేందుకు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొంది. ఎంసీఏలో ప్రవేశాల కోసం ఐసెట్ రాసేందుకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీలో మ్యాథమెటిక్స్ సబ్జెక్టు కలిగి బీసీఏ/బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులైనవారు అర్హులని స్పష్టంచేసింది.

25 శాతం మార్కులొస్తేనే అర్హులు

ఐసెట్‌లో 25 శాతం మార్కులు సాధిస్తే అర్హులుగా పరిగణనలోకి తీసుకుంటామని, ఎస్సీ, ఎస్టీలకు కనీస అర్హత మార్కులేవీ లేవని ఐసెట్ కమిటీ వెల్లడించింది. పరీక్ష ఫీజును రూ.650లుగా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీలతోపాటు ఈసారి వికలాంగులకు ఫీజును తగ్గించింది. వారంతా రూ. 450 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్, సిటిజన్ సర్వీస్ సెంటర్లు, ఈసేవ కేంద్రాల్లో లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని నిర్ణయించింది. విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయవచ్చని పేర్కొంది. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు, ఇతర నిబంధనలు, అర్హతలకు సంబంధించిన సమగ్ర వివరాలు, సిలబస్ అంశాలను తమ వెబ్‌సైట్‌లో (http://icet.trche.ac.in,www.kakatiya.ac.in,www.trche.ac.in) పొందవచ్చని పేర్కొంది. ఈ పరీక్ష కోసం ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, కోదాడ, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నిజామాబాద్, వరంగల్, కర్నూల్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రాల పరిధిలో ఐసెట్ పరీక్షలను మే 20, 21 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొంది. 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 21వ తేదీన ఉదయం సెషన్ మాత్రమే పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి, రిజిస్ట్రార్ పురుషోత్తం, ఉన్నత విద్యా మండలి అధికారులు పాల్గొన్నారు.

ఇది షెడ్యూల్..

- **6-3-2020:** నోటిఫికేషన్
- **9-3-2020 నుంచి 30-4-2020 వరకు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- **6-5-2020 వరకు:** రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు అవకాశం
- **11-5-2020 వరకు:** రూ.2 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తులకు అవకాశం
- **16-5-2020 వరకు:** రూ.5 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తులకు అవకాశం
- **14-5-2020 నుంచి:** హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- **మే 20, 21 తేదీల్లో:** ఐసెట్ ఆన్‌లైన్ పరీక్షలు
- **27-5-2020:** ప్రాథమిక కీ విడుదల
- **1-6-2020 వరకు:** ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ
- **12-6-2020:** ఫైనల్ కీ, ఫలితాలు విడుదల.

యూజీసీ గుర్తింపున్న 'దూర విద్య' విద్యార్థులే అర్హులు

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జాయింట్ కమిటీ, ఏఐసీటీఈ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ)/డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు (డీఈబీ) గుర్తింపు కలిగిన యూనివర్సిటీల పరిధిలో దూర విద్య ద్వారా డిగ్రీ పొందిన విద్యార్థులకు మాత్రమే రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. 2013లో యూజీసీ జారీ చేసిన యూనివర్సిటీల భౌగోళిక పరిధి (టెరిటోరియల్ జ్యూరిస్‌డిక్షన్) రెగ్యులేషన్స్ ప్రకారం ఒక రాష్ట్రంలోని యూనివర్సిటీ మరో రాష్ట్రంలో దూర విద్యా కేంద్రాలను నిర్వహించడానికి వీల్లేదని ఉన్నత విద్యా మండలి స్పష్టంచేసింది. ఇందులో భాగంగానే ఇతర రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీలు 2013 తర్వాత తెలంగాణలో నిర్వహిస్తున్న దూర విద్యా కేంద్రాల్లో చదివే విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించింది. దీన్ని ఐసెట్‌లో అమలు చేయాలని బుధవారం జరిగిన ఐసెట్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అన్ని సెట్స్‌లలో దీన్ని అమలు చేయాలని మండలి నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో కుప్పలు తెప్పలుగా ఉన్న ఇతర రాష్ట్ర యూనివర్సిటీల దూర విద్యా కేంద్రాలను కట్టడి చేయలేని ఉన్నత విద్యా మండలి ఇలా వాటికి చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. అలాంటి స్టడీ సెంటర్లను కొనసాగనివ్వొద్దని, వాటిని మూసేయాలని, వాటిని నిర్వహించే కాలేజీలకు నోటీసులివ్వాలని, అవసరమైతే గుర్తింపు రద్దు చేయాలని యూనివర్సిటీలను కోరినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఇతర రాష్ట్ర యూనివర్సిటీల దూర విద్యా డిగ్రీలను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టింది.

నియోజకవర్గానికో 'సమీకృత మార్కెట్'

- గజ్వేల్ తరహాలో వీలున్న చోటల్లా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల ఏర్పాటు
- ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద 100 గజాల్లో పబ్లిక్ టాయిలెట్లు
- చిరు వ్యాపారుల కోసం ప్రత్యేక పాలసీ తయారు చేసే యోచన
- కేబినెట్ సమావేశాల నాటికి తయారు చేయాలని సీఎం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో 'సమీకృత మార్కెట్'లు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ సూత్రప్రాయంగా నిర్ణయించారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన తరహాలోనే వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు ఒకే చోట ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రారంభించాలని మంగళవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఆయన ఆదేశాలిచ్చారు. ఈ మార్కెట్లలో అన్ని రకాల కూరగాయలు, మాంసం అందుబాటులో ఉండేలా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఒకే ప్రాంగణంలో వేర్వేరుగా ఏర్పాటు చేసేలా స్థలాలను గుర్తించాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల విషయమై కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు టాయిలెట్లు కూడా లేవన్న విషయం అందరూ దృష్టిలో ఉంచుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద 100 గజాల్లో ఒక పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కూడా సీఎం కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. దీంతో పాటు చిరు వ్యాపారులు ఇబ్బందులు పడకుండా కొత్త పాలసీ తయారు చేయాలని కూడా అధికారులకు సూచించారు. కొత్తగా స్ట్రీట్ వెండర్ పాలసీని తయారు చేయాలని, వచ్చే కేబినెట్ సమావేశానికల్లా ఈ పాలసీకి తుదిరూపు ఇవ్వాలని ఆయన సీఎస్ సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు.

'స్థానిక' పగ్గాలు అదనపు కలెక్టర్లకే..

సాక్షి, హైదరాబాద్: కొత్తగా సృష్టించిన అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు) విధుల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. స్థానిక సంస్థల నిర్వహణ బాధ్యతను పూర్తిగా వీరికి కట్టబెట్టింది. మండల, జిల్లా పరిషత్ మినహా గ్రామ పంచాయతీలు, పురపాలికలపై పూర్తిస్థాయి అజమాయిషీ అప్పగించిన ప్రభుత్వం.. విధానపరమైన నిర్ణయాలు, సిబ్బంది, పాలకవర్గాలపై చర్యలు తీసుకునే అధికారం మాత్రం కలెక్టర్లకు సంక్రమింపజేసింది. మండల, జిల్లా పరిషత్‌లు ప్రస్తుతం ఉన్న తరహాలోనే జిల్లా పరిషత్ సీఈవో పర్యవేక్షణలో పనిచేస్తాయి. పంచాయతీరాజ్, పురపాలక చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రతిరోజూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో పర్యటించాలని జాబ్ చార్ట్‌లో పొందుపరిచింది. దీనిపై అధికారికంగా ఇప్పటివరకు ఉత్తర్వులు రానప్పటికీ, మంగళవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో కేసీఆర్ ఈ మేరకు సూత్రప్రాయంగా వెల్లడించినట్లు తెలిసింది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల నిర్వహణ, పారిశుద్ధ్యం, హరితహారం కింద నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ బాధ్యతలను వీరికి అప్పగించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులపై విచారణ జరపడం వరకే పరిమితం చేసిన ప్రభుత్వం.. చర్యలు తీసుకునే అధికారం మాత్రం కలెక్టర్లకు కట్టబెట్టింది. ఇకపై గ్రామ పంచాయతీ కార్యదర్శి మొదలు డీపీవో, మున్సిపల్ కమిషనర్లు కూడా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) పరిధిలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పంచాయతీరాజ్, పురపాలక చట్టాలను ఆకళింపు చేసుకోవాలని సీఎం కేసీఆర్ అదనపు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

25లోగా పంచాయతీరాజ్ సమ్మేళనాలు

సాక్షి, హైదరాబాద్: జిల్లాలవారీగా ఈనెల 25లోపు పంచాయతీ రాజ్ సమ్మేళనాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సర్పంచ్ మొదలు జిల్లా పరిషత్ చైర్మన్ వరకు హాజరయ్యే ఈ సమ్మేళనంలో కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన, పల్లె ప్రగతి కార్యక్రమాల నిర్వహణ వంటివాటిపై స్పష్టతనివ్వనున్నారు.

ముఖ్య అతిథులుగా మంత్రులు..: పంచాయతీరాజ్ సమ్మేళనాలకు జిల్లాల వారీగా ముఖ్య అతిథులుగా పాల్గొనే మంత్రుల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్, కరీంనగర్ జిల్లాలో గంగుల కమలాకర్, పెద్దపల్లి జిల్లాలో కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లాకు ఈటల రాజేందర్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో పువ్వాడ అజయ్‌కుమార్, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో శ్రీనివాస్‌గౌడ్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో నిరంజన్‌రెడ్డి, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో హరీశ్‌రావు, సూర్యాపేట, యాదాద్రి, నల్లగొండ జిల్లాల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ప్రశాంత్‌రెడ్డి, మేడ్చల్ జిల్లాలో మల్లారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సబితా ఇంద్రారెడ్డి, వరంగల్(గ్రామీణ), జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్(పట్టణ), మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొంటారు.

Nalgonda, Miryalguda, Suryapet: 7303762953

జనగణనలో బీసీలను లెక్కించాలి

17న కలెక్టరేట్ల ఎదుట నిరసనలు: బీసీ సంక్షేమ సంఘం

సాక్షి, హైదరాబాద్: జనగణనలో బీసీ కులాల వారిని కూడా లెక్కించాలని ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, దీక్షలు నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జనగణనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 31 కాలమ్‌లతో జనగణన చేపట్టాలని ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జనగణనలో ఎస్సీ, ఎస్టీలను పేర్కొని కేంద్రం బీసీలను విస్మరించిందని, దీనిని వ్యతిరేకిస్తూ ఈ నెల 17న కలెక్టరేట్ల ఎదుట నిరసనలు చేపడుతున్నట్టు తెలియజేశారు.

బీసీలకు 3 కమిషనర్ పోస్టులివ్వాలి: ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని, అందువల్ల ఇకపై నియమించబోయే 3 కమిషనర్ పోస్టులను బీసీలకే కేటాయించాలని సీఎం కేసీఆర్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఇటీవల నియమించిన ఐదుగురు సమాచార కమిషనర్లలో ఒక్క బీసీని కూడా నియమించకపోవడం అన్యాయమని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

National Rural Recreation Mission Society
Web.www.nrrmsvacancy.com / Mail:nrrmsvacancy@gmail.com

ADVERTISEMENT Dated 10th February/2020

NRR Mission Society intends to invite **Online Application** from eligible candidates for filling up following 1466 nos.of vacancies carrying attractive remuneration for *Deendayal Upadhyay Rural Infrastructure Development* (DDU-RID) Project of **Telangana State** viz.~

SL No.	Positions	No. of Posts
1	District Project Officer	16
2	Account Officer	19
3	Technical Assistant	33
4	Data Manager	48
5	MIS Manager	62
6	MIS Assistant	214
7	Multi-Tasking Official	228
8	Computer Operator	312
9	Field Coordinator	278
10	Facilitators	256

Applicants are advised to go through detailed advertisement which can be downloaded from **www.nrrmsvacancy.com** and satisfy themselves about their suitability in all parameter for the post before applying and fulfilling eligibility criteria of the posts as mentioned may **APPLY ONLINE** from **13th February/2020 to 05th March/2020** through website **www.nrrmsvacancy.com** only.

Sd/~,
CEO & Secretary
NRR Mission Society.

ప్రతీకారంతోనే కాల్పులు

- అక్కన్నపేట కాల్పుల ఘటనకు సంబంధించి రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన అంశాలు
- తిట్టి అవమానించారని కక్ష పెంచుకున్న సదానందం
- గంగరాజును చంపుదామనే ఏకే-47 తీసుకొచ్చాడు
- బాధిత కుటుంబం తలుపులు బిగించుకోవడంతో తప్పినముప్పు
- తుపాకుల అదృశ్యంపై చిక్కువీడని ప్రశ్నలు ఎన్నో!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన అక్కన్నపేట కాల్పుల ఘటనకు సంబంధించి రిమాండ్ రిపోర్టులో పలు సంచలన విషయాలు వెలుగు చూశాయి. బాధితుడు గంగరాజు తనను అవమానించాడని, అతడిని చంపి ప్రతీకారం తీర్చుకోవాలన్న లక్ష్యంతోనే అతని ఇంటిపై ఏకే-47 లక్ష్యంగా కాల్పులు జరిపాడని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. గంగరాజు ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. అయితే తుపాకుల అదృశ్యంపై రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న అంశాలు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

రిమాండ్ రిపోర్టులో ఏముందంటే..

గుంటి గంగరాజు, దేవుని సదానందంలు బంధువులు. ఈ నెల 5న గంగరాజు తల్లి ఎల్లవ్వ, సదానందం భార్య కృష్ణవేణికి మధ్య సిమెంటు ఇటుకల విషయంలో గొడవ పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గంగరాజు, అతని సోదరుడు అశోక్‌తో కలసి సదానందం ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో సదానందం, అతని భార్య కృష్ణవేణి, ఆమె మేనమామ వెంకటయ్యలతో గంగరాజు సోదరుల మధ్య వాగ్వాదం చెలరేగింది. ఈ క్రమంలో సదానంద ఫోన్ లాక్కున్న గంగరాజు.. నీ భార్యని కూడా ఇలాగే లాక్కెళతా.. దిక్కున్నచోట చెప్పుకో! అని వెళ్లిపోయాడు. దీన్ని అవమానకరంగా భావించిన సదానందం గంగరాజుపై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. తాను గతంలో హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో దొంగిలించిన ఏకే-47 తో గంగరాజును మట్టుబెట్టాలనుకున్నాడు. ఆయుధాన్ని బస్వాపూర్ గుట్టల్లోకి తీసుకెళ్లి పనిచేస్తుందో లేదో చూసుకున్నాడు. అది పనిచేయకపోవడంతో అక్కడే దానికి ఆయిల్ పోసి ఇంటికి తీసుకొచ్చాడు. అదేరోజు రాత్రి 9 గంటలకు తన ఇంటి వాకిట్లో కొన్ని రౌండ్లు కాల్చి పనిచేస్తుందని నిర్ధారించుకున్నాడు. ఈ శబ్దాలు విని బయటికి వచ్చిన పొరుగింటి వ్యక్తి దిలీప్‌కు గంగరాజు ఇంటివైపు తుపాకీ తీసుకుని వెళ్తున్న సదానందం కన్పించాడు.



అతను వెంటనే అశోక్‌కు ఫోన్ చేయడంతో బాధిత కుటుంబసభ్యులు ఇంటికి గడియపెట్టారు. దీంతో తెరిచి ఉన్న కిటికీలో నుంచి గంగరాజును లక్ష్యంగా సదానందం కాల్పులు జరిపాడు. అంతా నేలపై పడుకోవడంతో అవి గురి తప్పాయి. ఈలోగా అక్కడి స్థానికులు రావడంతో సదానందం అక్కడ నుంచి పారిపోయాడు. ఆ రోజు రాత్రంతా పక్కనే ఉన్న బొడిగేపల్లి గ్రామంలోని ఓ చెట్టు కింద తలదాచుకున్నాడు. మర్నాడు కోహెడ్ బస్టాప్‌కు వెళ్లాడు. అక్కడ చేతిలో సంచితో అనుమానాస్పదంగా ఉన్న సదానందంను పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి ఏకే-47 రైఫిల్ బట్ నం కేఆర్ 85. ఆర్సెనెల్ నం.ఏఎన్ 0815.. 25 లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించారు. అతడిచ్చిన సమాచారంతో ఇంట్లో ప్లాస్టిక్ పైపులో దాచిన కార్బన్ వెపన్ బట్ నం. కేఆర్ 122, ఆర్సెనల్ నం.16077508గా గుర్తించారు.

విచారణలో ఇదీ చెప్పింది..

2014లో మొదటి భార్యతో విడిపోయాక సదానందం రెండో వివాహం చేసుకున్నాడు. ఇందుకు కృష్ణవేణికి రూ.2 లక్షల కన్యాశుల్కం చెల్లించాడు. ఇందులో రూ.లక్ష బంగారం, మరో రూ.లక్ష నగదు రూపంలో ఇచ్చాడు. ఈ నగదును అధిక వడ్డీకి ఆశపడి కృష్ణవేణి బంధువైన గొట్టె కొమురవ్వకు అప్పుగా ఇచ్చారు. ఆమె బాకీని తిరిగి ఇవ్వకపోవటంతో 2016లో హుస్నాబాద్ ఠాణాలో ఆమెపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు అప్పు పత్రం అడగటంతో సదానందం నకిలీ పత్రం సృష్టించి తీసుకొచ్చాడు. అసలు పత్రంతో కొమురవ్వ స్టేషన్‌కి వచ్చింది. అయితే కొమురవ్వ వద్ద అప్పు అసలు పత్రం, రూ.లక్ష నగదు ఉన్న సంచిని దొంగిలించాడని ఆరోపిస్తూ ఆమె తన బంధువులతో కలసి సదానందంను అతని ఇంట్లోనే చితకబాదింది. దీంతో వీరిపై ఫిర్యాదు చేసేందుకు మరోసారి ఠాణాకు సదానందం వెళ్లాడు. తనపై దాడి చేసిన వారిపై పగ తీర్చుకోవాలనుకుని ఠాణా నుంచి తుపాకులను దొంగిలించాడు. కానీ, కృష్ణవేణి జోక్యంతో కొమురవ్వ డబ్బులివ్వడంతో వివాదం సమసిపోయింది. అప్పటి నుంచి తుపాకులను తన వద్దే పెట్టుకున్నాడు. ఇటీవల ఇటుకల విషయంలో వివాదం తలెత్తడంతో మరోసారి బయటికి తీశాడు.

ఆయుధాల అదృశ్యం కేసులో పోలీసుల తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. ఏకే-47 వెపన్, 30 లైవ్‌రౌండ్లు మిస్సయినా.. పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దాన్ని కనిపెట్టేందుకు సరిగా దర్యాప్తు చేయకపోవడం కూడా గమనార్హం.

- రిమాండ్ రిపోర్టులో వెపన్ ఏ తేదీన మిస్సయిన సంగతి ఎందుకు వెల్లడించలేదు.
- 9 ఎంఎం కార్బన్ కూడా తన వద్దే ఉందని నాలుగేళ్ల తర్వాత సదానందం చెబితేగానీ పోలీసులు తెలియలేదు.

ఈ ప్రశ్నలకు బదులేది..?

- ఇంతకాలం కార్బన్ వెపన్ ఉందని రికార్డుల్లో ఎలా చూపించగలిగారు?
- సిద్ధిపేట కమిషనరేట్‌లో హుస్నాబాద్ ఠాణా విలీనం అవుతున్న సమయంలో ఆయుధాల లెక్కింపు జరిగింది. ఏకే-47 రైఫిల్ మిస్సయిన విషయాన్ని గుర్తించిన అధికారులు కార్బన్ పిస్టల్ విషయం ఎందుకు గుర్తించలేకపోయారు? అంటే హుస్నాబాద్ సిబ్బంది అందుబాటులో ఉన్న కార్బన్‌ను రెండుసార్లు లెక్క చూపించారా?
- కార్బన్‌వెపన్ మిస్సింగ్‌పై పోలీసులు ఇప్పటికీ ఎఫ్.ఐ.ఆర్ ఎందుకు నమోదు చేయడం లేదు?
- కార్బన్ వెపన్ మిస్సింగ్ విషయాన్ని కమిషనరేట్ అధికారులకు తెలియనివ్వకుండా నాలుగేళ్లపాటు ఎలా దాచారు.
- ఏకే-47 వెపన్ పోయినందుకు నరేందర్ అనే కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకున్న అధికారులు కార్బన్ వెపన్ మాయం విషయంలో ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఇన్‌ఫెర్టిలిటీ నివారణ
ఒక్క అడుగు దూరంలోనే ఉంది.
నేడే నిపుణుడిని సంప్రదించండి

INDIRA IVF
FERTILITY & IVF CENTRE

సంతానం లేని జంటలకు

ఇన్‌ఫెర్టిలిటీ & టెస్ట్ ట్యూబ్ బేబీ
ఉచిత కన్సల్టేషన్ క్యాంప్

కరీంనగర్ 16 ఫిబ్రవరి, 2020
గద్వాల 17 ఫిబ్రవరి, 2020
నాగర్‌కర్నూల్ 18 ఫిబ్రవరి, 2020

SMS: ఉచిత కన్సల్టేషన్ కోసం మీ సీటు బుక్ చేసుకోడానికి IVF<space>HK/HG/HN అని టైప్ చేసి 56677 కు SMS పంపండి

అపాయింట్‌మెంట్ కోసం కాల్ చేయండి
7412077801

కన్సల్టేషన్ కోసం ఎవరు ఎంచుకోవచ్చు
- అతి తక్కువ వీర్య కణాల సంఖ్య
- వీర్య కణాలు అసలు లేకపోవడం
- వీర్య కణాలలో చలనం తక్కువగా ఉండడం
- నాణ్యత లేకపోవడం
- ఫాలోపియన్ ట్యూబ్‌లు మూసుకుపోవడం
- అండం ఏర్పడడంలో సమస్య
- క్రమరహితమైన రుతుక్రమం
- అకాలంలో అండాల విచ్ఛిన్నం

మూసుకుపోయిన ఫాలోపియన్ ట్యూబ్స్
స్త్రీలలో మూసుకుపోయిన ఫాలోపియన్ ట్యూబ్స్ ఇన్‌ఫెర్టిలిటీకి సాధారణమైన కారణం అవుతాయి. టెస్ట్ ట్యూబ్ బేబి (IVF) టెక్నిక్ దాదాపు నాలుగు దశాబ్దాల క్రిందటే అభివృద్ధి చేయబడింది. తమ ఫాలోపియన్ ట్యూబ్‌లు తెరుచుకోడానికి శస్త్రచికిత్స చేయించుకోకుండా తల్లి అయ్యేందుకు అనేకమంది స్త్రీలకు తమ కల నెరవేర్చుకోవడానికి ఈ విధానం తోడ్పడుతోంది.

మా ఫెర్టిలిటీ నిపుణులతో మీ సమస్యల గురించి చర్చించడానికి కాల్ చేయండి
7412077802 (2PM TO 5PM)

లభ్యమయ్యే సర్వీసులు: ఫెర్టిలిటీ చెకప్ • IUI • IVF • ICSI • లేజర్ హ్యాచింగ్ • బ్లాస్టోసిస్ట్ • ల్యాప్రోస్కోపి • హిస్టిరోస్కోపి • డోనార్ సర్వీసులు

ఇందిర IVF హాస్పిటల్ ప్రై. లిమిటెడ్
WWW.INDIRAIVF.COM

దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్): సుయోగ్-PRK టవర్స్, మూసారామ్‌బాగ్ మెట్రో స్టేషన్ ఎదురుగా, కరాచి బేకరీ పైన, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్.
బంజారాహిల్స్ (హైదరాబాద్): మహేష్ బ్యాంక్ ఎదురుగా, రోడ్ నం.12, A'la లిబర్టీ హోటల్ ప్రక్కన, బంజారాహిల్స్, హైదరాబాద్
సికింద్రాబాద్ (తెలంగాణ): భువన టవర్స్, CMR ఎక్స్‌క్లూజివ్ షాపింగ్ మాల్ పైన, సరోజినిదేవి రోడ్, మంజు థియేటర్ సమీపాన, సికింద్రాబాద్

• 83 Centres PAN India • Treatment protocol as per individual need • Patient friendly treatment options

Prenatal Sex Determination & Sex Selection is illegal and not done here.
Disclaimer : The models used in the creative is just for illustration purpose only.

'కరోనా, ఇతర అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాలు'

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్, ఇతర అంటువ్యాధులు ప్రబలకుండా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ బుధవారం ఆర్జేడీలు, డీఈవోలు, ఉపాధ్యాయ, కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీచేశారు. వీటికి సంబంధించి కేంద్ర కుటుంబ సంక్షేమ, వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ పలు సూచనలు చేసింది. కరోనా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తిచెందే వైరస్ అని, దీనికి సంబంధించి ఎలాంటి మందులు అందుబాటులో లేవని, రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. విద్యార్థులు వైరస్‌లు, అంటువ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని నేషనల్ హెల్త్ మిషన్ తెలిపింది. అందులో భాగంగా తరచుగా చేతులు కడుక్కోవడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతిరుమాలు అడ్డుపెట్టుకోవడం, టిష్యూ పేపర్లు వాడడం, అనారోగ్యంగా ఉన్నప్పుడు పాఠశాల, కళాశాలలకు దూరంగా ఉండడం, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో తిరగకూడదని సూచించింది.

13 నుంచి 15 వరకు ఎడిట్ ఆప్షన్

సాక్షి, హైదరాబాద్: వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం ఈ నెల 13 నుంచి 15 వరకు ఎడిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుందని టీఎస్‌పీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల బయోడేటాలో ఏవైనా తప్పులుంటే సవరించుకోవచ్చని పేర్కొంది. ఎడిట్ ఆప్షన్ ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. వివరాలకు అభ్యర్థులు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

ఉచిత శిక్షణకు15లోగా దరఖాస్తు చేసుకోండి

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలో గురుకుల ఉపాధ్యాయుల పోటీ పరీక్ష ఉచిత శిక్షణకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 15లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బాలాచారి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు కుటుంబ వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ అభ్యర్థులకు రూ.2 లక్షలు ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత జిల్లాలోని హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 040-24071178, 6302427521 నంబర్లలో, studycircle.cgg.gov.inను సందర్శించాలని సూచించారు.

సుత్తిలో బంగారం

దుబాయ్ నుంచి హైదరాబాద్ తరలిస్తూ పట్టుబడిన ముఠా

శంషాబాద్ రూరల్: పనిముట్టుగా వినియోగించే సుత్తిలో బంగారాన్ని ఉంచి స్మగ్లింగ్ చేస్తున్న ముగ్గురిని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం దుబాయ్ నుంచి ఒకరు, జైపూర్ నుంచి ఇద్దరు శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. దుబాయ్ నుంచి వచ్చిన వ్యక్తి తన చేతిలోని సూటుకేసును జైపూర్ నుంచి వచ్చిన వారికి ఇచ్చాడు. ఇది గమనించిన డీఆర్ఐ అధికారులు.. సూటుకేసును తనిఖీ చేయగా, సుత్తి కనిపించింది. దాన్ని కట్టర్‌తో తెరవగా, 931 గ్రాముల బంగారం ముక్కలు ఉన్నాయి. వీటి విలువ రూ.39 లక్షలని అధికారులు తెలిపారు. ముగ్గురునీ అదుపులోకి తీసుకున్నారు.

మిక్సీలో బంగారం 'మిక్స్'చేసి..: బుధవారం ఉదయం దుబాయ్ నుంచి వచ్చిన విమానంలో ఓ ప్రయాణికుడు మిక్సీని తెచ్చాడు. అనుమానం వచ్చిన అధికారులు మిక్సీ విడి భాగాలను వేరుచేసి పరిశీలించగా 1,725 గ్రాములు బంగారం బయటపడగా అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

హరితహారంలో పాల్గొందాం: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు హరితహారంలో భాగంగా పోలీసుశాఖలో ఉన్నతాధికారి నుంచి హోంగార్డు వరకు ప్రతీ ఒక్కరు కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హరితహారంలో అన్ని ప్రభుత్వ శాఖలు, పౌరులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, రాష్ట్రంలో గ్రీన్ కవరేజ్ పెంపొందించేందుకు గాను పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ విధిగా తమ పరిధిలోని ప్రభుత్వ స్థలాలలో గానీ, ప్రైవేటు స్థలాల్లో గానీ కనీసం ఒక మొక్క నాటాలని పేర్కొన్నారు. ఇటీవల కొత్తగా నియామకమై వివిధ శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న దాదాపు 10 వేల మంది రిక్రూటీలు కూడా ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని స్పష్టం చేశారు.

'కొత్త' రైల్వేస్టేషన్లలో యూజర్ చార్జీ!

న్యూఢిల్లీ: ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులపై విధించేలాంటి యూజర్ చార్జీలను కొత్తగా అభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్లలో విధించనున్నారు. దీంతో రైల్వే చార్జీల్లో కూడా పెంపు ఉంటుందని రైల్వే సీనియర్ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. యూజర్ డెవలప్‌మెంట్ ఫీ (యూడీఎఫ్) అనేది విమానాల్లో ప్రయాణికుడు చెల్లించే పన్నుల్లో భాగంగా ఉంటుంది. దీన్ని పలు ఎయిర్‌పోర్టుల్లో విధిస్తున్నారు. ఈవిధంగా వసూలు చేసే చార్జీ ఒక్కో స్టేషన్‌లో ఒక్కో రకంగా ఉంటుందని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ ఇక్కడి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎంత చార్జీ వసూలు చేస్తామనే విషయం మంత్రిత్వ శాఖ త్వరలో తెలియజేస్తుందని అన్నారు. అమృత్‌సర్, నాగ్‌పూర్, గ్వాలియర్, సబర్మతి రైల్వే స్టేషన్లను రూ.1,296 కోట్ల అంచనా వ్యయంతో పునరాభివృద్ధి చేయడంకోసం రైల్వే ప్రతిపాదనలు చేసిందన్నారు. 'వసూలు చేసిన చార్జీ స్టేషన్ల ఆధునీకరణకు తోడ్పడుతుంది. చార్జీలు నామమాత్రంగానే ఉంటాయి'అని యాదవ్ పేర్కొన్నారు.

గ్యాస్ మంట

- ఒక్క సిలిండర్‌పై రూ.144.5 పెంపు
- భగ్గుమన్న విపక్షాలు

న్యూఢిల్లీ: వంటగ్యాస్ ఎల్పీజీ ధర అమాంతం పెరిగింది. సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.144.5 పెంచుతూ కేంద్రం అసాధారణ నిర్ణయం తీసుకుంది. దీంతో ఢిల్లీలో రూ.714గా ఉన్న సిలిండర్ ధర రూ.858.50కి చేరుకుంది. 2014 జనవరి తర్వాత వంటగ్యాస్ ధర ఇంత భారీస్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరల పెరుగుదలే ఇందుకు కారణమని సమాచారం. అయితే కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌కు ఇచ్చే సబ్సిడీని పెంచడం కొంతవరకు ఊరటనిచ్చింది. ఇంతకు ముందు రూ.153.86 రాయితీ ఇవ్వగా దాన్ని రూ.291.48కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన (పీఎమ్‌యూవై) లబ్ధిదారులకు సబ్సిడీని రూ.174.86 నుంచి రూ.312.48కు పెంచింది. సాధారణంగా ప్రతినెలా ఒకటో తారీఖున ధరలను సమీక్షిస్తుంటారు. అయితే ఈసారి రాయితీని భారీగా పెంచడంతో అనుమతుల ప్రక్రియలో జాప్యంతో రెండు వారాలు ఆలస్యమైందని అధికారులు తెలిపారు. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలు వెలువడిన మరుసటి రోజే వంటగ్యాస్ ధర పెంచడం గమనార్హం. కాగా, ఈ పెంపుపై విపక్షాలు తీవ్రస్థాయిలో స్పందించాయి. వంటగ్యాస్ ధరను పెంచుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజల జేబులకు చిల్లు పెట్టేలా ఉందని కాంగ్రెస్ పేర్కొంది. ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతోనే కేంద్రం వంటగ్యాస్ ధరను పెంచిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరను పెంచడం పేద ప్రజలపై తీసుకున్న 'క్రూరమైన చర్య'అని బీఎస్పీ అధినేత్రి మాయావతి అభివర్ణించారు.

పల్లీల్లో పచ్చనోట్లు

- పల్లీలు, బిస్కెట్ ప్యాకెట్లలో రూ.45 లక్షలు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్
- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

న్యూఢిల్లీ: ఢిల్లీలోని విమానాశ్రయంలో ఓ వ్యక్తి నుంచి రూ. 45 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీని పట్టుకున్నట్లు సీఐఎస్ఎఫ్ బలగాలు బుధవారం చెప్పాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-3 వద్దకు మంగళవారం సాయంత్రం వచ్చిన మురాద్ అలీ (25) అనుమానాస్పదంగా వ్యవహరిస్తుండడంతో అధికారులు అతడి లగేజీని తనిఖీ చేశారు. దుబాయ్‌కు వెళ్లనున్న అతడి దగ్గర బిస్కెట్ ప్యాకెట్లు, పల్లీలు, ఉడికించిన మాంసపుముద్దలు ఉన్నాయి. అధికారులు వాటిని తెరచి చూడగా అందులో చిన్నగా చుట్టిన విదేశీ కరెన్సీ నోట్లు బయటపడ్డాయి. మొత్తం 508 నోట్లు ఉన్నాయని, వాటి విలువ భారత కరెన్సీలో రూ. 45 లక్షలు ఉంటుందని చెప్పారు. వేరుశనక్కాయల పైపొరను పగులగొట్టి అందులో నోట్లను ఉంచి, దాన్ని మళ్లీ జిగురుతో అంటించినట్లు కనుగొన్నారు. బిస్కెట్ ప్యాకెట్‌లో ప్రతి బిస్కెట్ తర్వాత ఓ నోటును ఉంచి ఆపై దాన్ని సీల్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ కరెన్సీని కస్టమ్స్ అధికారులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మురాద్ ఇప్పటికే పలుమార్లు దుబాయ్‌కి వెళ్లినట్లు గుర్తించారు.

హరియాణలోని మనేసర్‌లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న 20వ అంతర్జాతీయ సెమినార్ సందర్భంగా స్వదేశీ ఆయుధాన్ని పరీక్షిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి. కిషన్ రెడ్డి.

అధ్యక్షుడికి అదిరిపోయే ఆహ్వానం

- ప్రధాని మోదీ ప్రకటన
- అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి సబర్మతి వరకు రోడ్‌షో!
- 24, 25 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మెలానియా
- అహ్మదాబాద్‌లో 'హౌడీ మోదీ' తరహా సభ

న్యూఢిల్లీ: వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఫిబ్రవరి 24న భారత్‌కు రానున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చిరస్మరణీయ ఆహ్వానం పలుకుతామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ట్రంప్ భారత పర్యటన చాలా ప్రత్యేకమైనదని, ఇది అమెరికా-భారత్‌ల మధ్య స్నేహం బలపడేందుకు ఉపకరిస్తుందని మోదీ ట్వీట్ చేశారు. 'భారత్, అమెరికాలకు ప్రజాస్వామ్యం పట్లా, భిన్న భావాలకూ అవకాశం ఇచ్చే విషయంలో ఒకేరకమైన నిబద్ధత ఉన్నది. ఈ ఇరుదేశాల మధ్య స్నేహం, ఈ ఇరుదేశాల పౌరులకే కాకుండా యావత్ ప్రపంచానికి ఉపయోగపడుతుంది' అని మోదీ ట్వీట్ చేశారు. ఫిబ్రవరి 24, 25 తేదీల్లో ట్రంప్‌తో పాటు ఆయన భార్య మెలానియా రానున్నారు.

భారత్ పర్యటన కోసం వేచి చూస్తున్నా: ట్రంప్

భారత్ పర్యటనకోసం తాను వేచి ఉన్నానని ట్రంప్ ట్వీట్ చేశారు. మోదీ తనకు మంచి స్నేహితుడనీ అతను చాలా గొప్ప వ్యక్తి అని అమెరికా అధ్యక్ష భవనంలో మీడియాతో చెప్పారు.

సరైన ఒప్పందం కావాలి...

భారత్‌తో వాణిజ్య ఒప్పందం సాధ్యమేననీ అయితే అది సరైన ఒప్పందం కావాలని ట్రంప్ అన్నారు. అయితే ఇప్పటివరకూ ఈ రెండు దేశాలు అటువంటి ప్రయత్నాలేమీ చేయలేదని చెప్పారు.

అహ్మదాబాద్‌లో భారీ రోడ్ షో..

డొనాల్డ్ ట్రంప్ తన భారత పర్యటనలో భాగంగా ఈసారి ఢిల్లీలో కాకుండా నేరుగా అహ్మదాబాద్‌కి చేరుకుంటారు. సబర్మతి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్ లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి సబర్మతి ఆశ్రమం వరకు 10 కిలోమీటర్ల పొడవునా ఏర్పాటు చేయబోయే రోడ్‌షోలో ట్రంప్ పాల్గొననున్నారు. ఆ తరువాత అహ్మదాబాద్‌లోని మొటేరా ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తోన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్టేడియంను ట్రంప్-మోదీలు ఇద్దరూ ఆవిష్కరిస్తారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంకన్నా ఈ స్టేడియం పెద్దదని అధికారులు వెల్లడించారు. ఈ స్టేడియంలో 1.10 లక్షల మంది కూర్చునే అవకాశం ఉంది.

గుజరాత్ బడ్జెట్ సమావేశాలు వాయిదా...

ట్రంప్ పర్యటన నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ని ఫిబ్రవరి 26కి వాయిదా వేసింది. ట్రంప్ పర్యటనలో భాగంగా ఏర్పాటుచేయబోయే రోడ్ షో, బహిరంగ సభలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

హౌడీ ట్రంప్..

గత యేడాది సెప్టెంబర్‌లో అమెరికాలోని హ్యూస్టన్‌లో 'హౌడీ మోదీ' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇదే వేదికపై నుంచి మోదీ, ట్రంప్ ఉపన్యసించారు. ఈ సభకు అమెరికాలో ఉంటోన్న దాదాపు 50,000 మంది భారతీయులు హాజరయ్యారు. అదే తరహాలో ట్రంప్‌రాక దృష్ట్యా అహ్మదాబాద్‌లో 'హౌడీ ట్రంప్'పేరిట భారీ సభను ఏర్పాటు చేయాలని భారత్ భావిస్తోంది. సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు దాదాపు లక్షమంది జనం హాజరుకానున్నారు. ఈ సభను ఉద్దేశించి మోదీ, ట్రంప్‌లు ప్రసంగించనున్నారు.

క్లుప్తంగా...

కశ్మీర్ అభ్యర్థులకు వయో పరిమితి సడలింపు లేదు!

సివిల్స్ నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ: ఈ సంవత్సరం(2020) సివిల్ సర్వీసెస్ పరీక్ష రాస్తున్న జమ్మూకశ్మీర్ యువతకు గరిష్ట వయోపరిమితి విషయంలో మినహాయింపు ఇవ్వడం లేదు. గత సంవత్సరం 1980-89 మధ్య అప్పటి జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో శాశ్వత నివాసులైన సివిల్స్ అభ్యర్థులకు ఐదేళ్ల గరిష్ట వయోపరిమితిని 32 ఏళ్ల నుంచి ఐదేళ్ల పాటు పెంచారు. తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆ సడలింపును ఎత్తేశారు. 796 ఖాళీలతో 2020 సంవత్సర సివిల్స్ పరీక్షల నోటిఫికేషన్‌ను బుధవారం యూపీఎస్సీ జారీ చేసింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి ఐదేళ్లు, ఇతర వెనకబడిన వర్గాల వారికి మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎన్నికల్లో బ్లాక్‌చైన్ వ్యవస్థ

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా

న్యూఢిల్లీ: ఐఐటీ మద్రాస్‌తో కలసి బ్లాక్ చైన్ వ్యవస్థపై పనిచేస్తున్నామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా చెప్పారు. ఢిల్లీలో బుధవారం జరిగిన 'టైమ్స్ నౌ సమిట్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈవీఎంల గురించి పలు విషయాలు మాట్లాడారు. బ్లాక్‌చైన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఒక ఓటర్ వేరే రాష్ట్రంలో ఉండి కూడా తమ రాష్ట్రంలోని ఎన్నికల్లో ఓటేయవచ్చని చెప్పారు. ఉదాహరణకు రాజస్తాన్‌కు చెందిన వ్యక్తి చెన్నైలో ఉద్యోగం చేస్తుంటే, రాజస్తాన్‌లో జరిగే ఎన్నికలకు చెన్నైలోనే ఓటేయవచ్చు. కారు లేదా పెన్నులాగే ఈవీఎంలు కూడా మొరాయించవచ్చేమోగానీ టాంపర్ చేయడం అసాధ్యమని చెప్పారు.

అప్ప కోసం వెళ్తుంటే అదృష్టం ఎదురొచ్చే..

కన్నూర్: అదృష్టమంటే కేరళలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న పొరున్నన్ రాజన్‌దే. తాను గతంలో చేసిన అప్పులు తీర్చేందుకు కొత్త అప్పు కోరుతూ బ్యాంకుకు వెళుతూ దారి మధ్యలో కొన్న లాటరీ టికెట్‌కు రూ.12 కోట్ల జాక్‌పాట్ తగిలింది. ఇటీవల మాలూర్ కైథచాలాకు చెందిన రాజన్.. కూతుపరంబాలోని బ్యాంక్‌లో అప్పు కోసం బయల్దేరారు. మార్గమధ్యంలో పయ్యన్ ఏజెన్సీలో కేరళ స్టేట్ లాటరీస్ వారి క్రిస్మస్-కొత్త ఏడాది లాటరీ టికెట్ కొన్నారు. లాటరీ టికెట్లకు డబ్బు తగలేస్తున్నావని తిడుతుందని భార్యకు కూడా ఈ విషయం చెప్పలేదు. అయితే, సోమవారం వార్తా పత్రికల్లో 'కూతుపరంబాకు చెందిన వారికి లాటరీ' అన్న వార్త చదివారు. వెంటనే తన టికెట్ నంబర్ చెక్ చేసుకోగా తనకే లాటరీ వచ్చిందని తెలిసి ఉబ్బితబ్బిబయ్యారు. తన అప్పులను తీర్చేస్తానని, ఆగిపోయిన ఇంటి పనులను పూర్తి చేస్తానని, కుదువపెట్టిన భార్య నగలను తిరిగితెస్తానని రాజన్ చెప్పారు.

అన్ని వైరస్‌లకు ఒకే టీకా!

బోస్టన్: చైనాలో పుట్టి సుమారు 30 దేశాలకు వ్యాప్తి చెందిన కోవిడ్(కరోనా వైరస్)తోపాటు అన్ని రకాల వైరస్‌ల నుంచి రక్షణ కల్పించేందుకు ఒక సార్వత్రిక వ్యాక్సిన్ తయారీకి మార్గం సుగమమైంది. ఆర్గోనాట్4 క్లుప్తంగా ఏజీఓ4 అని పిలిచే ఒక ప్రోటీన్ అన్ని వైరస్‌లను ఎదుర్కోగలదని మసాచూసెట్స్ జనరల్ ఆసుపత్రి శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు. అనేక రకాలైన వైరస్‌ల నుంచి కణాలను రక్షించేందుకు ఏజీఓ4 ఉపయోగపడుతుందని, క్షీరదాల రోగ నిరోధక కణాల విషయంలో ఇది వైరస్‌లకు వ్యతిరేకంగా పోరాడుతుందని ఈ శాస్త్రవేత్త కేట్ ఎల్.జెఫ్రీ తెలిపారు.

'పెస్టిసైడ్స్' నియంత్రణకు బిల్లు

- ఈ సమావేశాల్లోనే సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం
- బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే పురుగు మందుల వ్యాపార నియంత్రణ బిల్లును సభలో ప్రవేశపెట్టనుంది. పురుగు మందుల వ్యాపార క్రమబద్ధీకరణతో పాటు, నకిలీ పురుగుమందుల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించే ప్రతిపాదనను కూడా బిల్లులో చేర్చారు. ఈ 'పెస్టిసైడ్స్ మేనేజ్‌మెంట్ బిల్-2020'ని బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదించింది. 'ప్రస్తుతం పురుగుమందుల వ్యాపారం ఇన్‌సెక్టిసైడ్ యాక్ట్ - 1968 నిబంధనల ప్రకారం జరుగుతోంది. ఆ నిబంధనలకు కాలం చెల్లింది. అందుకే కొత్త బిల్లును రూపొందించాం' అని సమాచార ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా, వారికి సురక్షితమైన, ప్రభావశీలమైన పురుగుమందులు అందించడం, నకిలీ పురుగుమందులను అరికట్టడం లక్ష్యంగా ఈ బిల్లు రూపొందిందన్నారు. ఆయా పురుగు మందులకు సంబంధించిన సమస్త సమాచారం డీలర్ల నుంచి రైతులకు అందేలా నిబంధనలు రూపొందించామన్నారు. అలాగే, సేంద్రియ పురుగుమందుల వాడకాన్ని ప్రోత్సహించే ప్రతిపాదనలను కూడా తాజా బిల్లులో చేర్చామన్నారు. నకిలీ రసాయన మందుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ఒక సెంట్రల్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పెస్టిసైడ్స్ కంపెనీల నుంచి వసూలు చేసిన జరిమానాకు, అవసరమైతే కొంత కలిపి కేంద్రం ఆ ఫండ్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. పురుగుమందుల ప్రచారాన్ని క్రమబద్ధీకరించే ప్రతిపాదన కూడా తాజా బిల్లులో ఉందన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే పురుగు మందుల తయారీ సంస్థలకు రూ. 25 వేల నుంచి రూ. 50 లక్షల వరకు జరిమానా విధించే ప్రతిపాదనను ఆ ముసాయిదా బిల్లులో చేర్చారు. నిబంధనలను అతిక్రమించేవారికి జైలు శిక్షను ఐదేళ్లవరకు పెంచే ప్రతిపాదనను తాజా బిల్లులో చేర్చారు.

పన్ను చెల్లింపును బాధ్యతగా భావించండి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ

న్యూఢిల్లీ: పన్ను వ్యవస్థలో మార్పులు చేసేందుకు గత ప్రభుత్వాలు జంకాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత పన్ను వ్యవస్థలో సానుకూల మార్పులు తీసుకువచ్చామని, పన్ను చెల్లింపుదారుడు కేంద్రంగా ఆ వ్యవస్థను మార్చామని వివరించారు. ఆంగ్ల వార్తాచానెల్ 'టైమ్స్ నౌ' నిర్వహించిన ఒక సదస్సులో బుధవారం ప్రధాని ప్రసంగించారు. దేశాభివృద్ధికి పన్ను ఆదాయం అవసరమని, అందువల్ల పన్ను పరిధిలో ఉన్నవారంతా తమ పన్నులను చెల్లించాలని కోరారు. పన్ను చెల్లింపును ఒక బాధ్యతగా, గౌరవంగా భావించాలని విజ్ఞప్తి చేశారు. పన్ను ఎగ్గొట్టేందుకు కొందరు చేసే ప్రయత్నాల వల్ల నిజాయితీగా పన్ను చెల్లించేవారు ఇబ్బందులు పడుతున్నారని ప్రధాని వ్యాఖ్యానించారు. 'పన్ను చెల్లింపుదారుల హక్కులను స్పష్టంగా పేర్కొన్న అత్యంత పారదర్శక పన్ను చట్టం అమల్లో ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. భారత్‌లో పన్ను చెల్లింపుదారులను వేధింపులకు గురి చేసే కాలం త్వరలోనే అంతరించిపోతుందని మీకు హామీ ఇస్తున్నా' అన్నారు. పన్నులు చెల్లించకుండా ఉండేందుకు దారులు వెతికే కొందరివల్ల నిజాయితీగా తమ పన్నులను చెల్లిస్తున్నవారిపై అదనపు భారం పడుతోందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. 'కోటి రూపాయల వార్షికాదాయం చూపిన వారి సంఖ్య దేశవ్యాప్తంగా కేవలం 2200 మాత్రమే అన్నది నమ్మశక్యం కాని నిజం' అన్నారు.

సయీద్‌కు 11 ఏళ్ల జైలు

లాహోర్: ముంబై ఉగ్రదాడుల సూత్రధారి, జమాత్ ఉద్ దవా అధ్యక్షుడు హఫీజ్ సయీద్‌కు పాక్‌లో జైలు శిక్ష పడింది. ఉగ్రవాదానికి నిధులు అందించారన్న కేసులో విచారణ జరిపిన పాకిస్తాన్‌లోని ఉగ్రవ్యతిరేక (ఏటీసీ) పదకొండేళ్ల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. సయీద్‌తోపాటు అతడి సన్నిహిత సహచరుడు జఫర్ ఇక్బాల్‌కూ 11 ఏళ్ల శిక్ష విధిస్తూ ఏటీసీ జడ్జి అర్షద్ హుస్సేన్ భుట్టా ఆదేశాలు జారీ చేశారు. సయీద్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ఐక్యరాజ్య సమితి గతంలోనే ప్రకటించింది. అతడి తలకు అమెరికా గతంలో కోటి డాలర్ల వెలకట్టింది. గత ఏడాది జూలై 17న అరెస్ట్ అయిన సయీద్ లాహోర్‌లోని కోట్ లఖ్‌పత్ జైల్లో ఉన్నారు. లాహోర్, గుజ్రన్‌వాలాల్లో దాఖలైన రెండు కేసుల్లో సయీద్‌కు శిక్ష విధించారని, ఒక్కో కేసులో ఐదున్నర ఏళ్లు జైలు శిక్ష, మొత్తం 15 వేలరూపాయల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని, రెండు శిక్షలు ఒకేసారి అమలవుతాయని కోర్టు అధికారి ఒకరు తెలిపారు. ఏటీసీ కోర్టు గత ఏడాది డిసెంబర్ 11న సయీద్, అతడి సన్నిహిత సహచరులను దోషులుగా ప్రకటించగా..శిక్ష ఖరారును ఫిబ్రవరి 11వ తేదీ వరకూ వాయిదా వేయడం తెల్సిందే. ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందిస్తున్న వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామన్న పాకిస్తాన్ హామీని నెరవేర్చాలని పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ ఒకటి ఇచ్చిన పిలుపుతో పాక్ ప్రభుత్వం సయీద్, అతడి అనుచరులపై విచారణ ప్రారంభించింది.

16న కేజ్రీవాల్ ప్రమాణం

- వేదిక: రామ్‌లీలా మైదానం
- భారీస్థాయిలో సన్నాహాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయభేరి మోగించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా 16న ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రామ్‌లీలా మైదానం ఈ కార్యక్రమానికి వేదిక కానుంది. ప్రజలందరూ ప్రత్యక్షంగా వీక్షించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆప్ నేత మనీష్ సిసోడియా చెప్పారు. కేజ్రీవాల్‌తో పాటు కేబినెట్ మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రజలందరూ పెద్ద ఎత్తున కదిలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు కేజ్రీవాల్ కొత్తఎమ్మెల్యేలతో తన నివాసంలో భేటీ అయ్యారు. ఎమ్మెల్యేలందరూ లాంఛనప్రాయంగా కేజ్రీవాల్‌ను ఆప్ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత కేజ్రీవాల్ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌ను కలసి కొత్త ప్రభుత్వ ఏర్పాట్లపై చర్చించారు.

భారీగా జన సమీకరణ

ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ ప్రమాణస్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆప్ సన్నాహాలు చేస్తోంది. భారీగా జన సమీకరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.. ఒకప్పుడు అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమానికి వేదికగా నిలిచిన రామ్‌లీలా మైదానంలో ఆయనకు కుడిభుజంగా పని చేసి దేశ ప్రజలందరి దృష్టిని కేజ్రీవాల్ ఆకర్షించారు.

కేబినెట్‌లో పాత ముఖాలే ?

గత ప్రభుత్వంలో పనిచేసిన వారికే మళ్లీ కేజ్రీవాల్ కేబినెట్‌లో అవకాశం ఇవ్వనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి ఎలాంటి మార్పులు చేయకపోవచ్చునని తెలుస్తోంది. మనీశ్ సిసోడియా, రాజేంద్ర పాల్ గౌతమ్, సత్యేంద్ర జైన్, కైలాస్ గెహ్లోట్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్‌లు కొత్త కేబినెట్‌లో చోటు దక్కించుకోనున్నారు. ఈసారి ఎన్నికల ప్రచారంలో హోరెత్తించి, ఆప్ విద్యా రంగ సంస్కరణల్లో భాగస్వామిగా నిలిచిన ఆప్ నాయకురాలు అతిషి మర్లేనా, పార్టీకి కొత్త శక్తిగా మారిన రాఘవ్ చద్దాకు ఆర్థిక శాఖ కట్టబెడతారన్న ప్రచారమూ సాగింది.

'కోవిడ్' మృతులు 1,115

వాహనం దిగే డ్రైవర్లు, ప్రయాణికులకు వైరస్ సోకకుండా ఉండేందుకు హైవే టోల్‌ప్లాజా వద్ద చెల్లింపుల కోసం డ్రోన్ సాయంతో క్యూఆర్ కోడ్‌ను వాహనాల వద్దకే పంపిస్తున్న దృశ్యం. చైనాలోని షెంజెన్‌లో తీసిందీ ఫొటో.

బీజింగ్: రోజులు గడుస్తున్నా చైనాలో కోవిడ్-19 (కరోనా వైరస్) కల్లోలానికి అంతం లేకుండా పోతోంది. గత ఏడాది డిసెంబర్‌లో తొలికేసు నమోదైన నాటి నుంచి చూస్తే మంగళవారం నాటికి వైరస్ బాధితుల మరణాల సంఖ్య 1,115కు చేరింది. ప్రస్తుతం 44,763 మంది వ్యాధి బారినపడినట్లు చైనా ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం తెలిపారు. జపాన్ తీరంలో లంగరేసిన డైమండ్ ప్రిన్సెస్ క్రూయిజ్ నౌకలో తాజాగా 39 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో నౌకలో వైరస్ బాధితుల సంఖ్య 174కు చేరింది. మొత్తం 3700 మంది ప్రయాణీకులు ఉన్న ఈ నౌకలో ఇంకా వందలాది మందికి వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉందని జపాన్ ఆరోగ్య మంత్రి కట్సునోబూ కాటో తెలిపారు. కోవిడ్ బారిన పడినట్లు అనుమానిస్తున్న ఇద్దరు మహిళలు రష్యాలోని ఆసుపత్రి నుంచి పరారైనట్లు రష్యా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు సరిగా సహకరించకపోవడం, ఆసుపత్రిలోని పరిస్థితులు, వైరస్ సోకుతుందేమో అన్న భయం కారణంగానే తాము పారిపోయినట్లు ఆ మహిళలు చెప్పినట్లు వార్తలొచ్చాయి.

ఇద్దరు భారతీయులకు కోవిడ్

టోక్యో: జపాన్‌లో క్రూయిజ్ నౌకలో చిక్కుకున్న 138 మంది భారతీయుల్లో ఇద్దరికి కోవిడ్ సోకినట్లు జపాన్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. వ్యాధి సోకిన వారిని ఆస్పత్రులకు తరలించి జపనీస్ నియమనిబంధనల ప్రకారం చికిత్స అందిస్తున్నామని జపాన్ అధికారులు పేర్కొన్నారు. కోవిడ్ వైరస్ ఉన్నందున ఈ నెల 19 వరకూ క్రూయిజ్ నౌకను తమ అదుపులోనే ఉంచుకోనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు భారత రాయబార అధికారులు జపాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

కీలక నిందితుడిని స్వేచ్ఛగా వదిలేస్తారా?

సీబీఐకి ఢిల్లీ కోర్టు అక్షింతలు

రాకేశ్ ఆస్థానా

న్యూఢిల్లీ: సొంత డీఎస్పీని అరెస్ట్ చేసి, కీలక నిందితుడిని స్వేచ్ఛగా వదిలేయడంపై సీబీఐకి ఢిల్లీ కోర్టు అక్షింతలు వేసింది. సీబీఐ మాజీ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా అవినీతికి సంబంధించిన ఒక కేసును సీబీఐ స్పెషల్ కోర్టు విచారించింది. ఈ కేసులో కీలక నిందితుడిగా అనేక ఆధారాలు కన్పిస్తున్న సోమేశ్వర్ శ్రీవాస్తవను అరెస్ట్ చేయకపోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. కేసులో మధ్యవర్తిగా వ్యవహరించిన దుబాయ్ వ్యాపారి, ప్రధాన నిందితుడు అయిన మనోజ్ ప్రసాద్‌కు శ్రీవాస్తవ్ సోదరుడవుతాడు. 'శ్రీవాస్తవ్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదు? మనోజ్ ప్రసాద్ కన్నా ఈయనే కీలకంగా కనిపిస్తున్నాడు. ఆయనను స్వేచ్ఛగా ఎందుకు వదిలేశారు? మీరు మీ సొంత డీఎస్పీనే అరెస్ట్ చేశారు. కేసులో పెద్ద పాత్ర పోషించినవారిని వదిలేశారు' అని సీబీఐ కోర్టు న్యాయమూర్తి సంజీవ్ అగర్వాల్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన సీబీఐ.. శ్రీవాస్తవ్ పాత్రపై దర్యాప్తు జరుపుతున్నామని వివరణ ఇచ్చింది. దేశం విడిచి వెళ్లకుండా ఆయనపై ఎల్ఓసీ(లుక్ ఔట్ సర్క్యులర్) జారీ చేశామంది. దీనిపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'ఎల్ఓసీ ఎందుకు? దాంతో ఏం లాభం. భారత దేశం చాలా పెద్దది. ఇక్కడే హ్యాపీగా లైఫ్‌ను ఎంజాయ్ చేయొచ్చు' అని పేర్కొన్నారు. మనోజ్ ప్రసాద్ కన్నా శ్రీవాస్తవ్‌కు వ్యత

సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 13

ట్రంప్ భారత్ బాట

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ నెల 24, 25 తేదీల్లో మన దేశం పర్యటించబోతున్నారు. దీన్ని మన దేశం మాత్రమే కాదు...ట్రంప్ సైతం విశేషమైన సందర్భంగా పరిగణిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2017లో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్‌ను అనేకసార్లు కలిశారు. కానీ ట్రంప్ తొలిసారి మన దేశం వస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు మరో తొమ్మిది నెలల్లో రాబోతుండగా జరగనున్న ఈ పర్యటన అనేకవిధాల కీలకమైనది. ఈ పర్యటనపై ఇరువైపులా చాలా ఆశలున్నాయి. అతి పెద్ద మార్కెట్ అయిన భారత్‌తో వాణిజ్య, రక్షణ, ఇంధన రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుని దేశానికి దండిగా ప్రయోజనం చేకూర్చానని చెప్పుకోవడం ట్రంప్‌కు చాలా అవసరం. అలాగే అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాల్లో రెండు దేశాల మధ్యా సమన్వయం మరింత పెరగాలని అమెరికా కోరుకుంటోంది. వాణిజ్య రంగంలో ఉన్న లోటును సరిచేసి అమెరికా ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడాలని ట్రంప్ చాన్నాళ్లుగా తహతహలాడుతున్నారు. భారత్ ఉత్పత్తులపై తాము తక్కువ టారిఫ్‌లు విధిస్తున్నా, తమ ఉత్పత్తులపై మాత్రం ఆ దేశంలో అధికంగా వసూలు చేస్తున్నారని, ఇందువల్ల తాము భారీగా నష్టపోతున్నామని ట్రంప్ మొదటినుంచీ ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ఆయనకు భారత్‌పైన మాత్రమే కాదు... చైనాతో సహా చాలా దేశాలపై ఫిర్యాదులున్నాయి. మన దేశంపై ఒత్తిడి పెంచి తమ ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గేలా చూడాలని చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో నిరుడు మార్చిలో ఆయన సాధారణ ప్రాధాన్యతల వ్యవస్థ(జీఎస్‌పీ) కింద అర్ధ శతాబ్దంగా మనకిస్తున్న వెసులుబాట్లు రద్దు చేయాలని నిర్ణయించారు. ఇందువల్ల భారత్ 560 కోట్ల డాలర్లు నష్టపోయిందని అమెరికా చెబుతోంది. మన దేశం వాదన మరోలావుంది. తమ టారిఫ్‌లు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నిబంధనలకు లోబడే వున్నాయని మన ప్రభుత్వం తెలిపింది. అయినా ట్రంప్ అంగీకరించలేదు. దాంతో మన దేశం కూడా అమెరికా నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులపై అదనపు టారిఫ్‌లు విధించడం మొదలుపెట్టింది.

తన ఏలుబడిలో అమెరికా ప్రయోజనాలు నెరవేరుతున్నాయన్న అభిప్రాయం అందరిలో కలిగించడం ఈ తరుణంలో ట్రంప్‌కు చాలా అవసరం. రెండు దేశాలూ గతంలో కుదుర్చుకున్న కీలక భాగస్వామ్య ఒప్పందం పని తీరు ఎలావున్నదో సమీక్షించి, దాన్ని మరింత పటిష్టవంతం చేయడానికి ఎలాంటి చర్యలు అవసరమో అధినేతలిద్దరూ చర్చించుకునే అవకాశంవుంది. అలాగే ప్రస్తుత పర్యటనలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరాలని, తమ వ్యవసాయ ఉత్పత్తులు, వైద్య పరికరాలు భారత్ మార్కెట్‌ను ముంచెత్తాలని ఆయన బలంగా కోరుకుంటున్నారు.అయితే వాణిజ్య ఒప్పందంపై సంతకాలవుతాయా, ఆ ఒప్పందంపై అవగాహన మాత్రమే కుదురుతుందా అన్నది చూడాల్సివుంది. ట్రంప్ పర్యటనకు ముందే ఈ ఒప్పందానికి మెరుగులు దిద్దాలని ఇరు దేశాల అధికారులూ ప్రయత్నిస్తున్నా, పలు అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సమావేశాల కోసం మోదీ అమెరికా వెళ్లినప్పుడు కూడా పరిమిత వాణిజ్య ఒప్పందంపై సంతకాలవుతాయని అనుకున్నారు. అయితే అది నెరవేరలేదు. ఏకీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ అమ్మకానికి సంబంధించిన రక్షణ ఒప్పందం ఈ పర్యటనలో కుదిరే అవకాశం వుంది. వీటి సంగతలావుంచి పనిలో పనిగా తమ దేశంలోని ఎన్నారైల ఆదరణ పొంది, వారి ఓట్లు సంపాదించడానికి భారత్ పర్యటన ఉపకరిస్తుందని ట్రంప్ భావిస్తున్నారు.

ఇక్కడ జరిపే పర్యటనపై ట్రంప్ ఎంతగా ఆత్రుత పడుతున్నారో ఆయన మాటల్నిబట్టే పోల్చుకోవచ్చు. పర్యటన సందర్భంగా గుజరాత్ సందర్శన కూడా వుంటుందని, ఆ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో విమానాశ్రయం నుంచి సభ జరిగే స్టేడియం వరకూ స్వాగతం చెప్పేందుకు 50 నుంచి 70 లక్షలమంది ప్రజానీకం హాజరవుతారని ప్రధాని మోదీ తనకు చెప్పారని ట్రంప్ ప్రకటించారు. ఆ సభలో మోదీతోపాటు ట్రంప్ కూడా ప్రసంగించబోతున్నారు. నిరుడు సెప్టెంబర్‌లో అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో 'హౌడీ మోదీ' పేరిట నిర్వహించిన మెగా ఈవెంట్‌ను ఎవరూ మరిచిపోరు. దానికి దాదాపు 50,000మంది హాజరయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరు నేతలూ స్టేడియం అంతా కలియతిరిగి సభికులకు అభివాదం చేశారు. మోదీ ఆ సభలో మాట్లాడుతూ 'అబ్ కీ బార్-ట్రంప్ సర్కార్' నినాదం ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడొకరు వేరే దేశాల నేతలు పర్యటనకొచ్చినప్పుడు నిర్వహించే సభల్లో పాల్గొన్న దాఖలా అంతక్రితం లేదు. అలాగే మన ప్రధానులు కూడా గతంలో అక్కడి ఎన్నికల్లో ఫలానా వారికి ఓటేయమని చెప్పిన సందర్భం లేదు. డెమొక్రాట్లకు పట్టుండే టెక్సాస్ రాష్ట్రంలోని హ్యూస్టన్ నగరంలో పెద్ద సభ జరగడం, మన ఎన్నారైలంతా ఉత్సాహంగా పాల్గొనడం తనకు రాజకీయంగా మేలు కలిగిస్తుందని ట్రంప్ భావించారు. ఇప్పుడు అహ్మదాబాద్ సందర్శన కోసం ఆ ఉద్దేశంతోనే ఆయన ఎదురుచూస్తున్నారు. అమెరికాలో స్థిరపడిన భారతీయుల్లో గుజరాత్ పౌరులు గణనీయంగా వుంటారు. సాధారణంగా అధ్యక్షుడికే రెండో దఫా అవకాశం ఇవ్వడం అమెరికాలో రివాజు. గత శతాబ్దకాలంలో కేవలం నాలుగు సందర్భాల్లో మాత్రమే అందుకు భిన్నంగా జరిగింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ సజావుగా వుంటే రెండోసారి ఎన్నిక కావడం పెద్ద కష్టం కాదు.

అయితే ట్రంప్ తీసుకుంటున్న కొన్ని కఠిన చర్యల వల్ల అక్కడ చదువు కోసమో, ఉద్యోగాల కోసమో వెళ్లిన భారతీయులకు సమస్యలెదురవుతున్నాయి. కఠినమైన వీసా నిబంధనలను చూపి ఆ దేశంలో చదువుకుంటున్న అనేకమందిని అమెరికా వెనక్కి పంపింది. ఉపాధి విషయంలోనూ ఇలాంటి సమస్యలే ఎదురవుతున్నాయి. ట్రంప్ పర్యటనలో మన దేశం వీటిని కూడా లేవనెత్తితే అక్కడున్న వారికి ఉపశమనం దొరుకుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.పంచమి రా.2.32 వరకు, తదుపరి షష్ఠి నక్షత్రం హస్త ప.2.43 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం రా.10.11 నుంచి 11.40 వరకు, దుర్ముహూర్తం ఉ.10.21 నుంచి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.38 వరకు అమృతఘడియలు... ఉ.9.10 నుంచి 10.35 వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

స్వీయ తప్పిదాలతోనే ఈ దుస్థితి

విశ్లేషణ

సి. రామచంద్రయ్య

రాజకీయ ప్రాధాన్యత గలిగిన ఏ చిన్న అంశాన్నీ వదలకుండా అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా మీడియా సమావేశాలను నిర్వహించి గంటల కొద్దీ తెచ్చిపెట్టుకొన్న ఆవేశం, ఆవేదనతో మాట్లాడే అలవాటు ఉన్న చంద్రబాబు తన వ్యక్తిగత సహాయకుడిపై, తదితరులపై తాజా ఐటీ దాడుల గురించి ఎందుకు మాట్లాడటం లేదు? 2050 వరకు తామే అధికారంలో ఉంటామనే ధీమాతో చట్టాల్ని చాపలా చుట్టిన చంద్రబాబు అండ్ కోకు ఇప్పుడు చుక్కలు కనపడుతున్నాయి. అధికారంలో ఉండగా చంద్రబాబు, ఆయన తాబేదార్లుగా పనిచేసిన అధికారులు పాల్పడిన అవినీతి, అక్రమాలపై కేంద్రప్రభుత్వ సంస్థలు నేడు దృష్టి సారించాయి. వాటి లోతు తెలుసు కాబట్టే బాబు తన అనుయాయులపై ఐటీదాడుల పట్ల వ్యాఖ్యానించకుండా కుక్కిన పేనులా పడిఉంటున్నారు. చంద్రబాబు స్వయంకృత పాపాల పంట పండుతున్నట్లుంది.

'చట్టం ఎవరికీ చుట్టం కాదు' ఓ పాపులర్ తెలుగు సినిమాలో విలన్‌ను ఉద్దేశించి హీరో పలికిన డైలాగ్ ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుకు, అధికారంలో ఉండగా ఆయనకు తాబేదార్లుగా పనిచేసిన కొంత మంది అధికారులకు సరిగ్గా అన్వయిస్తుంది. 2050 వరకు తామే అధికారంలో ఉంటామనే ధీమాతో చట్టాల్ని చాపలా చుట్టిన చంద్రబాబు అండ్ కోకు ఇప్పుడు చుక్కలు కనపడుతున్నాయి. పాపాలు చేస్తే అవి వెంటాడటం, మెడకు చుట్టుకోవడం ఎవరికైనా సహజమే. ఇందుకు అనుగుణంగానే చంద్రబాబుకు బినామీలుగా, తాబేదారులుగా వ్యవహరించి ప్రజాధనాన్ని కొల్లగొట్టిన కొందరు వ్యక్తులపై చట్టం తన పని తాను చేసుకుపోతోంది. కొన్ని వ్యవస్థలను తన అదుపాజ్ఞల్లో ఉంచుకోగలిగిన 'రాజకీయ కళ' చంద్రబాబుకు ఉన్న మాట నిజం. కానీ, చంద్రబాబు విద్యల కంటే 'చట్టం' గొప్పది. కొంత ఆలస్యం కావచ్చునేమో గానీ.. అక్రమాలను కప్పిపుచ్చడం ఎవరికీ సాధ్యం కాదు.

15 ఏళ్లపాటు తన వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన ఓ సాధారణ ప్రభుత్వోద్యోగి ఇంటి మీద ఢిల్లీ నుంచి వచ్చిన ఐటీ అధికారుల బృందం 5 రోజులపాటు నిర్విరామంగా సోదాలు నిర్వహించి పలు కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకొన్న ఉదంతంలో రోజులు గడుస్తున్నా పల్లెత్తు వ్యాఖ్య చేయడానికి చంద్రబాబు సాహసించలేకపోతున్నారు. కొన్ని నెలల క్రితం వరకూ.. టీడీపీకి చెందిన వ్యక్తులు బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టిన కేసుల్లో, ఆదాయపు పన్ను ఎగవేసిన ఉదంతాల్లో చట్టం తన పని తాను చేసుకుపోయినా.. అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు.. అవన్నీ పనిగట్టుకొని ప్రధాని నరేంద్ర మోదీ చేయిస్తున్నాడంటూ నిందించారు. ప్రస్తుతం.. తన పార్టీకి చెందిన కీలక వ్యక్తులు, వారి బంధుగణం పాల్పడిన అక్రమాలపై ఆదాయపన్ను శాఖ దర్యాప్తులో భాగంగా దాడులు చేసినప్పటికీ.. చంద్రబాబు మూగనోము పట్టారు. రాజకీయ ప్రాధాన్యత గలిగిన ఏ చిన్న అంశాన్నీ వదలకుండా అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా మీడియా సమావేశాలను నిర్వహించి గంటల కొద్దీ తెచ్చిపెట్టుకొన్న ఆవేశం, ఆవేదనతో మాట్లాడే అలవాటు ఉన్న చంద్రబాబు ఈ ఐటీ దాడులపై ఎందుకు మాట్లాడటం లేదు?

చంద్రబాబు ఐదేళ్ల అవినీతి పాలనలో అడుగడుగునా అవినీతి పుట్టలు పుట్టుకొచ్చాయి. సొంత సామాజిక వర్గానికి చెందిన కొందరు ఉన్నతాధికారులను దగ్గర పెట్టుకొని.. చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు చంద్రబాబు పాల్పడ్డారు. ఒకరిద్దరు అధికారులు 'సర్వంతామే' అన్నట్లు రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా మారి చంద్రబాబు చెప్పినదల్లా చేశారు. చెప్పనివి కూడా చేసిపెట్టారు. ప్రభుత్వంలోని అనేక పనులను అస్మదీయులకు దఖలు పరిచారు. ఇవన్నీ చేసిపెట్టిన అధికారులు చేతివాటం ప్రదర్శించి కోట్లు కొల్లగొట్టినా చంద్రబాబు పట్టించుకోలేదు సరికదా.. వారికి మితిమీరిన స్వేచ్ఛ కల్పించారు. చంద్రబాబు 'నరేంద్రమోదీ'ని ఏపీ ప్రజల దృష్టిలో విలన్‌గా చిత్రీకరించడానికి తెర వెనుక అనేక ప్రయత్నాలు చేశారు. సోషల్ మీడియాను ఉపయోగించుకొని నరేంద్రమోదీ, అమిత్‌షాలపై దారుణమైన పోస్టింగ్‌లు పెట్టారు. తనకు అనుకూలమైన ఓ

దినపత్రికలో నరేంద్రమోదీ వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ఓ మానసిక విశ్లేషకుడితో జుగుప్సాకరమైన రాతలు రాయించారు. విజయవాడలో ప్రజాధనంతో 'ధర్మదీక్ష' పేరుతో నిర్వహించిన సభలో సినీనటుడు బాలకృష్ణ.. ప్రధాన మంత్రిని పచ్చిబూతులు తిడుతుంటే.. సీఎంగా ఉన్న బాబు ఆ మాటల్ని ఆమోదిస్తున్నట్టుగా నిర్వికారంగా ఉండటం 'యూట్యూబ్'లో ఇప్పటికీ కనిపిస్తుంది. సినీ నటుడు శివాజీ అనే వ్యక్తితో 'గరుడపురాణం' పేరుతో.. కొన్నాళ్లు రోజువారీ సీరియల్ నడిపించారు. మోదీ.. టీడీపీ ప్రభుత్వాన్ని కూల్చబోతున్నారని, అందుకు వేలకోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారని ఊదరగొట్టారు.

దేశ రాజకీయాల్లో మరోసారి చక్రం తిప్పాలన్న ఆశతో చంద్రబాబు.. రాష్ట్ర ప్రయోజనాలను, దాంతోపాటు పార్టీ సిద్ధాంతాలను కాలరాసి కాంగ్రెస్ పార్టీతో అంటకాగటం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనం. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నప్పుడే గుజరాత్ రాష్ట్రానికి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు రహస్యంగా నిధులు సమకూర్చారన్న వార్త గుప్పుమంది. ఆ తర్వాత కర్ణాటక అసెంబ్లీలో ఎన్నికల సమయానికి.. చంద్రబాబు పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. ఆ రాష్ట్రంలో బీజేపీని ఓడించడానికి చంద్రబాబు కాంగ్రెస్, జేడీ(ఎస్)లకు ఇతోధికంగా సహాయం చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో కూడా చంద్రబాబు కాంగ్రెస్ పార్టీకి సహకరించారు. ఆ 3 రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే చంద్రబాబు స్వయంగా మాట్లాడుతూ ''కాంగ్రెస్ పార్టీ గెలవడంలో నా పాత్ర కూడా ఉంది'' అని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు సహకారం అంతటితో ఆగలేదు. చతికిలపడిన కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు ఊది నరేంద్ర మోదీని గద్దె దించడానికి చంద్రబాబు ఎన్నో ఎత్తులు వేశారు. ఎన్డీఏ వ్యతిరేక పార్టీలను దగ్గర చేసి యూపీఏ-3 గొడుగు కిందికి తేవడానికి చంద్రబాబు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. అందులో ప్రధానమైనది నిధులలేమితో కునారిల్లుతున్న కాంగ్రెస్ పార్టీకి పెద్దఎత్తున ఆర్థిక సాయం చేయడం. ఆ క్రమంలోనే తెలంగాణ ఎన్నికలలో, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ సహాయ సహకారాలు అందించారన్న సమాచారాన్ని బీజేపీ పసిగట్టింది. చంద్రబాబు ఏ విధంగా నిధులు సమీకరించారు.. వాటిని ఏ విధంగా ఏయే వ్యక్తుల ద్వారా.. ఏయే మార్గాలలో చేరవేశారన్న పక్కా సమాచారం కేంద్రం వద్ద ఉందని బీజేపీ నేతలు చెప్పుకొస్తున్నారు. ఆనాడు చంద్రబాబు, ఆయన తాబేదార్లుగా పనిచేసిన అధికారులు పాల్పడిన అవినీతి, అక్రమాలపై కేంద్రప్రభుత్వ సంస్థలు నేడు దృష్టి సారించాయి.

చంద్రబాబు చేసిన అనేక తప్పులు, మోసాలు, పాపాలకు బదులుగా ప్రజలు తెలుగుదేశం పార్టీకి 23 స్థానాలతో కనాకష్టంగా ప్రతిపక్ష హోదాకు పరిమితం చేశారు. ప్రజలిచ్చిన తిరుగులేని తీర్పు చంద్రబాబు ఓటమిలో ఒక పార్శ్వం మాత్రమే. చంద్రబాబు ఓటమిలో రెండో పార్శ్వం ప్రజల తీర్పును వమ్ము చేసి స్వార్థంతో తను, తన అనుచర వర్గం ఆర్థికంగా బలోపేతం కావడానికి అక్రమాలకు పాల్పడటం. దీనికి చట్ట ప్రకారం శిక్షపడాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రజల దృష్టిని మరల్చడానికి, తానేమీ అన్యాయాలు, అక్రమాలకు పాల్పడలేదని చెప్పుకోవడానికి చంద్రబాబు గత 7 నెలలుగా అధికార వైఎస్సార్‌సీపీపై తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. ముఖ్యంగా అమరావతి ప్రాంతంలోని 23 గ్రామాలకు చెందిన రైతులతో దీక్షలు, ఉద్యమాల పేరుతో చేయిస్తున్న క్రతువును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. రాజధాని రైతులకు ఎటువంటి అన్యాయం జరగదని ముఖ్యమంత్రి మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చాలా స్పష్టంగా చెప్పినప్పటికీ.. రాజధాని రైతులు దీక్షలు విరమించకుండా చంద్రబాబు, ఆయన సృష్టించిన కొంత మంది రెడీమేడ్ నాయకులు వారిని రెచ్చగొడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తలపెట్టిన అధికార వికేంద్రీకరణను అడ్డుకోవడానికి చంద్రబాబు రైతులను పావులుగా వాడుకుంటున్నారు. నిజానికి, రైతులు ఉద్యమించాల్సింది చంద్రబాబుకి వ్యతిరేకంగా! ఐదేళ్లలో చంద్రబాబు తమకు ఎందుకు న్యాయం చేయలేదో రైతులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ భూములను కొన్ని సంస్థలకు ఎందుకు కారుచౌకగా కట్టబెట్టాడో, తమకు ఇస్తామన్న భూములను ఎందుకు అభివృద్ధి చేసి ఇవ్వలేదో రైతులు చంద్రబాబును ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. అమరావతి వద్దనే లక్ష కోట్లు పెట్టుబడి పెడితేనే 29 గ్రామాల రైతులకు న్యాయం జరుగుతుందా? రైతులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే అనేక మంది రైతులు చంద్రబాబు ఉచ్చులో చిక్కుకున్నారు. కొన్ని పత్రికలు, చానళ్లు చంద్రబాబుకు వంతపాడుతూ రైతులను రెచ్చగొట్టడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. చంద్రబాబు ప్రయోజనాలకు గొడుగుపట్టే కొంత మంది ఇతర పార్టీల్లోని అగ్రనేతలు.. అమరావతిపై చంద్రబాబు అనుకూల ధోరణి, వాణిని వినిపించడం సిగ్గుచేటు. చంద్రబాబు విష కౌగిలి కారణంగానే.. ఎంతో చరిత్ర కలిగిన కొన్ని పార్టీలు నామమాత్రంగా మిగిలాయి. చంద్రబాబు విష పరిష్వంగం నుంచి బయటపడకపోతే ఆ పార్టీలను, నాయకులను చరిత్ర క్షమించదు. చంద్రబాబు దశం ఆంధ్రప్రదేశ్ బీజేపీని హస్తగతం చేసుకొని, బాబు ఎజెండాను అమలు చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీ కేంద్ర నాయకత్వంపై ఉంది. ప్రజలు తిరస్కరించిన చంద్రబాబును రాజకీయంగా ఆదరిస్తే అంతే సంగతులు!

వ్యాసకర్త మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శివాజీ

"ముస్లిం చొరబాటుదారులను తరిమేసి దేశాన్ని కాపాడిన మహావీరుడు ఛత్రపతి శివాజీ. కానీ, ఇవాళ ఆయనకి స్థానం లేకుండా పోయింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం శివాజీ విగ్రహాన్ని తొలగించడం బాధాకరం. కానీ, హిందువులు ఆ విగ్రహాన్ని నేలకూలనివ్వరు" - మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

డ్యాన్స్

"తాము ప్రసారం చేసిన ఎగ్జిట్ పోల్స్ సరైనవని వెల్లడికావడంతో డ్యాన్స్ చేశారు. అంతకు ముందు కూడా తాము ఊహించిన ఫలితాలు వచ్చినప్పుడూ, వారు సంబరాల్లో మునిగారు. దేన్నయినా ధ్రువీకరించుకున్నాకే ఒక నిర్ణయానికి రావాలన్నది జర్నలిజంలో మొదటి నియమం. రెండోది గ్రామర్, స్పెల్లింగ్ మిస్టేక్‌లపై దృష్టి పెట్టాలి. వాళ్లదే చేశారు"

- రోహిణీ సింగ్, జర్నలిస్ట్

ఏడుపు

"ఢిల్లీలో ఓడిపోయినందుకు దుఃఖిస్తున్న బీజేపీ మద్దతుదారులు ఓసారి ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌కు వెళ్లి నియోజకవర్గాల వారీగా ఫలితాల సరళిని 2015, 2020తో పోల్చిచూడండి. బీజేపీ ఎంత కష్టపడిందో తెలుస్తుంది. అది సరిపోదని తెలుసు, ఇంకొంచెం గట్టిగా ప్రయత్నం చేసి వుంటే బావుండేది. కానీ, శ్రమను తక్కువ అంచనా వేయకండి"

- సంజయ్ కౌల్, ఐటీ ప్రొఫెషనల్

బిర్యానీ

"బిర్యానీ ఎక్కడ పెడితే మేం అక్కడికి పోతామని భక్తులు, గోడీ మీడియా వ్యాఖ్యానించడం నన్ను బాధించింది. మేము మా ఇంట్లో బిర్యానీ వండుకుంటాం. మంచి బిర్యానీ మీకు ముస్లింల ఇళ్లలోనే లభిస్తుంది. మేము బయట బిర్యానీ తినడం చాలా తక్కువ. నేను చక్కని బిర్యానీ వండుతా. మా అమ్మ ఇంకా బాగా చేస్తుంది. మా వదినైతే బిర్యానీ క్వీన్"

- ఇరేనా అక్బర్, కళాకారిణి

చిరాకు

"చాలా చిరాకు పెట్టేది ఏంటంటే.. ప్రభుత్వం వేసిన అందమైన కాంక్రీట్ రోడ్డును, వేసి 15 రోజులు కూడా కాకుండానే పైప్‌లైన్ కోసమో, వైరింగ్ కోసమో జేసీబీతో తవ్వేయడం. ఎందుకిలా చేస్తారో?"

- ఆశు, ఆర్థికవేత్త

బొంగరం

"ప్రతిపక్ష నేతగా 9 నెలల్లో చేసిందేమిటంటే... ఇసుక మాఫియాను రక్షించేందుకు ఇస్కో... ఉస్కో అంటూ శివాలూగాడు. 'ఇన్‌సైడర్' భూముల కోసం ప్రభుత్వాన్ని కూలుస్తా... తేలుస్తా అని గాల్లో కత్తులు తిప్పాడు. అవినీతి అధికారులకు కాపలాదారయ్యాడు. పొర్లు దండాలతో బొంగరంలా తిరగడమే మిగిలింది"

- విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

ఊరట

"ఢిల్లీ ఫలితాలు కాంగ్రెస్‌ను నిరాశపరిచాయి. అయితే, కొంత ఊరటను కూడా ఇచ్చాయి. బీజేపీ విభజన రాజకీయాలను అంతా నిరాకరించారు. గుర్తింపు రాజకీయాలను మించి ఆప్ అభివృద్ధి సందేశం అందరికీ చేరింది. 8 నెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం చేజిక్కించుకున్న విజేతలు ఈసారి ఓటర్ల నిరాదరణను చవిచూశారు"

- శశిథరూర్, కాంగ్రెస్ నేత

ఇన్‌బాక్స్

చీపురు

చీపురు
మూలన కూర్చోక
నగరం మొత్తం ఊడ్చేసింది
అక్కడక్కడా
మూలలో చీపురు
కొంత చెత్తను వదిలిందంతే
మతం మరం
గల్లీల్లో విద్యాలయాల్లో
వీరంగ ప్రసంగం
చీపురు మూల సిద్ధాంతం
ముందు వెలవెల
వెలసిన రంగులు
కట్టాలనుకున్న గోడల
పునాదులు కూలిపోయినయ్
మౌలిక వసతుల
కల్పనే మౌలిక మార్పుకి
ఊతమన్న చీపురు
మద్యం ద్రవ్యం
ప్రభావ లేమి
పార్టీల చరిత్ర తరిమివేత
ఎప్పుడొచ్చామన్నది కాదు
ఓటర్‌ని గెలుచుకున్నామా! లేదా!
ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా
చారిత్రక తప్పిదం చేయని చీపురు
బూజుని దులపటంలో గెలుపు

- గిరిప్రసాద్ చెలమల్లు
మియాపూర్, హైదరాబాద్
మొబైల్: 94933 88201

జయహో ఆమ్ ఆద్మీ కేజ్రీవాల్

దేశ రాజధాని ఢిల్లీ ప్రజలు పనిచేసే ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టారు. ముచ్చటగా మూడవసారి ఆమ్ ఆద్మీ ప్రభుత్వానికే తిరుగులేని మెజార్టీని అందించి వెకిలి రాజకీయాలను చీపురుతో ఊడ్చి అరవింద్ కేజ్రీవాల్‌కి బాసటగా నిలిచారు. ఢిల్లీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మరోమారు ఆ పార్టీకి అనుకూలించాయని తెలుస్తుంది. మొత్తం 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీలో 62 స్థానాలు ఆమ్ ఆద్మీ పార్టీ కైవసం చేసుకోవడం చరిత్రాత్మకం, అభినందనీయం. కేవలం బీజేపీ 8 స్థానాలకే పరిమితం కావడం, కాంగ్రెస్ ఒక్క స్థానం గెలుచుకోకపోవడం, ఓటర్లు తమ విశ్వాసాన్ని నీతి, నిజాయితీ, అభివృద్ధికే పట్టం కట్టారని తెలుస్తుంది. హ్యాట్రిక్ విజయం సాధించిన కేజ్రీవాల్‌కి అభినందనలు.

- కామిడి సతీష్‌రెడ్డి, జెడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

విభజన రాజకీయాలపై అభివృద్ధి గెలుపు

సందర్భం

లక్ష్మణ్ వెంకట కూచి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యంత తీవ్ర స్థాయిలో సాగించిన విభజన రాజకీయాల ప్రచార సంరంభాన్ని తిప్పికొట్టిన ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వరుసగా మూడోదఫా అధికారంలోకి రావడమే కాదు.. అనితరసాధ్యమైన విజయాన్ని కూడా అందుకున్నారు. ఈ క్రమంలో ఆద్యంతం సానుకూల దృక్పథం, ప్రజానుకూల ఎన్నికల ఎజెండాలో ఢిల్లీ నమూనా పాలన ఎలా భాగం కావచ్చో జాతి మొత్తానికి చూపించారు. స్పష్టంగా చెప్పాలంటే అన్ని రాజకీయ పార్టీలూ పాటించి అమలు చేయగల, ఫలితాలను అందించగల పాలనా నమూనాపై ఆధారపడి కేజ్రీవాల్ తన వ్యూహాన్ని అమలు చేశారు. ప్రభుత్వం పట్ల బలమైన సానుకూల దృక్పథాన్ని నిర్మించడంతోపాటు కేజ్రీవాల్ అత్యంత సమయస్ఫూర్తితో కూడిన రాజకీయ క్రీడను సాగించారు. ఈ క్రమంలో సానుకూల శక్తిని ప్రేరేపిస్తున్న, ప్రజలకోసం కష్టపడుతున్న నిజాయితీ కలిగిన పరిణతి చెందిన వ్యక్తిగా తన ప్రతిష్టను పూర్తిగా పునర్నిర్మించుకున్నారు. ఇవన్నీ కలిసి కేజ్రీవాల్, ఆప్ ఢిల్లీ అసెంబ్లీలో 70 స్థానాలకు గాను 62 స్థానాలను గెల్చుకునేలా చేశాయి. దీంతో ప్రతిపక్షమైన బీజేపీ 8 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. మరోవైపున నామమాత్రమైపోయిన తన ఉనికి ద్వారా కాంగ్రెస్ పార్టీ, బీజేపీ ఆశించిన స్థాయిలో ఆప్‌ను దెబ్బతీయలేకపోయింది.

మరోవైపున ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కొన్ని మెలకువలను కేజ్రీవాల్ ప్రధాని మోదీ నుంచి సంగ్రహించడమే ఆప్ ఘనవిజయానికి దారితీసింది. మోదీ ప్రచార వ్యూహాన్ని అచ్చుగుద్దినట్లు స్వీకరించిన కేజ్రీవాల్ దాంతోనే బీజేపీని చావుదెబ్బ కొ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 13-2-2020

అమ్మ నాకు వద్దు

మైండ్ స్టోరీ

పెళ్లి చేసుకునేటప్పుడు మనిద్దరి నిర్ణయం అనుకుంటారు. విడిపోయేటప్పుడు మనిద్దరి నిర్ణయం అని అనుకోవచ్చా? పిల్లలు ఏమవుతారు? పెద్దయ్యాక ఏమవుతారు? సింగిల్ పేరెంట్స్‌గా ఉన్నప్పుడు పిల్లల మనసుల్లో ఏ సుడిగుండాలు చెలరేగుతాయి. ఏ అసంతృప్తులు పెల్లుబికుతాయి. నాన్న లేని ఇంట్లో ఎప్పుడూ అమ్మే కనిపించే ఇంట్లో ఒక కూతురికి అమ్మ మీద కోపం వచ్చింది. అమ్మ వద్దు అనుకుంది. అమ్మ ఏం చేయాలి?

ఆ ఏ.సి గది చల్లగా ఉంది. అడ్వకేట్ రఘునాథ రావు కళ్లద్దాలు సవరించుకుంటూ అలేఖ్య వైపు చూశాడు. పదిహేనేళ్ల అలేఖ్య స్కూల్ యూనిఫామ్‌లో ఉంది. కుర్చీలో కూచుని కాళ్లాడించకుండా కంపోజ్డ్‌గా ఉంది. రఘునాథరావు అలేఖ్యకు దూరపు బంధువు అవుతాడు. ఎప్పుడైనా ఒకసారి వాళ్లింటికి భార్యతో కలిసి వెళుతుంటాడు. కాని ఇలా అలేఖ్య తన దగ్గరికి రావడం అతనికి ఆశ్చర్యంగా ఉంది.

'చెప్పు... పాపాయి' అన్నాడు వాత్సల్యంగా.

'నాకు అమ్మ వద్దు అంకుల్' అంది అలేఖ్య.

'ఏంటి?' అన్నాడు అడ్వకేట్.

'అవును. నాకు అమ్మ వద్దు. ఎలాగూ నాన్న లేడు. ఇప్పుడు అమ్మ కూడా లేదనుకుంటాను. నాకు ఎవరినైనా ఒక గార్డియన్‌ని పెట్టండి. అలాగే నాకు రావల్సిన ప్రాపర్టీ కూడా మా అమ్మ నుంచి, నాన్న నుంచి ఇప్పించి ఆ గార్డియన్ కింద పెట్టండి. నేను ఒక్కదాన్నే ఏదైనా హోమ్‌లో ఉండి చదువుకుంటాను. మీరు లీగల్‌గా ఏం చేయాలో ఆలోచించి నాకు హెల్ప్ చేయండి' అంది.

రఘునాథరావు చాలా ఆశ్చర్యపోయాడు. అలేఖ్యది బాలచేష్ట కాదని తెలుస్తోంది. ఆ అమ్మాయి చాలా ఇంటిలిజెంట్. చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉంటుంది. పుస్తకాలు చదువుతుంది. న్యూస్‌పేపర్ ఫాలో అవుతుంది. వయసుకు మించిన ఆలోచనలతో ఉంటుంది. అందుకే ఆ అమ్మాయి మాటను తీసి పడేయడానికి సంకోచంగా ఉంది.

'నేను ఆలోచించి చెప్తానులే పాప' అన్నాడు.

'థ్యాంక్యూ' అని లేచింది అలేఖ్య.

'ఆగు' అని తన ర్యాక్‌లో ఉన్న చాక్లెట్లు తీసి అలేఖ్య చేతిలో పెట్టి తల మీద ముద్దుగా అర చేతితో రెండుసార్లు తట్టాడు.

'జాగ్రత్తగా వెళ్లు' అని పంపిస్తూ అలేఖ్య తల్లి విజయరేఖతో మాట్లాడటానికి ఫోనందుకున్నాడు.

•••

'ఇన్నాళ్లు ఎప్పుడూ అలేఖ్య పేచీ పెట్టలేదు బాబాయ్. కాని ఒక పది రోజులుగా నాన్నను చూడాలి.. నాన్నను చూడాలి అని అడగడం మొదలుపెట్టింది. మనం హైదరాబాద్‌లో ఉంటాం.. మీ నాన్న వైజాగ్‌లో ఉంటాడు... తర్వాత కలుద్దువు గానీ అన్నా వినలేదు. అసలే టెన్త్‌కి వచ్చింది. ఈ కోరిక తీరకపోతే ఏం చేస్తుందో అని అదో భయం. మేం లీగల్‌గా విడిపోయి ఏడెనిమిదేళ్లు అవుతున్నా ఒక్కసారి కూడా అతనితో మాట్లాడింది లేదు. అతడు మా కోసం వచ్చింది లేదు. ఇప్పుడు ఈ కొత్త కాంటాక్ట్ ఏమవుతుందో... వెళ్లి కలిశాక ఎలా మారిపోతుందో అని భయపడ్డాను. భయపడ్డట్టే జరిగింది. మా తమ్ముడి చేత అతనికి కబురు పెట్టిస్తే నిన్న ఫ్లయిట్‌లో వచ్చి అలేఖ్య స్కూల్‌కు వెళ్లి రెండు గంటలు మాట్లాడి వెళ్లాడట. ఇంటికొచ్చాక ఏం మాట్లాడుకున్నారు అని అడిగితే ఏమీ చెప్పలేదు. రాత్రంతా ముభావంగా ఉంది. ఇవాళ మీ దగ్గరికి వచ్చినట్టుంది' అంది విజయరేఖ, రఘునాథరావుతో.

'ఇప్పుడు ఎలాగమ్మా... నీ కూతురు చాలా మొండిపిల్ల' అన్నాడు రఘునాథరావు.

'అదే నాకు ఏం అర్థం కావడం లేదు బాబాయ్' అని కళ్లనీళ్లు పెట్టుకుంది విజయరేఖ.

•••

ఆ రోజు రాత్రి విజయరేఖ కూతురిని రెట్టించి అడిగింది–

'మీ నాన్న నా గురించి ఏమైనా చెడుగా చెప్పాడా?'

'ఊహూ' అంది అలేఖ్య.

'నేనేమైనా రాక్షసిని అన్నాడా?'

'ఊహూ. అసలు నీ గురించే మాట్లాడలేదు. తన గురించి మాట్లాడాడు. నా గురించి అడిగాడు అంతే'

'మరి అడ్వకేటంకుల్ దగ్గరకు వెళ్లి నేను వద్దన్నావట'

'అవును. అన్నాను. నువ్వు నాకు వద్దు'

'పాపా'

'వద్దంటే వద్దు' అటు తిరిగి పడుకుంది.

•••

అలేఖ్యకు ఐదారేళ్లు ఉన్నప్పుడు విజయరేఖ, సుమన్ విడిపోయారు. విజయరేఖ హైదరాబాద్‌లో ఉండిపోయింది. సుమన్ తన సొంత ఊరు వైజాగ్ వెళ్లిపోయాడు. కూతురిని తన దగ్గరే ఉంచుకుంది విజయరేఖ. ఆ తర్వాత 'రైట్ ఆఫ్ యాక్సెస్' తండ్రికి ఉన్నా విజయరేఖ పెద్దగా ఎంకరేజ్ చేయలేదు. కూతురు ఇప్పుడు పెద్దదయ్యింది. తన మీద తిరగబడుతోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. తండ్రిని కలిసి, అడ్వకేట్‌ను కలిశాక అలేఖ్య రాను రాను తల్లితో పొడిపొడిగా వ్యవహరించసాగింది. ఎక్కువగా ఫ్రెండ్స్‌తో ఉంటోంది. ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్‌తో హైదరాబాద్‌లోనే మంచి కాలేజీలో చేరిన అలేఖ్య ఫైనలియర్ వచ్చేసరికి అసలు చదవనే చదవను అనేదాకా వెళ్లి ఇంట్లో కూచుంది. తల్లికి ఇక వేదన తట్టుకోలేకపోయింది. అలేఖ్యను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకు వెళ్లి, డాక్టర్‌కు విషయం చెప్పి, తను బయట కూచుంది కూతురు ఓపెన్ కావడానికి.

'చెప్పమ్మా... మీ అమ్మ నీకు ఎందుకు వద్దు' అడిగాడు సైకియాట్రిస్ట్. 'డాక్టర్. నేను నాన్నను మిస్సవుతున్నాను. స్కూల్లో అందరూ నాన్నెక్కడా.. నాన్నెక్కడా అని అడుగుతుండేసరికి చాలా ఎంబరాసింగ్‌గా ఫీలయ్యేదాన్ని. ఇప్పుడు నాకు నాన్నలాంటి ఒక వ్యక్తి కావాలనిపిస్తోంది" అంది అలేఖ్య.

•••

'చెప్పమ్మా... మీ అమ్మ నీకు ఎందుకు వద్దు' అడిగాడు సైకియాట్రిస్ట్.

'డాక్టర్. నేను నాన్నను మిస్సవుతున్నాను. స్కూల్లో అందరూ నాన్నెక్కడా.. నాన్నెక్కడా అని అడుగుతుండేసరికి ఉన్న అమ్మను చూపలేక చాలా ఎంబరాసింగ్‌గా ఫీలయ్యేదాన్ని. చిన్నప్పుడు అర్థం కాలేదు. టెన్త్ వచ్చేసరికి నాన్నను కలవాలన్న కోరిక పెరిగింది. కలిశాను. నాన్న అమ్మ గురించి చెడ్డగా మాట్లాడలేదు. కాని నాన్న చాలామంచి వాడని నాన్నతో గడిపిన రెండు గంటల్లో నాకు తెలిసింది. అమ్మ, నాన్న విడివిడిగా మంచివాళ్లు కావచ్చు. కాని వారు ఒకరికి ఒకరు చెడ్డవాళ్లై నాకు చెడ్డ జీవితం ఇచ్చారు. నాన్న ప్రేమ, వాత్సల్యం తీవ్రంగా మిస్ కావడం నాకు నచ్చలేదు. నా కోపం ఎవరి మీద చూపించాలి. అమ్మ మీదే చూపించాను. నాకు ఫాదర్ ఫిగర్ కావాలని గార్డియన్‌ని పెట్టమని కోరుతున్నాను. ఒక తండ్రి లాంటి వ్యక్తి నా జీవితంలో ఉండాలని నేను కోరుకోవడం తప్పా?' అంది అలేఖ్య.

'తప్పు కాదమ్మా. కాని నీ తల్లిని తప్పు అనుకోవడమే తప్పు' అన్నాడు సైకియాట్రిస్ట్.

అలేఖ్య డాక్టర్ వైపు చూసింది.

'మీ అమ్మ ఇప్పుడు కూడా వయసులో ఉంది. కాని పెళ్లి చేసుకోలేదు. పెళ్లి చేసుకునే హక్కు ఆమెకుంది. కాని నీ కోసం ఆగిపోయింది. ఆమె వర్కింగ్ ఉమన్. జాబ్ చేస్తూ నీ గురించి కేర్ తీసుకుంటూ ఎన్ని అవస్థలు పడి ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించావా? డివోర్స్ అనేది పురుషుని కంటే స్త్రీ మీదే ఎక్కువ వొత్తిడి తెస్తుంది సంఘపరంగా. మీ నాన్న వైజాగ్‌లో తన మానాన తాను జీవిస్తున్నాడు. కాని ఎమోషనల్ బర్డన్ అంతా మీ అమ్మే కదా మోసింది. దగ్గరలేని వ్యక్తిలోని మంచి చూడటానికి ఉన్న వ్యక్తిలోని చెడును వెతుకుతున్నావు నువ్వు. మీ అమ్మ నిన్ను అమ్మలా చూసుకుంది... నాన్నలా బాధ్యతలూ నెరవేరుస్తోంది. అది చూడు ఆమెలో. నువ్వు చదువు డిస్కంటిన్యూ చేశావు. ఫస్ట్ నువ్వు చదువులో పడు. చదువు పాడైతే ఆ కోపం పూర్తిగా మీ అమ్మ మీద మళ్లుతుంది. నిన్ను కనడమే ఆమె తప్పు అన్నట్టుగా నువ్వు వేదన కలిగిస్తే ఎలా చెప్పు?' అన్నాడు సైకియాట్రిస్ట్.

అలేఖ్య తల వొంచుకుంది.

'మీ అమ్మ మీ నాన్నతో ఉండి ఘర్షణ పడటం కంటే నీతో ఉండి జీవితాన్ని ఎదుర్కొనడం మేలని తలచింది. భార్యాభర్తలు విడాకుల దాకా వెళ్లారంటే లక్ష కారణాలుంటాయి. ఇరు పక్షాలా తప్పు ఉంటుంది. మీ తల్లినే బాధ్యురాలిని చేస్తే ఎలా? ఇక గార్డియన్ సంగతి. అతడెవరో ఎలాంటి వాడో ఎలా బిహేవ్ చేసి కొత్త తలనొప్పులు తెస్తాడో ఊహించగలవా? నువ్వే ఆలోచించు' అన్నాడు సైకియాట్రిస్ట్.

సైకియాట్రిస్ట్‌తో మాట్లాడాక తల్లి మరింతగా అర్థమైంది అలేఖ్యకి.

బయటికొచ్చి మౌనంగా తల్లిపక్కన కూచుంది. కళ్ల నిండా నీటితో చూసిన తల్లికి దగ్గరగా జరిగి, ఆమె గుండెలకు తల ఆనించింది. అమ్మ ఆమెను దగ్గరకు తీసుకుంది. జీవితం మళ్లీ ఒకసారి ఆ ఇరువురిని కలిసి ముందుకు సాగే అవకాశం కల్పించింది.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

ఇన్‌పుట్స్: డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సైకియాట్రిస్ట్

రెండు విషయాలు

చిన్న పిల్లవాడు



రతన్ టాటా : నాలుగు నెలల్లో పది లక్షలు!

ఎనభై రెండేళ్ల రతన్ టాటా నాలుగు నెలల క్రితమే ఇన్‌స్టాగ్రామ్‌లోకి వచ్చారు. ఇప్పుడు ఆయన ఫాలోవర్స్ 10 లక్షల మంది! ఈ సందర్భాన్ని.. బాసింపట్లు వేసుకుని కూర్చొని ఉన్న తన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు ఆయన. రతన్ టాటా ప్రస్తుత ఆస్తుల విలువ ఆరు వేల నాలుగు వందల కోట్ల రూపాయలు. అయినా ఎంత నిరాడంబరంగా ఉన్నారో చూడండి. నాలుగు నెలల్లోనే రతన్ ఫాలోవర్స్ పది లక్షలకు చేరడంపై ఒక అమ్మాయి ''కంగ్రాచ్యులేషన్స్ చోటూ'' అని కామెంట్ పెట్టింది. వెంటనే రియాక్షన్ మొదలు. ''అంత పెద్ద మనిషిని పట్టుకుని చోటూ అంటావా'' అని ఒకరు, ''చిన్నా పెద్ద తేడా తెలియడం లేదా? సిగ్గుందా నీకు?!'' అని ఇంకొకరు. ఇదంతా చూసి రతన్ టాటా నవ్వుకున్నారు. ''ఆ అమ్మాయిని ఏమీ అనకండి. తను చెప్పింది నిజమే. ప్రతి మనిషిలోనూ పసితనం ఉంటుంది'' అని ఆమెను సపోర్ట్ చేశారు.

అమ్మడం నేరం

ఆస్ట్రేలియాలో 6 రాష్ట్రాలు ఉంటాయి. అందులో ఒక రాష్ట్రం వెస్టర్న్ ఆస్ట్రేలియా. ఇప్పుడా వెస్టర్న్ ఆస్ట్రేలియా ఒక కొత్త చట్టం తేబోతోంది. అది కనుక అమలులోకి వస్తే ఇక ముందు ఎవరు పడితే వాళ్లు కుక్కపిల్లల్ని అమ్మడానికి లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొన్ని దుకాణాలు ఉంటాయి. వాటిల్లో మాత్రమే అమ్మకాలు, కుక్కపిల్లల బ్రీడింగ్ జరుగుతాయి. వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రీమియర్ (ప్రధానికి సమానమైన పదవి).. మార్క్ మెక్‌గోవన్ ఆలోచన ఇది. ''కుక్కపిల్లల్ని కొంటున్న కుటుంబాలకు మనశ్శాంతిని ఇవ్వాలని సంకల్పించాం. దుకాణాలకు వెళ్లి కుక్కపిల్లల్ని కొనేటప్పుడు ఎన్నో శంకలు పీడిస్తుంటాయి. వాటి ఆరోగ్యం, వాటి పెంపకం సరిగానే ఉన్నాయా? టార్చర్ ఏమైనా పెట్టి ఉంటారా? పుష్టికరమైన ఆహారం అంది ఉంటుందా? ఇలా ఎన్నో! వాటన్నిటికీ దుకాణాలవాళ్లు చెప్పే సమాధానం ఒక్కటే. 'ఎక్స్‌లెంట్' అని! నమ్మేదెలా? అందుకే ప్రభుత్వం కుక్కపిల్లల అమ్మకాన్ని, ఉత్పత్తిని తన చేతులలోకి తీసుకోబోతోంది'' అని ఒక ప్రకటన కూడా విడుదల చేశారు మార్క్.

పప్పీల కోసం ప్రత్యేక చట్టం

చిత్రాల్లో సిలబస్

బొమ్మల టీచరమ్మ

గోడలపై పాఠ్యాంశాలను చిత్రిస్తూ పిల్లలకు చక్కగా అర్థమయ్యేలా సిలబస్‌ను బోధిస్తున్న **తిరునగరి పద్మ**.. పుస్తకాల్లోని విషయాలను నేరుగా చెప్పడం కంటే బొమ్మలు, గుర్తుల రూపంలో చూపిస్తే అవి ఎప్పటికీ పిల్లలకు గుర్తుంటాయని అంటున్నారు. బడి పరిసరాలను కూడా తన చిత్రాలతో అందంగా మార్చేస్తున్న ఈ ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయురాలు తెలంగాణలోని జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. పద్మ ఉపాధ్యాయురాలే అయినప్పటికీ.. పిల్లలకు బొమ్మల ద్వారా పాఠాలను అర్థం చేయించడంతో పాటు సమాజంలో వివక్షకు గురి అవుతున్న మహిళల సమస్యలపైన కూడా తన కుంచెను ఎక్కుపెట్టారు. ఈమె స్వస్థలం హన్మకొండ. 2008 డీఎస్సీలో తెలుగు పండిట్‌గా ఎంపికై, దేవరుప్పుల మండలం రామరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలో పని చేశారు. తర్వాత సోలిపూర్ పాఠశాలకు వచ్చారు.

తనకూ టీచరే స్ఫూర్తి

ములుగు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో డ్రాయింగ్ టీచర్ గీసే చిత్రాలను పద్మను ఆకర్షించాయి. అప్పటి నుంచి పై చదువుల్లో నిమగ్నం అయినప్పటికీ తనకు ఇష్టమైన చిత్రకళను సాధన చేస్తూ వచ్చారు. తనే టీచర్ అయ్యాక.. పాఠాలకు బొమ్మల రూపం ఇచ్చి పిల్లలకు ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేస్తున్నారు. అందుకోసం సొంత డబ్బులను పెట్టి రంగులు కొంటున్నారు. స్కూల్ టైమ్ పూర్తయ్యాక, ఆదివారాలు.. గోడలపై చిత్రాలు వేయడానికి తన సమయాన్ని కేటాయించుకున్నారు. పాఠశాల గదులు, ప్రహరీ గోడలపై పద్మ వేస్తున్న పెయింటింగ్స్ పిల్లల్లే కాదు, పెద్దల్నీ ఆకర్షిస్తున్నాయి. ఆలోచింపజేస్తున్నాయి. బోధించడానికి, పిల్లలు అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉండే అంశాలను చిత్రాల రూపంలో గీయడానికి ఆమె చాలానే కష్టపడతారు. తెలుగు వ్యాకరణం, ప్రపంచపటం, సూర్యకుటుంబం, రైలుబండి, హరితహారం, పల్లె అందాలు.. ప్రతి చిత్రం వెనుక పద్మ కష్టం, సృజనాత్మకత ఉంటాయి. మొత్తానికి ఈ చిత్రాలతో ఇప్పుడు ఆ పాఠశాల రూపురేఖలే మారిపోయాయి.

రైలు బోగీగా తరగతి గది

సామాజిక స్పృహ

మరోవైపు తన కలం ద్వారా సమాజంలోని రుగ్మతలపైన కూడా తన గళం వినిపిస్తున్నారు పద్మ. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షపై తరచు కవితలు రాస్తుంటారు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై స్పందిస్తారు. ప్రత్యక్షంగా సామాజిక సేవ కూడా చేస్తుంటారు. స్టీల్ పాత్రలను, పాత బట్టలను సేకరించి వాటిని పాఠశాలలోని నిరుపేద, అనాథ పిల్లలకు అందిస్తుంటారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తింపు పొందిన పద్మ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు, సావిత్రి బాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు.

– ఇల్లందుల వెంకటేశ్వర్లు, సాక్షి, జనగామ

ఫొటోలు: బైరి శ్రీకాంత్

సోలిపూర్ పాఠశాలలో పెయింటింగ్ వేస్తున్న ఉపాధ్యాయురాలు పద్మ

చెట్టు నీడ

అన్వేషణ

దేవుడు ప్రపంచాన్ని సృష్టించినప్పుడు ఆయన కూడా ఇక్కడే నివసించేవాడు. ప్రతిరోజూ రకరకాల ప్రజలు రకరకాల కోరికలతో, ఆరోపణలతో.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఆయన జీవితాన్ని దుర్భరం చేశారు. బయటపడే మార్గం ఏమిటని దేవుడు తన సలహాదారులను అడిగాడు. ''ఈ ప్రపంచాన్ని సృష్టించడమే మీరు చేసిన తప్పు. పైగా ఇక్కడే ఉండిపోవడం రెండవ తప్పు. కాబట్టి, మీరు ఎక్కడికైనా వెళ్లిపోవాలి. లేకుంటే ఈ మనుషులు మిమ్మల్ని స్థిమితంగా ఉండనివ్వరు'' అన్నారు వారు. అప్పుడు దేవుడు ''ఎక్కడికి పోవాలి?''అని ఆలోచించాడు. సలహాదారులలో ఒకరు ''ఎవరెస్టు పైకి వెళ్లండి'' అన్నాడు. వెంటనే దేవుడు ''నీకు భవిష్యత్తు గురించి తెలియదు. త్వరలో ఎవరో ఒకరు అక్కడికి వస్తారు. అప్పుడు నేను వారికి కనిపిస్తే మళ్లీ సమస్య మొదలవుతుంది'' అన్నాడు. ''అయితే చంద్రుడి పైకి వెళ్లండి'' అని మరొక సలహాదారుడన్నాడు. ''మనిషి అక్కడికి కూడా వస్తాడు. ఎందుకంటే, మనిషి వెళ్లలేని ప్రదేశమే లేదు'' అన్నాడు దేవుడు. వెంటనే ఆ సలహాదారులలో ఒక పెద్దాయన దేవుడి చెవిలో.. ''మీరు మనిషిలోనే దాక్కుంటే ఎవరూ మీ దగ్గరికి రాలేరు. ఎందుకంటే మనిషి మీ కోసం బయట వెతుకుతాడే కానీ, తనలో తాను వెతకడు'' అన్నాడు. వెంటనే దేవుడు ''ఈ సలహా చాలా బాగుంది'' అన్నాడు. అప్పటినుంచి మనిషి దేవుడి కోసం ఎక్కడెక్కడో వెతుకుతూనే ఉన్నాడు తనలో తప్ప.

– ఓషో భరత్

ఓషో 'అందమైన జీవితం నుంచి'

నాగచైతన్య, సాయిపల్లవి

ప్రేమికుల రోజున ఏయ్ పిల్లా..

'ఏయ్ పిల్లా..' అంటూ ప్రేమగీతాలాపన చేశారు నాగచైతన్య. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్‌స్టోరి'. ఎమిగోస్ క్రియేషన్స్, సోనాలి నారంగ్ సమర్పణలో నారాయణ్‌దాస్ కె. నారంగ్, పి. రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాలోని 'ఏయ్ పిల్లా..' అనే పాట మ్యూజికల్ ప్రివ్యూను నిమిషం నిడివితో ప్రేమికుల రోజు సందర్భంగా రేపు ఉదయం 11గంటల 07 నిమిషాలకు విడుదల చేయబోతున్నారు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ స్కూల్‌కి చెందిన పవన్ సి.హెచ్ ఈ చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రాజీవ్ కనకాల, ఈశ్వరీ రావు, దేవయాని కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు భాస్కర్ కటకం శెట్టి సహ-నిర్మాత. ఈ చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ సి.కుమార్.

పెళ్లి కబురు చెబుతారా?

'అనుష్క పెళ్లి చేసుకోబోతున్నారు. ఆమెకు అరుంధతి నక్షత్రం చూపే వరుడు దొరికేశాడు. త్వరలోనే పెళ్లి కబురు చెబుతారు' అంటూ ఎప్పటికప్పుడు వార్తలు హల్‌చల్ చేస్తూనే ఉంటాయి. తాజాగా మరోసారి అనుష్క పెళ్లి వార్తలకు సంబంధించిన చర్చ మొదలయింది. 'ప్రస్తుతం అనుష్క ఓ క్రికెటర్‌తో డేటింగ్ చేస్తున్నారని, త్వరలోనే వివాహం చేసుకోబోతున్నారు' అనే వార్త సోషల్ మీడియాలో తిరుగుతోంది. అనుష్క పెళ్లి చేసుకోబోయే క్రికెటర్ నార్త్ ఇండియాకు చెందినవారని, ప్రస్తుతం సౌత్‌లో రంజీ మ్యాచ్‌లు ఆడుతున్నారని ఆ వార్తల సారాంశం. మరి ఈ వార్తను అనుష్క నిజం చేస్తారా? వేచి చూడాలి. గతంలో అనుష్క, ప్రభాస్ పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త కూడా చాలా రోజులు తిరిగిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే అనుష్క నటించిన 'నిశ్శబ్దం' ఏప్రిల్ 2న విడుదల కానుంది.

అనుష్క

ఆకాశంలో విహరిద్దాం

సూర్య

ఆకాశంలో విహరించాలనుకునే 100 మంది పిల్లల కలను నెరవేర్చబోతున్నారు 'సూరరై పోట్రు' చిత్రబృందం. సూర్య హీరోగా సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రం 'సూరరై పోట్రు'. తెలుగులో 'ఆకాశమే నీ హద్దురా!' టైటిల్‌తో విడుదల కానుంది. మోహన్‌బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. పైలెట్ నుంచి ఎయిర్‌లైన్స్ కంపెనీకి అధినేతగా ఎదిగిన ఓ వ్యక్తి జీవిత కథగా ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా వంద మంది పిల్లలతో కలసి చిత్రబృందం ఆకాశంలో విహరించబోతోందట. ఈ పిల్లలందరూ తొలిసారి ఫ్లయిట్‌లో ప్రయాణించనున్నారు. ఆకాశం సాక్షిగా ఈ పిల్లల సమక్షంలో ఈ ప్రయాణంలోనే ఈ సినిమాలోని తొలి పాటను విడుదల చేయాలనుకుంటున్నారు. 'మీరు కంటున్న కల ఏంటి?' అనే విషయం మీద అద్భుతమైన వ్యాసం రాసిన 100 మంది పిల్లలను ఈ ట్రిప్ కోసం ఎంపిక చేశారట చిత్రబృందం.

పని పూర్తి

త్రిష

'రాంగీ' చిత్రం కోసం ఉజ్బెకిస్తాన్‌కు మళ్లీ వెళ్లారు హీరోయిన్ త్రిష. మొదటిసారి వెళ్లినప్పుడు కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు, పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారు. మళ్లీ త్రిష ఉజ్బెకిస్తాన్‌కు వెళ్లింది 'రాంగీ' సినిమాలో తన పాత్రలో మిగిలిన చిన్న భాగం చిత్రీకరణ కోసమే. దీంతో ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించిన పని పూర్తయిందని పేర్కొన్నారు త్రిష. ఎమ్. శరవణన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ కథ, మాటలు అందించడం విశేషం. సి. సత్య ఈ సినిమాకు సంగీతం అందించారు. ఈ ఏడాదే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా కాకుండా తెలుగులో చిరంజీవి 'ఆచార్య' (వర్కింగ్ టైటిల్), మలయాళంలో మోహన్‌లాల్ 'రామ్' చిత్రాలతో పాటు ఎప్పటిలాగే కొన్ని తమిళ ప్రాజెక్ట్స్‌తో ఈ ఏడాది కూడా తీరిక లేకుండా ఉన్నారు త్రిష.

ప్రగ్యా జైస్వాల్

మెహరీన్

విరామం విహారం వినోదం

షూటింగ్, ప్రయాణాలు, ప్రమోషన్లతో యాక్టర్స్ డైరీ ఎప్పుడూ బిజీగానే ఉంటుంది. ఆ రొటీన్ నుంచి చిన్న బ్రేక్ కోసం అప్పుడప్పుడు సరదా ట్రిప్స్ ప్లాన్ చేస్తుంటారు. ఆ చిన్న విరామంలో విహారం, వినోదం ఉండేలా చూసుకుంటుంటారు. ప్రస్తుతం అలాంటి చిన్న ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తున్నారు మెహరీన్. జనవరిలో మెహరీన్ నటించిన మూడు సినిమాలు (ఎంత మంచి వాడవురా!, పటాస్ (తమిళం) అశ్వత్థామ) విడుదలయ్యాయి. ప్రస్తుతం శ్రీలంకలో హాలిడేయింగ్ చేస్తున్నారామె. శ్రీలంకలోని వాటర్ పార్కులు, జూ పార్కులు చుట్టేస్తున్నారు మెహరీన్. ఆ ఫొటోలు తన సోషల్‌మీడియాలో పంచుకున్నారు. మరోవైపు 'కంచె' హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ ప్రస్తుతం ఇండోనేషియాలోని బాలీలో వెకేషన్ చేస్తున్నారు. అక్కడ జలపాతాల వద్ద దిగిన ఫొటోలను షేర్ చేశారు.

సందీప్, లావణ్య

సింగిల్ కింగులం..

కుర్రాళ్ల గుండెచప్పుడు

హాకీ నేపథ్యంలో తెలుగులో తెరకెక్కుతోన్న తొలి చిత్రం 'ఏ1 ఎక్స్‌ప్రెస్'. సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్నారు. డెన్నిస్ జీవన్ కనుకొలను దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వెంకటాద్రి టాకీస్ పతాకాలపై టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, సందీప్ కిషన్, దయా పన్నెం నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశలో ఉంది. సామ్రాట్ సాహిత్యం అందించగా హిప్ హాప్ తమిళ స్వరపరచిన ఈ చిత్రంలోని తొలి పాట 'సింగిల్ కింగులం..'ని యూ ట్యూబ్‌లో రిలీజ్ చేశారు. రాహుల్ సిప్లిగంజ్ పాడిన ఈ పాటకి శేఖర్ మాస్టర్ నృత్యాలు సమకూర్చారు. ''న్యూ ఏజ్ స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి కలసి ఆడి పాడిన 'సింగిల్ కింగులం..' పాట ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కవిన్ రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శివ చెర్రీ, సీతారాం, దివ్య విజయ్, మయాంక్ సింఘానియా, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

రిచా చద్దా

చీఫ్ మినిస్టర్ చద్దా

బాలీవుడ్ నటి రీచా చద్దా చీఫ్ మినిస్టర్‌గా మారారు. తన లేటెస్ట్ సినిమా 'మేడమ్ చీఫ్ మినిస్టర్'లో ముఖ్యమంత్రి పాత్రలో నటిస్తున్నారామె. సుభాష్ కపూర్ దర్శకత్వం వహిస్తున్న ఈ లేడీ ఓరియంటెడ్ సినిమాలో అక్షయ్ ఒబెరాయ్, సౌరభ్ శుక్లా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో తన పాత్ర గురించి రీచా చద్దా మాట్లాడుతూ - ''మేడమ్ చీఫ్ మినిస్టర్' సినిమా మా అందరి కష్టం. నా కెరీర్‌లోనే ఇదో చాలెంజింగ్ పాత్ర. ఈ అవకాశం ఇచ్చిన సుభాష్‌గారికి థ్యాంక్స్'' అన్నారు. ఈ సినిమా జూలై 17న విడుదల కానుంది.

సారా అలీఖాన్, అక్షయ్, ధనుష్

ముగ్గురున్నారు.. ముక్కోణం కాదు!

ఇద్దరు హీరోలు, ఒక హీరోయిన్ ఉంటే కచ్చితంగా అది ముక్కోణపు ప్రేమకథా చిత్రం అని చాలామంది ఊహిస్తారు. ఇప్పుడు అక్షయ్‌కుమార్-ధనుష్-సారా అలీఖాన్ నటించబోతున్న హిందీ చిత్రం 'అత్రంగీరే' ఆ టైప్ సినిమానే అనుకుంటున్నారు. ''ముగ్గురు ఉన్నప్పటికీ ఇది ముక్కోణపు ప్రేమకథా చిత్రం కాదని, ప్రచారంలో ఉన్నట్లు అక్షయ్‌ది అతిథి పాత్ర కాదు'' అని చిత్రదర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ స్పష్టం చేశారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ మార్చిలో బీహార్‌లో ప్రారంభం కానుంది. ''తొలి షెడ్యూల్‌లో ధనుష్, సారాలపై చిత్రీకరిస్తాం. తర్వాత మధురైలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతుంది. ఈ రెండు షెడ్యూల్స్ తర్వాత ఏప్రిల్‌లో జరిగే చిత్రీకరణలో అక్షయ్ కుమార్ పాల్గొంటారు. జూలై కల్లా సినిమాను పూర్తి చేయాలనుకుంటున్నాం. కేవలం ఒక జానర్‌కి చెందిన చిత్రం కాదు ఇది. సంగీతానికి ప్రాధాన్యం ఉంది. అందుకే ఏఆర్ రెహమాన్‌ను తీసుకున్నాం'' అన్నారు ఆనంద్ ఎల్. రాయ్. 'అత్రంగీ రే' చిత్రం వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల కానుంది.

దిలీప్‌రాజా, రావత్ సింధు

'పండుగాడి ఫోటో స్టూడియో' చిత్రదర్శకుడు దిలీప్ రాజా తెరకెక్కించనున్న చిత్రం 'యూత్'. 'కుర్రాళ్ల గుండెచప్పుడు' అన్నది ఉప శీర్షిక. ధన్య బాలకృష్ణ లీడ్ రోల్‌లో, రావత్ సింధు, వెన్నెల, ఆలోక్ జైన్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ సమర్పణలో ఈ చిత్రం రూపొందనుంది. దిలీప్ రాజా మాట్లాడుతూ- ''నా బలం, నా శ్రేయోభిలాషి అయిన డైరెక్టర్ సుకుమార్‌గారు కథ విని ఓకే అంటేనే 'పండుగాడి ఫోటో స్టూడియో' చేశాం. ఇప్పుడు 'యూత్' కథ కూడా సుకుమార్‌గారు బాగుందంటేనే మొదలు పెడతాం. యువత ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు? ఎలాంటి బాధలను భరిస్తున్నారో తెలియజెప్పేదే ఈ చిత్రకథ. ఈ చిత్రంలో హిందీ నుంచి ఇద్దరు, తమిళ్ నుంచి ఇద్దరు ప్రముఖ నటులు నటిస్తారు. మార్చిలో షూటింగ్ మొదలు పెట్టి సినిమాని జూన్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''ప్రస్తుతం రెండు ట్యూన్స్ రెడీ అయ్యాయి'' అన్నారు సంగీత దర్శకుడు యాజమాన్య.

మంచి పాత్ర చేశాను

హృతిక

సాగర్ శైలేష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'శివ 143'. అదరహ, హృతిక సింగ్ కథానాయికలు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలకానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ- ''సినిమాలు తీయాలంటే భయపడుతున్న ఈ రోజుల్లో రామసత్యనారాయణ 98 సినిమాలు తీశారంటే ఆసక్తికరంగా ఉంది'' అన్నారు. ''నాకు అన్ని ప్రాంతాల్లో సొంత పంపిణీదారులు ఉన్నారు. వాళ్ల వల్లే ఈజీగా సినిమా రిలీజ్ చేయగలుగుతున్నా'' అన్నారు రామసత్యనారాయణ. ''98 సినిమాలు తీసి, రిలీజ్ చేయటం మాటలు కాదు. అందుకే నేను తీయబోయే 2 సినిమాలను రామసత్యనారాయణగారికి అప్పజెప్పాను'' అన్నారు రచయిత చిన్నికృష్ణ. ''నన్ను హీరోని, డైరెక్టర్‌ని చేసింది భీమవరం టాకీసే. ఇప్పుడు రెండోసారి చాన్స్ ఇచ్చినందుకు రామసత్యనారాయణగారికి ధన్యవాదాలు'' అన్నారు సాగర్ శైలేష్. ''ఇందులో మంచి పాత్ర చేశా'' అన్నారు హృతిక.

అనన్యా పాండే

అనన్య.. అసామాన్య

ఇప్పుడు బాలీవుడ్‌లో జోరుగా షికారు చేస్తున్న వార్తల్లో అనన్యా పాండేకి సంబంధించినది ఒకటి. గత ఏడాది 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' సినిమాతో హిందీ తెరకు పరిచయమైంది అనన్య. ప్రముఖ నటుడు చంకీ పాండే కూతురామె. క్యూట్‌గా ఉంటుంది. చక్కగా నటిస్తుంది. కష్టపడే మనస్తత్వం ఉన్న అమ్మాయి. ప్రొఫెషన్ అంటే బోలెడంత ప్రేమ. అందుకే నిద్ర లేకుండా షూటింగ్ చేయమన్నా చేస్తుంది. ఈ మధ్య అలానే చేసింది. ప్రస్తుతం 'ఖాలీ పీలీ' అనే సినిమాలో నటిస్తోందీ బ్యూటీ. ఈ సినిమా కోసం నాన్‌స్టాప్‌గా 23 గంటలు షూటింగ్ చేసింది అనన్య. అందుకే ఆ సినిమా యూనిట్ అంతా 'అనన్య.. అసామాన్య' అంటున్నారు. పని విషయంలో ఇంత శ్రద్ధగా ఉంటున్న అనన్య కచ్చితంగా మంచి స్థాయికి ఎదుగుతుందని కూడా అభినందిస్తున్నారు.

మంచీ చెడు

పా. విజయ్

రచయిత, నటుడు, దర్శక-నిర్మాత పా. విజయ్ ప్రధాన పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఆరుద్ర'. మరో ప్రముఖ నటుడు కె. భాగ్యరాజా కీలక పాత్ర పోషించారు. మేఘాలీ, దక్షిత, సోని, సంజన సింగ్ హీరోయిన్లుగా నటించారు. తమిళంలో ఇటీవల విడుదలై విమర్శకుల ప్రశంసలందుకున్న ఈ చిత్రాన్ని జె.ఎల్.కె. ఎంటర్‌ప్రైజెస్ అధినేత కె.వాసుదేవరావు అదే పేరుతో తెలుగులోకి అనువదించారు. సెన్సార్ పనులు పూర్తయ్యాయి. క్లీన్ యు సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయనున్నారు. కె.వాసుదేవరావు మాట్లాడుతూ- ''సామాజిక ఇతివృత్తంతో రూపొందిన చిత్రమిది. తల్లిదండ్రులు, పిల్లలకు మంచి సందేశం ఇచ్చారు. ఆడ పిల్లలపై జరుగుతున్న అమానుష చర్యలకు ప్రతీకార దిశగా ఈ చిత్రం ఉంటుంది. గుడ్ అండ్ బ్యాడ్ టచ్ గురించి అందరికీ అర్థమయ్యేలా చక్కగా చూపించారు. తమిళంలో మంచి వసూళ్లు రాబట్టింది. యూనివర్సల్ కాన్సెప్ట్ కావడంతో తెలుగులోకి అనువదిస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: వరకాంతం సునీల్ రెడ్డి.

హార్మోన్ల బ్యాలెన్స్‌కు ఇలా తినండి

పురుషులతో పోలిస్తే మహిళల్లో స్రవించే హార్మోన్లు చాలా ఎక్కువ. వారిలోని అనేక జీవక్రియలను నిర్వహించేందుకు నిత్యం అనేక హార్మోను స్రవిస్తుంటాయి. వాటి మధ్య ఏమాత్రం సమతౌల్యత తప్పినా ఎన్నో సమస్యలు వస్తాయి. పైగా వాటిని సరిచేయడానికి మరికొన్ని హార్మోన్లను పైనుంచి ఇస్తే మిగతావి కూడా బ్యాలెన్స్ తప్పే అవకాశాలూ ఉండవచ్చు. మహిళల్లో హార్మోన్ల అసమతౌల్యత వల్ల యాంగ్జైటీ, త్వరగా కోపం రావడం, త్వరత్వరగా మూడ్స్ మారిపోవడం, నిద్రలేమి వంటి సమస్యలు కనిపించడం చాలా సాధారణం. తాము రోజూ తీసుకునే ఆహారంతోనే మహిళలు తమకు కావలసిన హార్మోన్లను తగిన పాళ్లలో పొందడం ఎలాగో తెలుసుకోండి. అందుకు తీసుకోవాల్సిన ఆహారపదార్థాలివి...

ప్రోజెస్టెరాన్: గర్భధారణకు, మెనోపాజ్ సమయంతో పాటు మహిళల సంపూర్ణారోగ్యానికీ ఉపయోగపడే హార్మోన్ ఇది. ఈ హార్మోన్ లోపిస్తే బరువు పెరగడం, పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తీసుకోవాల్సినవి: విటమిన్ బి6, పీచు, జింక్, మెగ్నీషియమ్ ఉండే ఆహారాలు తీసుకుంటే ఈ హార్మోన్ స్వాభావికంగానే సమకూరుతుంది. ఇందు కోసం చిక్కుళ్లు (బీన్స్), బ్రోకలీ, క్యాబేజీ, కాలిఫ్లవర్, గుమ్మడి, పాలకూర, నట్స్ వంటివి తీసుకోవాలి.

ఫాలికిల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఎఫ్ఎస్‌హెచ్): ఇది కూడా మహిళల్లో చాలా కీలకమైన హార్మోన్. మహిళల్లో మెనోపాజ్ వయసు దగ్గర పడుతున్నకొద్దీ దీని స్రావాలు ఎక్కువ.

థైరాయిడ్: థైరాయిడ్ గ్రంథి స్రవించే హార్మోన్‌లు ఎంతగా అవసరమో అందరికీ తెలిసిందే. దీని మోతాదు కాస్త ఎక్కువైతే హైపర్ థైరాయిడిజమ్, తక్కువైతే హైపో థైరాయిడిజమ్ వచ్చే అవకాశాలు ఎక్కువ. మహిళలతో పాటు పురుషులకు అవసరమైన హార్మోన్‌లను కూడా థైరాయిడ్ గ్రంథి స్రవిస్తుంది.

తీసుకోవాల్సినవి: ఎఫ్ఎస్‌హెచ్ కోసం, థైరాయిడ్ గ్రంథి చక్కగా పనిచేయడానికి ఒమెగా 3-ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. చేపలు (సాల్మన్, సార్డిన్, కొరమీను వంటివి), అవిశగింజలు, వాల్‌నట్, కిడ్నీబీన్స్, పాలకూర వంటి ఆకుకూరల్లో ఒమెగా 3-ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కేవలం పైన పేర్కొన్న హార్మోన్లనే గాక... హైపో పిట్యుటరిజమ్, హైపోగొనాడిజమ్ వంటి హార్మోనుల అసమతౌల్యతను ఏర్పరచే కండిషన్లను కూడా నివారిస్తాయి.

ఆక్సిటోసిన్: ఇది హైపోథలామస్ ద్వారా ఉత్పత్తి అయి, పిట్యుటరీ గ్రంథి ద్వారా విడుదల అవుతుంది. ఇది మన సామాజిక ప్రవర్తనను ప్రభావితం చేయడంతో పాటు, సంతానసాఫల్యానికి, బిడ్డపుట్టాక మళ్లీ పీరియడ్స్ క్రమంగా రావడానికి ఉపయోగపడుతుంది.

తీసుకోవాల్సినవి: విటమిన్-డి ఎక్కువగా ఉండే ఆహారాలైన గుడ్లు, చికెన్, పాలు, తృణధాన్యాలతో పాటు విటమిన్-సి పుష్కలంగా ఉండే ఉసిరి, జామ, బెర్రీపండ్లు, టోమాటో, నిమ్మలలో లభ్యమవుతుంది. అంతే గాక బాదం, అవకాడో, డార్క్‌చాక్లెట్లు, అరటిపండ్లు, పెరుగు, బ్రాకలీలలో దొరుకుతుంది.

ల్యూటినైజింగ్ హార్మోన్ (ఎల్‌హెచ్): ఇది కూడా మహిళలకు అవసరమైన చాలా ప్రధానమైన హార్మోన్. పురుషుల్లో కూడా కొద్దిపాళ్లలో అవసరమే. ఇది మహిళల్లో అవసరమైన ఇతర హార్మోన్లను స్రవించేలా చేస్తుంది.

తీసుకోవాల్సినవి: ఒమెగా 3-ఫ్యాటీ యాసిడ్స్ లభ్యమయ్యే ప్రధాన ఆహారాలను తీసుకోవడం ద్వారా దీన్ని స్వాభావికంగానే పొందవచ్చు. వాటితోపాటు పొట్టుతీయని గింజధాన్యాలు (హోల్‌గ్రెయిన్స్), పప్పుధాన్యాలు (పల్సెస్)తీసుకోవడం ద్వారా ఎల్‌హెచ్‌ను స్వాభావికంగా పొందవచ్చు.

టెస్టోస్టెరాన్: ఈ హార్మోన్ ప్రధానంగా పురుషులకు అవసరమైనది. అయితే కొద్దిపాళ్లలో మహిళల్లోనూ ఇది అవసరం. మహిళల్లో ఎముకలు, కండరాల బలం కోసం, కొవ్వు సమంగా విస్తరించడంతో పాటు రక్తకణాల ఉత్పత్తి కోసం ఈ హార్మోన్ అవసరం.

తీసుకోవాల్సినవి: ఇది జింక్ వంటి ఖనిజ లవణాలు, విటమిన్-డి లభించే పదార్థాలతో లభ్యమవుతుంది. కొరమీను, సాల్మన్ వంటి చేపలు, వేటమాంసం... అందునా ప్రత్యేకంగా కాలేయం వంటి మాంసాహారాలతో పాటు గుడ్లు, బీన్స్‌ల ద్వారా కూడా సమకూరుతుంది. పండ్లలో దానిమ్మ ద్వారా ఇది స్వాభావికంగా దొరుకుతుంది.

ఎస్ట్రాడియాల్: ఇది మహిళలకు అవసరమైన హార్మోన్. దీన్నే ఈస్ట్రోజెన్ అని వ్యవహరిస్తుంటారు. ఇది తగ్గడం వల్ల యోని సంబంధమైన రుగ్మతలు కనిపిస్తాయి.

తీసుకోవాల్సిన ఆహారాలు: అవిశగింజలు, సోయా ఉత్పాదనలు, తాజాపండ్లు, నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి వాటి ద్వారా ఈస్ట్రోజెన్ స్వాభావికంగా సమకూరుతుంది.

గ్లూకోజ్ మెటబాలిజమ్: మహిళల్లో గ్లూకోజ్ మెటబాలిజమ్ సక్రమంగా జరగడం అవసరం. దాని వల్ల డయాబెటిస్ నివారితమవుతుంది.

తీసుకోవాల్సినవి: మెంతులు, మెంతికూర వంటివి తీసుకోవడం ద్వారా 'డియోస్జెనిన్' అనే ఒక రకం ఈస్ట్రోజెన్ లభ్యమవుతుంది. దీని వల్ల గ్లూకోజ్ మెటబాలిజమ్ సక్రమంగా జరుగుతుంది. అలాగే బాదం నుంచి 'ఎడిపోన్సెటిన్' అనే స్వాభావిక ప్రోటీన్ లభ్యం కావడం వల్ల కూడా గ్లూకోజ్ మెటబాలిజమ్ సక్రమంగా జరుగుతుంది.

సుజాతా స్టీఫెన్
చీఫ్ న్యూట్రిషనిస్ట్
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట, హైదరాబాద్

పిల్లల్లో చొల్లు కారుతోందా?

ఇలా పిల్లలు నోట్లో వేలు పెట్టుకుని చొల్లు కారుస్తూ ఉన్నా చాలా అందంగా, క్యూట్‌గా కనిపిస్తుంటారు. ఆర్నెల్ల వయసు నుంచి 18 నెలల వరకు పిల్లలు ఇలా చొల్లు కార్చుకోవడం అన్నది చాలా సాధారణం. దీనికో కారణం ఉంది. నోరు, దవడ భాగాల్లోని ఓరల్ మోటార్ ఫంక్షన్స్ అని పిలిచే నాడీ వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడమే దీనికి కారణం. ఆ ఓరల్ మోటార్ ఫంక్షన్స్ అభివృద్ధి చెందగానే చొల్లు కారడం ఆగిపోతుంది. ఇలా పిల్లల్లో చొల్లు/జొల్లు కారుతూ ఉండే కండిషన్‌ను 'సైలోరియా' అంటారు. అయితే నాలుగేళ్లు దాటాక కూడా పిల్లలు చొల్లు కారుతుంటే దాన్ని మాత్రం అబ్‌నార్మాలిటీగా పరిగణించాలి.

పెద్ద పిల్లల్లో చొల్లు

కాస్తంత పెద్ద వయసులో ఉన్న చిన్న పిల్లల విషయానికి వస్తే... కొన్నిసార్లు వారి ముక్కులు విపరీతంగా బిగుసుకుపోయినా, దంత (డెంటల్) సమస్యలు ఉన్నా, మింగలేకపోవడానికి ఇంకేమైనా సమస్యలు ఉన్నా (ఉదా: సివియర్ ఫ్యారింగో టాన్సిలైటిస్ వంటివి) కూడా చొల్లు/జొల్లు కారుతుంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు చొల్లు కారవడం ఎక్కువైనా దాని గురించి ఆందోళన పడాల్సిన అవసరం ఉండదు. కారణం... పెద్దపిల్లల్లో కనిపించే ఇవన్నీ కేవలం తాత్కాలికమే.

కానీ కొంతమంది పెద్దపిల్లల్లో మానసిక సమస్యలు, నరాల బలహీనతక సంబంధించిన రుగ్మతలు ఉన్నప్పుడు చొల్లు కారే లక్షణం కనిపిస్తుంటుంది. కారణం... వాళ్లలో నోట్లో స్రవించిన లాలాజలాన్ని తమంతట తామే మింగలేరు. అందుకే పెద్దపిల్లల్లో చొల్లు కారుతుంటే మొదట న్యూరాలజిస్టుకు చూపించి, ఇతరత్రా సమస్యలేమీ లేవని నిర్ధారణ చేసుకోవడం ప్రధానం.

చొల్లు కారే సమస్యను అధిగమించడానికి...

ఇలా పెద్ద పిల్లల్లో ఇలా చొల్లు/జొల్లు కారడం సమస్య ఉన్నప్పుడు వాళ్లంతట వాళ్లే లాలాజల స్రావాన్ని మింగేలా అలవాటు చేయాలి. లాలాజల స్రావం చాలా ఎక్కువగా ఉన్న పిల్లల్లో కొన్ని ప్రత్యేకమైన దంత ఉపకరణాలు (స్పెషల్ డెంటల్ అప్లయెన్సెస్) ఉపయోగించి వాలంటరీగా మింగడం అలవాటు చేయించవచ్చు. మరికొందరిలో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో (ముఖ్యంగా పెద్దవాళ్లలో, పెద్ద పిల్లల్లో) కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో బొట్యులినం టాక్సినమ్ అనే పదార్థాన్ని లాలాజల గ్రంథుల్లోకి ఇంజెక్ట్ చేయడం కూడా చేస్తున్నారు.

ప్రత్యేకమైన జాగ్రత్తలివే...

చొల్లుకారే పిల్లల్లో కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు కూడా తీసుకోవడం మేలు చేస్తుంది. అవి...

- మంచి నోటి పరిశుభ్రత (గుడ్ ఓరల్ హైజీన్)
- తరచూ మింగడం అలవాటు చేయడం
- నోటి కండరాల కదలికలను మెరుగు పరచడం (ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ టోన్ అండ్ మూవ్‌మెంట్ ఆఫ్ ఓరల్ మజిల్స్).

పైన పేర్కొన్న చర్యలతో ఒకింత పెద్ద వయసు వచ్చాక కూడా చొల్లు/జొల్లు కారుతుంటే, దాన్ని ఆపేందుకు దోహదపడతాయి. అప్పటికీ పెద్ద పిల్లల్లో చొల్లుకారే అలవాటు అప్పటికీ ఆగకపోతే పిల్లల డాక్టర్‌కు/ న్యూరాలజిస్ట్‌కు తప్పక చూపించాలి.

డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్, విజయనగర్ కాలనీ,
హైదరాబాద్

మామూలు ఫ్లూ జ్వరం (ఇన్‌ఫ్లుయెంజా) మొదలుకొని ఇప్పడొచ్చే కరోనా అయినా నేరుగా మనిషిని చంపలేదు. వైరస్ సోకాక సెకండరీ ఇన్ఫెక్షన్‌లా వచ్చే నిమోనియాతో మనిషి మరణం అంచులకు వెళ్తాడు. ఏదైనా వైరస్ విజృంభించి ఒక చోట ఎపిడమిక్‌లా వచ్చి, తన ప్రభావం చూపిన తర్వాత నిమోనియాకు దారితీసే అవకాశాలు మరింత ఎక్కువ. ఇప్పడొస్తున్న కరోనాగానీ... ఒకప్పుడు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన బర్డ్‌ఫ్లూ (హెచ్1ఎన్1), సార్స్, స్వైన్‌ఫ్లూ, మధ్యప్రాచ్యాన్ని భయపెట్టిన మెర్స్ వంటి వైరస్‌ల వల్ల వచ్చిన జ్వరాలు ఆ తర్వాత నిమోనియాకు కారణమవుతాయి. అలాంటి నిమోనియా గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

వైరస్‌లూ తెచ్చే అనర్థం

నిమోనియా

మనం మన ఊపిరితిత్తుల ద్వారా అనుక్షణం శ్వాసిస్తూ ఉంటామన్న విషయం తెలిసిందే కదా. అప్పుడే మన ప్రాణాలు నిలబడతాయి. ఊపిరితిత్తుల్లోని అతి చివరి అంచెలో ఉండే గాలి గదులను 'ఆల్వియోలై' అంటారు. ఈ ఆల్వియోలైలోనే బయటి నుంచి ఆక్సిజన్ మన శరీర అవయవాలకు అందడం, అక్కడే లోపలి కలుషితమైన గాలి బయటికి రావడం వంటి గ్యాసెస్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం జరుగుతుంది. ఏదైనా కారణం వల్ల ఆల్వియోలైలో ఈ కార్యక్రమం జరగడానికి అంతరాయం కలిగితే అది నిమోనియా సమస్యకు దారితీస్తుంది.

నిమోనియాకు కారణాలు

ఇప్పటి కరోనా మాత్రమే గాక నిమోనియాకు ఎన్నో కారణాలుంటాయి. ప్రధానంగా అవి...

- బాక్టీరియా వల్ల - స్టెఫలోకాకస్ బ్యాక్టీరియా (ఇది పెద్దల్లో సాధారణంగా వచ్చేందుకు కారణమవుతుంది), హీమోఫీలస్ (పిల్లల్లో సాధారణంగా దీనివల్ల వస్తుంది), గ్రామ్‌నెగెటివ్, అనరోబిక్, టీబీ బ్యాక్టీరియా మొదలైన బ్యాక్టీరియాల వల్ల.
- ఫంగస్ వల్ల కూడా నిమోనియా వస్తుంది.
- కొద్ది ప్రదేశంలోనే ఎక్కువమంది ఉండటం (ఓవర్ క్రౌడింగ్). కరోనా మొదలుకొని ఏ వైరస్ అయినా సోకడానికి ప్రధాన కారణం కాబట్టి గుంపులుగా వ్యక్తులుండే ప్రదేశాలకు అవసరమైతే తప్ప వెళ్లకూడదు. ఒకవేళ తప్పని సరిగా వెళ్లాల్సి వస్తే మాస్క్ తప్పక ధరించాలి.
- ఆల్కహాల్ తాగడం - దీనివల్ల వ్యక్తుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగానూ రోగనిరోధక శక్తి (డిఫెన్స్ మెకానిజం) తగ్గుతుంది. ఉదాహరణకు మత్తులో దగ్గడం కూడా తక్కువే. దాంతో ఊపిరితిత్తుల్లో ఉన్న మనకు సరిపడని పదార్థాలు అక్కడే ఉండిపోవడం వల్ల కూడా నిమోనియా రావచ్చు.
- మైక్రో యాస్పిరేషన్ - మనకు తెలియకుడానే ద్రవాలు గొంతునుంచి శ్వాసనాళంలోకి జారిపోతుంటాయి. ఆ ప్రక్రియనే మైక్రోయాస్పిరేషన్ అంటారు. ప్రతివ్యక్తి గొంతులో బ్యాక్టీరియా ఉంటుంది. దీన్నే ఓరోఫ్యారింజియల్ ఫ్లోరా అంటారు. ఆ బ్యాక్టీరియా గొంతు నుంచి శ్వాసనాళాల ద్వారా గాలిగదుల వరకు పోవడం వల్ల కూడా నిమోనియా రావచ్చు.

నిమోనియా లక్షణాలు

సాధారణ నిమోనియాలో...

- దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు, చలిగా ఉండటం, ఒక్కోసారి ఆకలి లేకపోవడం
- కఫం ఉండవచ్చు లేదా లేకపోవచ్చు. ఉంటే తెల్లగా, పసుపురంగులో ఒక్కోసారి రక్తపు చారికతోనూ కనిపించవచ్చు.
- నిమోనియా ఊపిరితిత్తి పొర (ప్లూరా)కు చేరినప్పుడు ఛాతినొప్పి కూడా రావచ్చు.
- నిమోనియా మరీ తీవ్రంగా ఉంటే ఆయాసం కూడా రావచ్చు.
- అసహజంగా అనిపించే ఇంటర్‌స్టిషియల్ నిమోనియాలో దగ్గు కూడా ఉంటుంది. ఇది ఏ పరిస్థితికి తీసుకెళ్తుందంటే... ఒక్కోసారి శ్వాస ప్రక్రియ ఫెయిలయ్యే అవకాశమూ ఉంది.
- ఆస్తమాలో పిల్లికూతలు ఉంటాయి. గాని నిమోనియాలో ఉండవు. గాలి పీలుస్తున్నా అది లోపలికి వెళ్లదు. కారణం. గాలి చేరాల్సిన ప్రదేశమైన గాలిసంచిలోని ఎగ్జడస్ అడ్డంకిగా ఉంటుంది. కాబట్టి అక్కడికి ఆక్సిజన్ చేరదు. దాంతో శరీరానికి అవసరమైనంత ఆక్సిజన్ అందదు. ఫలితంగా ఊపిరితిత్తులు తమ పని తాము చేయలేని పరిస్థితికి వస్తాయి. దీన్నే 'హైపాక్సిక్ రెస్పిరేటరీ ఫెయిల్యూర్' అంటారు.
- ఊపిరి అందకపోవడంతో నుదుట చెమటలు పట్టడం, కంగారుగా ఉండటం, గుండె స్పందన వేగం పెరగడం, డీలా పడిపోవడం, బీపీ పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే దాన్ని 'సివియర్ నిమోనియా' అంటారు.
- కొందరు రోగుల్లో ఛాతీలో తీక్షణమైన నొప్పి (షార్ప్ పెయిన్) రావచ్చు.

సమయానికి చికిత్స తీసుకోకపోతే ప్రమాదమే...

ఏ కారణం వల్ల నిమోనియా వచ్చినప్పటికీ దానికి చికిత్స తీసుకోకపోతే అది మరింత సంక్లిష్టతలకు దారితీస్తుంది. అంటే దాని ఇతర కాంప్లికేషన్లయిన సెప్టిసీమియా (అంటే రక్తానికి అంతా ఇన్ఫెక్షన్ సోకి, రక్తమంతా విషపూరితంగా మారడం) వంటివి కనిపిస్తాయి. అంతేకాదు... రక్తపోటు పడిపోవడం, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినడం, మెదడుపై దుష్ప్రభావం పడటం వంటివి రావచ్చు. చివరికి మరణం కూడా సంభవించవచ్చు.

మరికొన్ని జబ్బుల్లో కూడా...

మరికొన్ని జబ్బులు ఉన్నప్పుడు నిమోనియా సోకడం చాలా సాధారణం. డయాబెటిస్ ఉన్నవారు, క్యాన్సర్‌తో బాధపడుతూ కీమోథెరపీ తీసుకుంటున్నావారు, ఎయిడ్స్ రోగులు, ఆస్తమా ఉన్నవారు, ఆల్కహాల్ ఎక్కువగా తాగేవారిలో నిమోనియా రావడం చాలా సాధారణం. ఇలాంటి వ్యక్తులకు వైరస్ సోకితే మిగతా ఆరోగ్యవంతులతో పోలిస్తే వారు మరణించే అవకాశాలు ఎక్కువ. అలాగే సాధారణంగా గర్భవతుల్లో నిమోనియాను సక్రమంగా గుర్తించి, సరిగా వైద్య చికిత్స అందివ్వకపోతే అది ఎన్నో కాంప్లికేషన్లకు దారితీసే ప్రమాదం ఉంది.

వ్యాధి నిర్ధారణ

- రోగిలో కనిపించే లక్షణాలను బట్టి
- సీబీపీ, సీఎక్స్‌ఆర్ వంటి చాలా సాధారణ పరీక్షలతో దీన్ని నిర్ధారణ చేయవచ్చు.
- ఒక్కోసారి వ్యాధి తీవ్రతను బట్టి, అవసరాన్ని బట్టి ఛాతీ సీటీ స్కాన్, కళ్లె పరీక్ష వంటి ఇతర పరీక్షలు కూడా చేయాల్సి రావచ్చు.

నివారణ

- పిల్లలకు చిన్నతనంలో ఇచ్చే బీసీజీ, పెర్టుసస్‌లతోపాటు నిమోకోకల్ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల దీన్ని నివారించవచ్చు.
- పొగతాగే అలవాటు ఉంటే జ్వరం, దగ్గు, ఊపిరి అందకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తుంటే తక్షణం ఆ అలవాటును ఆపేయాలి.
- బయటి వాతావరణంలో పొగ ఉంటే దానికి ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్త పడాలి.
- ఆస్తమా రోగులు, బ్రాంకైటిస్ ఉన్నవారు తప్పనసరిగా అది నియంత్రణలోకి వచ్చేలా చికిత్స తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఫలితంగా నిమోనియా వంటి ఇన్ఫెక్షన్లు తేలిగ్గా సంక్రమించవు.
- అన్ని పోషకాలూ ఉండే సమతులాహారం తీసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి, నిమోనియాతోపాటు అనేక ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కలుగుతుంది.

చికిత్స

నిమోనియాకు తగిన యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయాల్సి ఉంటుంది. దీని మోతాదును జాగ్రత్తగా నిర్ణయించి డాక్టర్ల పర్యవేక్షణలో ఇవ్వాలి.

ఎవరికైనా మూడు రోజులకు పైబడి జ్వరం, ఛాతీనొప్పి, ఊపిరి సరిగా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని గుర్తుంచుకోండి.

డాక్టర్ ఎస్. మల్లికార్జున్ రావు,
సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్, హైదర్‌గూడ, హైదరాబాద్

హోమియో కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

పేను కొరుకుడుకు చికిత్స ఉందా?

మా అమ్మాయి వయసు 22 ఏళ్లు. ఈమధ్య ఒకే దగ్గర వెంట్రుకలు రాలిపోతున్నాయి. అందరూ పేను కొరుకుడు అంటున్నారు. పెళ్లికావాల్సిన అమ్మాయి కావడంతో తను కాస్తంత ఇబ్బందిగా ఫీలవుతోంది. ఈ సమస్యకు హోమియోలో పరిష్కారం ఉందా?

- ధనలక్ష్మి, ఆమదాలవలస

పేనుకొరుకుడు సమస్యను వైద్యపరిభాషలో అలోపేషియా అంటారు. ఈ కండిషన్‌లో ఒక నిర్ణీత స్థలంలో వెంట్రుకలు పూర్తిగా రాలిపోయి, నున్నగా మారుతుంది. తలపై అక్కడక్కడ ప్యాచ్‌లలాగా ఏర్పడతాయి. ఇది ఒక ఆటో ఇమ్యూన్ డిజార్డర్. అంటే తన సొంత వ్యాధి నిరోధక శక్తి తన వెంట్రుకలపైనే ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్య. తలలోగానీ, గడ్డంలోగానీ, మీసాలలోగాని ఇది రావచ్చు. ఇది అంటువ్యాధి కాదు. సాధారణంగా 60 ఏళ్లు పైబడిన వారిలో ఈ సమస్య కనిపించదు.

కారణాలు: ● మానసిక ఆందోళన ● థైరాయిడ్ సమస్య ● డయాబెటిస్, బీపీ వంటి సమస్య ఉన్నవాళ్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది ● వంశపారంపర్యంగా రావచ్చు ● కవలల్లో ఒకరికుంటే మరొకరికి వచ్చే అవకాశాలూ ఉంటాయి.

నిర్ధారణ : ఈ సమస్య ఏ కారణం వల్ల వచ్చిందో తెలుసుకోవాలి. ట్రైకోస్కోపీ, బయాప్సీ, హిస్టలాజిక్ పరీక్షలు, పిగ్మెంట్ ఇన్‌కాంటినెన్స్ వంటివే మరికొన్ని పరీక్షలు.

చికిత్స: పేనుకొరుకుడుకు హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి కారణాలు, లక్షణాలను పరిగణనలోకి తీసుకొని వైద్యులు మందులను సూచిస్తారు. దీనికి యాసిడ్ ఫ్లోర్, సల్ఫర్, ఫాస్ఫరస్, గ్రాఫైటిస్, సెలీనియమ్, సొరినమ్, తుజా వంటి మందులను డాక్టర్ల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది.

డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

తిన్నవెంటనే ఎందుకీ ఇబ్బంది?



నా వయసు 35 ఏళ్లు. మధ్యానం తిన్న వెంటనే టాయిలెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. దయచేసి నా సమస్య ఏమిటో వివరించి, హోమియోలో చికిత్స చెప్పండి.

- సురేశ్‌బాబు, కొత్తగూడెం

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీరు ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యకు నిర్దిష్టమైన కారణం తెలియదు. అయితే... ● జీర్ణవ్యవస్థలో తరచూ వచ్చే ఇన్ఫెక్షన్లు ● దీర్ఘకాల జ్వరాలు ● మానసిక ఆందోళన ● కుంగుబాటు ● ఎక్కువరోజులు యాంటీబయాటిక్స్‌వాడటం ● జన్యుపరమైన కారణాలు ● చిన్నపేగుల్లో బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో ఉండటం వంటివి ఐబీఎస్‌కు దోహదం చేస్తుంటాయి. మీరు చెప్పిన లక్షణాలతో పాటు కొందరిలో నొప్పి లేకుండా కూడా ఐబీఎస్ వస్తుండవచ్చు. వీళ్లలో చాలా వేగంగా మలవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంటుంది. నిద్రలేస్తూనే టాయిలెట్‌కు వెళ్లాల్సివస్తుంది. ఐబీఎస్ క్యాన్సర్‌కు దారితీయదు. ప్రాణాంతకమూ కాదు. అయితే చాలా ఇబ్బంది పెడుతుంది.

వ్యాధి నివారణ/నియంత్రణ: ● పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి ● ఒత్తిడిని నివారించుకోవాలి పొగతాగడం, మద్యపానం అలవాట్లను మానుకోవాలి ● రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలి.

చికిత్స: ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్‌కు కాన్‌స్టిట్యూషనల్ సిమిలియమ్ ద్వారా చికిత్స చేసి, సమస్యను చాలావరకు శాశ్వతంగా పరిష్కరించవచ్చు.

డాక్టర్ టి.కిరణ్‌కుమార్,
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్వర్థయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
గురువారం 13-2-2020

గుట్టు రట్టుచేసే.. ఫోరెన్సిక్ సైన్స్

కెరీర్ గైడెన్స్

ఆ నేరం చేసింది నేను కాదు.. నేనంటే గిట్టని వాళ్లు చేసిన కుట్ర..! ఆ వాయిస్ నాది కాదు.. ఎవరో ఇమిటేట్ చేశారు..! ఆ డాక్యుమెంట్ల ఫోర్జరీతో నాకెలాంటి సంబంధం లేదు. కావాలనే నన్ను ఇరికించారు..! నా భార్యది హత్య కాదు, ఆత్మహత్య.. ఆమె అలా ఎందుకు చేసిందో నాకు తెలియదు..! ఇలాంటి వార్తలు మనం నిత్యం టీవీల్లో, పేపర్లలో, వెబ్‌సైట్లలో చూస్తుంటాం. ప్రతి కేసులోనూ ఎన్నో ట్విస్టులు.. మరెన్నో సందేహాలు.. చాలా సందర్భాల్లో పోలీసులకు సైతం ఆధారాలు అంతుచిక్కని వైనం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కఠినమైన మిస్టరీలను ఛేదించడానికి అవసరమైన చదువే ఫోరెన్సిక్ సైన్స్. ఈ కోర్సులో చేరాలంటే.. ఎలాంటి అర్హతలుండాలి.. కోర్సులు ఎక్కడ అందుబాటులో ఉన్నాయి.. ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి.. అవసరమైన నైపుణ్యాలు ఏమిటి..? వంటి అనేక ప్రశ్నలకు సమాధానమే ఈ కథనం..

- » బయాలజీ విద్యార్థులకు అనుకూలం ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు
- » శాస్త్రీయ పరిశోధన ద్వారా నేర నిర్ధరణ చేయడం వీరి ప్రధాన కర్తవ్యం
- » డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ స్థాయి కోర్సులందిస్తున్న పలు వర్సిటీలు
- » ప్రభుత్వ, ప్రయివేటు విభాగాల్లో ఉద్యోగావకాశాలు

పోలీసులు సంధించే దివ్యాస్త్రం

ఇప్పుడు ఎక్కడ చూసినా నేరాలు, ఘోరాలు, ఆర్థిక మోసాలు, లైంగిక దాడులు, హత్యలు ఎక్కువయ్యాయి. వీటిని ఛేదించాలంటే.. పోలీసులకు సైతం తలకు మించిన భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నేరగాళ్లను గుర్తించడానికి ప్రత్యేక నైపుణ్యాలున్న వ్యక్తులపై ఆధారపడక తప్పని పరిస్థితి. ఆధారాలను అన్వేషించి, అసలు దోషుల గుట్టు విప్పడానికి అవసరమైన ఆయుధమే.. ఫోరెన్సిక్ సైన్స్. ఇది కేవలం హంతకులను గుర్తించే శాస్త్రమే కాదు.. మోసగాళ్ల ఆటలను పసిగట్టే దివ్యాస్త్రం కూడా! హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించడం, ఇన్సూరెన్స్ కోసం వస్తువులను తగలబెట్టడం, సంతకాల ఫోర్జరీ, మార్ఫింగ్, సైబర్ నేరాలు, సైబర్ దాడులు.. ఇలా ఒక్కటేమిటి అత్యాచారాల నుంచి హైటెక్ మోసాల వరకూ... అన్నింటినీ శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి పక్కా ఆధారాల్ని దర్యాప్తు సంస్థలకు అందించేదే ఫోరెన్సిక్ సైన్స్.

వీళ్లు ఏం చేస్తారంటే

ఏదైనా ఘటన జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ఆధారాలు సేకరించడం, దొరికిన సమాచారాన్ని విశ్లేషించి నేర నిర్ధరణ చేయడం ఫోరెన్సిక్ నిపుణుల ప్రథమ కర్తవ్యం. ఎలాంటి ఆధారాలు లభించని సమయంలో తర్కాన్ని ఉపయోగించి, పలు కోణాల్లో ఆలోచించి దోషులను గుర్తించాల్సి ఉంటుంది. దొంగతనం, అత్యాచార ఘటనల్లో ఫోరెన్సిక్ నిపుణుల సమర్థత బయటపడుతుంది. కేసును బాగా స్టడీ చేసి, క్షుణ్ణంగా ఆలోచిస్తే ఏదో ఒక చిన్న క్లూ దొరుకుతుంది. తీగలాగితే డొంకంతా కదిలినట్టు.. చిన్న క్లూ సాయంతో సేకరించిన ఆధారాలను ప్రయోగశాలల్లో పలు పరికరాలు ఉపయోగించి అసలు దోషులను గుర్తించొచ్చు. ఫోరెన్సిక్ సైన్స్‌లో అంతర్గతంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మెడిసిన్, సైకాలజీ, స్టాటిస్టిక్స్.. ఇలా పలు సబ్జెక్టులు ఉంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కేసు తీవ్రతను బట్టి వివిధ విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది.

మార్పుల బిశగా..!

ప్రపంచవ్యాప్తంగా ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందుకు తగ్గట్టుగానే మన దేశం సైతం సన్నద్ధమవుతోంది. ఫోరెన్సిక్ రంగంలో పరిశోధనల కోసం ప్రత్యేకంగా 'గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ' ఏర్పాటైంది. మన దేశంలో ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించిన కోర్సులకు ఈ యూనివర్సిటీ ముఖ్యమైన సంస్థగా పేర్కొనొచ్చు. స్పెక్ట్రోగ్రామ్స్‌పై వాయిస్ శాంపిల్స్ ఉపయోగించి సులువుగా ఆడియో టేపుల్లో గొంతును విశ్లేషించడానికి ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ ఉపయోగపడుతుంది. అలాగే ఫోరెన్సిక్ అకౌంటింగ్ ద్వారా ఆర్థిక నేరగాళ్లను తెలుసుకోవడం, ఆర్థిక నేరాలను గుర్తించడం సాధ్యమవుతుంది. ఇంతటి కీలకమైన ఫోరెన్సిక్ స్పీచ్ సైన్సెస్, ఫోరెన్సింగ్ అకౌంటింగ్ కోర్సులను ఆలిండియా ఇన్‌సిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్-మైసూర్ సంస్థ అందిస్తోంది.

అర్హతలు

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌లో చేరొచ్చు. అలాగే సైన్స్ సబ్జెక్టుల్లో డిగ్రీ పూర్తిచేసిన వారు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌లో ప్రవేశం పొందొచ్చు. ఇందులో డిజిటల్ ఫోరెన్సిక్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, హోం ల్యాండ్ సెక్యూరిటీ అండ్ యాంటీ టెర్రరిజం వంటి విభాగాలున్నాయి. ఎంఏ క్రిమినాలజీకి మాత్రం ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులు. ఫోరెన్సిక్ సైన్స్‌లో పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంది. ఎంబీఏ చేయాలనుకునే వారికి ఫోరెన్సిక్ అకౌంటింగ్ కోర్సు.. ఎంటెక్ అయితే సైబర్ సెక్యూరిటీ అండ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ కోర్సు.. పీజీ డిప్లొమా వాళ్లకు ఫోరెన్సిక్ టాక్సికాలజీ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

కోర్సులందిస్తున్న పలు వర్సిటీలు

» గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ » నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ » యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ » పంజాబ్ యూనివర్సిటీ » ఉస్మానియా యూనివర్సిటీ » బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ » అమిటీ యూనివర్సిటీ.

కొలువులు

ఎంచుకున్న స్పెషలైజేషన్‌పై ఉద్యోగావకాశాలు ఆధారపడి ఉంటాయి. ప్రభుత్వ, ప్రయివేటు ఏజెన్సీలు, ఆసుపత్రులు, ల్యాబొరేటరీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు ఫోరెన్సిక్ నిపుణులను డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకుంటున్నాయి. అలాగే యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్, మాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ తదితర విభాగాల్లో అవకాశాలు లభిస్తాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), పోలీస్ శాఖల్లో ఫోరెన్సిక్ ఉద్యోగాలుంటాయి. ఫ్రీలాన్సర్‌గా రాణించడానికి రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం నుంచి సర్టిఫికేషన్ తీసుకోవాలి. ఫోరెన్సిక్ టాక్సికాలజీ, ఫోరెన్సిక్ బయాలజీ, క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ విభాగాల్లో ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు.

నైపుణ్యాలు

పాఠ్యాంశాల ద్వారా సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే తెలుస్తాయి. కానీ వాస్తవ పరిస్థితులను నిశితంగా గమనించినప్పుడే ఏవైనా ఆధారాలు లభిస్తాయి. సేకరించిన సమాచారాన్ని భిన్న కోణాల్లో విశ్లేషించడం, తర్కం, ఆప్టిట్యూడ్‌లతో మరింతగా రాణించొచ్చు. అకడమిక్ పరిజ్ఞానంతో పాటు సైన్స్‌కు సంబంధించిన విభాగాల్లో అవగాహన ఉన్న వాళ్లు మరింత సమర్థవంతంగా రాణించగలరు. ఈ రంగంలో సునిశిత పరిశీలన, విశ్లేషణ సామర్థ్యం ఎంతో ముఖ్యం. సైన్స్ పట్ల ఆసక్తి, గణితంలో ప్రావీణ్యం, సమాచారాన్ని విశ్లేషించగలగడం, లోతుగా ఆలోచించడం, వాస్తవానికి దగ్గరగా ఊహించడం వంటి నైపుణ్యాలు ఉండాలి. కొన్నిసార్లు సైకాలజిస్టులు, స్టాటిస్టిక్ నిపుణులు వంటి ఇతర విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. కాబట్టి మంచి కమ్యూనికేటర్‌గా, టీమ్ మెంబర్‌గా మెలగడం తప్పనిసరి. అప్పుడప్పుడు అవుట్ డోర్ పని కూడా ఉంటుంది. వీటన్నింటికీ సదా సిద్ధంగా ఉండాలి.

ఫోరెన్సిక్ ఉద్యోగ విభాగాలు

ఫోరెన్సిక్ సెరాలజీ

ఇది ముఖ్యంగా హత్యలు, భౌతిక దాడులు, దోపిడీలు,దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో లభ్యమైన ఆధారాలను పరిశీలిస్తుంది. రక్తాన్ని, వెంట్రుకలను విశ్లేషించి నేరస్తులను గుర్తిస్తారు. అలాగే డీఎన్ఏ పరీక్షల ద్వారా కూడా నేర నిర్ధరణ చేస్తారు.

ఫోరెన్సిక్ సైకియాట్రీ

నేరం చేసిన వ్యక్తి మానసిక పరిస్థితిని అంచనావేసే డిపార్ట్‌మెంట్. ఉదాహరణకు వ్యక్తి నేరం చేసేటప్పుడు మతిస్థిమితం సరిగ్గా ఉందా లేదా, ఏదైనా మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నాడా అనే విషయాలను పరిశీలిస్తారు. అలాగే కేసుకు సంబంధించి విచారణను ఎదుర్కొగలుగుతారా? లేదా? అని గమనిస్తారు. మానసిక రోగులు, సైకో దాడులు, హత్యకు సంబంధించిన కేసుల్లో వీరి అవసరం ఉంటుంది.

ఫోరెన్సిక్ ఇంజనీరింగ్

రోడ్ యాక్సిడెంట్స్, ఫైర్ యాక్సిడెంట్స్, ఇతర గాయాలకు సంబంధించిన కేసుల చిక్కుముడిని పరిశీలిస్తారు.

ఫోరెన్సిక్ ఆర్కిటెక్చర్

మార్చురీలు, ఫోరెన్సిక్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లను డిజైన్ చేస్తారు. ఇది ఆర్కిటెక్చర్, ఫోరెన్సిక్ కలయికగా ఉంటుంది.

ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ అనాలసిస్

డీఎన్ఏ టెస్ట్‌లు నిర్వహించడం ఈ విభాగంలో పనిచేసే నిపుణుల బాధ్యత. అలాగే రక్తానికి సంబంధించి సూక్ష్మ విశ్లేషణ చేస్తారు.

ఫోరెన్సిక్ పాథాలజీ

అనుమానాస్పద స్థితిలో మరణించిన వ్యక్తికి పోస్ట్‌మార్టం నిర్వహించి.. మరణం వెనుక గల కారణాలను వెల్లడిస్తారు. ప్రమాదవశాత్తు మరణించారా, సహజ మరణమా, హత్య, ఆత్మహత్యా అనే విషయాలపై కచ్చితమైన నివేదిక అందిస్తారు.

ఫోరెన్సిక్ వెటర్నరీ

చనిపోయిన జంతువుల కళేబరాలకు పరీక్షలు నిర్వహించడం, జంతువుల అనవసర మరణాల వెనుక కారణాలను పరిశీలించడం వీరి ప్రధాన కర్తవ్యం.

ఫోరెన్సిక్ టాక్సికాలజీ

విష ప్రభావం కారణంగా మరణించిన వారి కేసులపై వీరు పరిశోధన చేస్తారు. విషం సదరు వ్యక్తే తాగాడా లేక మరెవరైనా విష ప్రయోగం చేశారా అనే విషయాలను నిర్ధరిస్తారు. డ్రగ్స్ సహా ఇతర ఏ మత్తు పదార్థాలు తీసుకున్నా.. ఎంత మోతాదులో తీసుకున్నారు, తీసుకున్న డ్రగ్ పేరును గుర్తిస్తారు.

వైల్డ్‌లైఫ్ ఫోరెన్సిక్ నిపుణులు

పేరులో సూచించినట్లుగానే ఈ విభాగంలో పనిచేసే నిపుణులు జంతువులు, వన్యప్రాణుల సంబంధిత అంశాలపై పనిచేస్తారు. చాలా సందర్భాల్లో జంతువుల తోలు, ఏనుగు దంతాలు వంటి వాటికి విపరీతమైన ధర ఉంటుంది. ఇందుకోసం నేరస్థులు జంతువులను చంపి, ముఖ్యమైన అవయవాలను అక్రమ రవాణా చేస్తారు. ఈ నేరస్థులను పట్టుకోవడానికే వైల్డ్‌లైఫ్ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ ఉంటుంది.

ఫోరెన్సిక్ లింగ్విస్ట్‌లు

ఈ విభాగంలో పనిచేసే వారు నేరం జరిగిన చోట లభించిన పేపర్స్, ఆడియోలకు సంబంధించిన వివరాలు ఏమైనా లభిస్తే వాటిని పరిశీలిస్తారు. లభించిన పేపర్స్‌కు టెస్ట్‌లు నిర్వహించి వాటిని ఎవరు రాశారు, సంతకం ఎవరిది, ఆడియో టేప్‌లోని వాయిస్ నకిలీదా, గొంతు ఎవరిది అనే విషయాలపై పరీక్షలు నిర్వహించి నిజనిర్ధారణ చేస్తారు.

ఫోరెన్సిక్ అడొంటాలజీ

ఒంటిపైన గాట్లు ఏమైనా ఉంటే వాటికి కారణమైన వారు ఎవరు అనేదానిపై వీరు పరిశీలన జరుపుతారు. జంతువుల కారణంగా జరిగిందా లేదా మనుషుల గోళ్లతో, పళ్లతో గాయపరిచారా అనే విషయాలను పరిశీలిస్తారు.

ఫోరెన్సిక్ అకౌంటెంట్లు

ఫోరెన్సిక్ అకౌంటింగ్ ద్వారా ఆర్థిక నేరగాళ్లను పట్టుకోవడం సులభమవుతుంది. వివాదాల్లో ఉన్న కంపెనీల ఆర్థిక లావాదేవీలను అర్థమయ్యే రీతిలో కోర్టు ముందు ఉంచడం వీరి ప్రధాన కర్తవ్యం.

నోటిఫికేషన్స్

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2020

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి 24 రకాల సివిల్ సర్వీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 796
- **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 21ఏళ్ల నుంచి 32ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ప్రిలిమ్స్(ఆబ్జెక్టివ్), మెయిన్ (డిస్క్రిప్టివ్), ఇంటర్వ్యూ అనే మూడంచెల ఎంపిక ప్రక్రియ ద్వారా సివిల్ సర్వీసు ఉద్యోగాలను భర్తీ చేస్తారు.
- **ప్రిలిమ్స్ పరీక్ష తేది:** 31.05.2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ■**దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేది:** 03.03.2020
- **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in

Government of India
Union Public Service Commission

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామ్ 2020

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 90
- **అర్హత:** ఆయా విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. సంబంధిత డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే.
- **వయసు:** 21 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమ్స్(ఆబ్జెక్టివ్), మెయిన్(డిస్క్రిప్టివ్), ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **ప్రిలిమ్స్ పరీక్ష తేది:** 31.05.2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 03.03.2020
- **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in

కెరీర్ కౌన్సెలింగ్

నేటి టెక్నాలజీ యుగంలో కోర్సులు, కొలువులు, కెరీర్స్ రూపరేఖలు వేగంగా మారిపోతున్నాయి. రోజుకో టెక్నాలజీ తెరపైకి వస్తోంది. ఎన్నో రకాల ఉద్యోగాలు.. రకరకాల కోర్సులు.. విభిన్న నైపుణ్యాలు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం జాబ్ మార్కెట్ ట్రెండ్ ఎలా ఉంది.. ఏ కోర్సు చేస్తే.. ఎలాంటి ఉద్యోగం లభిస్తుంది.. భవిష్యత్ అవకాశాలు ఎలా ఉంటాయి.. ఇలా కెరీర్ ఎంపికలో మీ సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మీరు చేయాల్సిందల్లా.. మీ సందేహాలను **sakshieducation@gmail.com**కు మెయిల్ చేయడమే!!

గేట్ తర్వాత మార్గమిదిగో..!

ఇంజనీరింగ్ స్పెషల్

దేశవ్యాప్తంగా లక్షల మంది హాజరైన గేట్-2020 పరీక్ష ముగిసింది. ఇప్పుడు పరీక్షకు హాజరైన అభ్యర్థులంతా పేపర్ విశ్లేషణ, కటాఫ్ మార్కుల గురించి చర్చించుకుంటున్నారు. అదే సమయంలో గేట్‌కు ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టిసారిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఉపయోగపడేలా గేట్ పేపర్ల విశ్లేషణతోపాటు, గేట్‌కు దీటైన ప్రత్యామ్నాయ అవకాశాలు, అందుబాటులో ఉన్న కోర్సులపై కథనం..

- » ముగిసిన గేట్ 2020 పరీక్షలు
- » పేపర్ విశ్లేషణ, కటాఫ్ మార్కులపై అభ్యర్థుల చర్చ
- » ప్రత్యామ్నాయాలపైనా దృష్టిసారిస్తున్న వైనం

ఎగ్జామ్ రివ్యూ..

మెకానికల్.. పెరిగిన ఎంసీక్యూలు

ఈ పేపర్‌ను ఫిబ్రవరి 1న రెండు షిఫ్టు(స్లాట్)ల్లో నిర్వహించారు. ఎప్పట్లానే ప్రశ్నపత్రంలో మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్(ఎంసీక్యూలు), న్యూమరికల్ ఆన్సర్ టైప్(ఎన్ఏటీ) ప్రశ్నలు అడిగారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఎంసీక్యూల సంఖ్య పెరిగింది. ఒక మార్కు ప్రశ్నలు సులభం నుంచి మధ్యస్థంగా ఉండగా.. రెండు మార్కుల ప్రశ్నలు మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నాయి. ఇంజనీరింగ్ మ్యాథ్స్ అండ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు సరళంగా,తక్కువ వ్యవధిలో సాధించేవిగా ఉన్నాయి. రెండు స్లాట్స్‌ను పరిశీలిస్తే మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంజనీరింగ్ మ్యాథ్స్, థర్మోడైనమిక్స్ అండ్ అప్లికేషన్స్‌కు ఎక్కువ వెయిటేజీ దక్కింది. రెండో స్లాట్‌లో ప్రశ్నలు ఒకింత కాన్సెప్చ్యువల్‌గా ఉన్నాయి. రెండు మార్కుల ప్రశ్నలు పెద్దవిగా అడిగారు.

ఈసీఈ.. అప్టిట్యూడ్ సులభం

ఈసీఈలో గతేడాదితో పోల్చితే ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయి. ఆప్టిట్యూడ్ అండ్ ఇంగ్లిష్ విభాగం సులభంగా ఉంది. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఎంసీక్యూ, ఎన్ఏటీ ప్రశ్నలు దాదాపు సరిసమానంగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే ఎంసీక్యూల సంఖ్య ఎక్కువగా ఉంది. నెట్‌వర్క్స్‌లో సిద్ధాంతాలపై ప్రశ్నలు అడిగారు. 2-పోర్ట్ నెట్‌వర్క్స్, ఏసీ అనాలసిస్ అండ్ స్టేట్ ఈక్వేషన్స్, ఈడీసీ ప్రశ్నలన్నీ ఎంవోఎస్ఎఫ్ఈటీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ నుంచి వచ్చాయి. కంట్రోల్ సిస్టమ్స్‌లో ఆర్‌హెచ్ క్రైటీరియన్, ఫ్రీక్వెన్సీ రెస్పాన్స్ అనాలసిస్, టైమ్ రెస్పాన్స్ అనాలసిస్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ నుంచి ప్రశ్నలు వచ్చాయి. డిజిటల్, అనలాగ్, కమ్యూనికేషన్స్‌లో కోర్ కాన్సెప్టుల నుంచి ప్రశ్నలు అడిగారు. ఇంజనీరింగ్ మ్యాథ్స్ అండ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు సులభం నుంచి మధ్యస్థంగా ఉన్నాయి. వెయిటేజీ పరంగా జనరల్ ఆప్టిట్యూడ్, అనలాగ్, ఇంజనీరింగ్ మ్యాథ్స్, ఈడీసీలకు ప్రాధాన్యం దక్కింది.

కెమికల్.. ప్రశ్నలు ట్రికీ

రెండు సెషన్ల పేపర్లు సులభం నుంచి మధ్యస్థంగా ఉన్నాయి. టెస్టు సిరీస్‌ల్లో ప్రాక్టీస్ చేసిన ప్రశ్నల్లో చాలా వరకు పరీక్షలో వచ్చాయి. పలు ట్రికీ ప్రశ్నలు అడిగారు. ఔట్ ఆఫ్ ది బాక్స్ ప్రశ్నలు 30-40 శాతం. ఫ్లూయిడ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్ ప్రశ్నల్లో ఎక్కువ శాతం టెస్టు సిరీస్‌ల నుంచే వచ్చాయి. ఎఫ్ఎం అండ్ ఎంవోలో బౌండరీ లేయర్, పాస్కల్స్ లా, పంప్, ఎంట్రీ లెంగ్త్, పవర్ నంబర్స్‌పై ప్రశ్నలు అడిగారు. థర్మోడైనమిక్స్‌లో మెకానికల్ ఈక్విలిబ్రియం, ఎక్స్‌టెంట్ ఆఫ్ రియాక్షన్, క్లాసికల్ థర్మోడైనమిక్స్, ప్యూర్ సబ్‌స్టెన్సెస్ నుంచి ప్రశ్నలు వచ్చాయి. పీడీఈ, పీడీసీ, మాస్ ట్రాన్స్‌ఫరెన్స్, కెమికల్ టెక్నాలజీపై ప్రశ్నలు ఎదురయ్యాయి. మాస్ ట్రాన్స్‌ఫరెన్స్ ప్రశ్నలు గతేడాది కంటే సులభంగా ఉన్నట్లు చెబుతున్నారు.

గేట్ పేపర్ విశ్లేషణ

మెకానికల్.. పెరిగిన ఎంసీక్యూలు

ఈ పేపర్‌ను ఫిబ్రవరి 1న రెండు షిఫ్టు(స్లాట్)ల్లో నిర్వహించారు. ఎప్పట్లానే ప్రశ్నపత్రంలో మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్(ఎంసీక్యూలు), న్యూమరికల్ ఆన్సర్ టైప్(ఎన్ఏటీ) ప్రశ్నలు అడిగారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఎంసీక్యూల సంఖ్య పెరిగింది. ఒక మార్కు ప్రశ్నలు సులభం నుంచి మధ్యస్థంగా ఉండగా.. రెండు మార్కుల ప్రశ్నలు మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నాయి. ఇంజనీరింగ్ మ్యాథ్స్ అండ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు సరళంగా,తక్కువ వ్యవధిలో సాధించేవిగా ఉన్నాయి. రెండు స్లాట్స్‌ను పరిశీలిస్తే మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంజనీరింగ్ మ్యాథ్స్, థర్మోడైనమిక్స్ అండ్ అప్లికేషన్స్‌కు ఎక్కువ వెయిటేజీ దక్కింది. రెండో స్లాట్‌లో ప్రశ్నలు ఒకింత కాన్సెప్చ్యువల్‌గా ఉన్నాయి. రెండు మార్కుల ప్రశ్నలు పెద్దవిగా అడిగారు.

ఈసీఈ.. అప్టిట్యూడ్ సులభం

ఈసీఈలో గతేడాదితో పోల్చితే ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయి. ఆప్టిట్యూడ్ అండ్ ఇంగ్లిష్ విభాగం సులభంగా ఉంది. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఎంసీక్యూ, ఎన్ఏటీ ప్రశ్నలు దాదాపు సరిసమానంగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే ఎంసీక్యూల సంఖ్య ఎక్కువగా ఉంది. నెట్‌వర్క్స్‌లో సిద్ధాంతాలపై ప్రశ్నలు అడిగారు. 2-పోర్ట్ నెట్‌వర్క్స్, ఏసీ అనాలసిస్ అండ్ స్టేట్ ఈక్వేషన్స్, ఈడీసీ ప్రశ్నలన్నీ ఎంవోఎస్ఎఫ్ఈటీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ నుంచి వచ్చాయి. కంట్రోల్ సిస్టమ్స్‌లో ఆర్‌హెచ్ క్రైటీరియన్, ఫ్రీక్వెన్సీ రెస్పాన్స్ అనాలసిస్, టైమ్ రెస్పాన్స్ అనాలసిస్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ నుంచి ప్రశ్నలు వచ్చాయి. డిజిటల్, అనలాగ్, కమ్యూనికేషన్స్‌లో కోర్ కాన్సెప్టుల నుంచి ప్రశ్నలు అడిగారు. ఇంజనీరింగ్ మ్యాథ్స్ అండ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు సులభం నుంచి మధ్యస్థంగా ఉన్నాయి. వెయిటేజీ పరంగా జనరల్ ఆప్టిట్యూడ్, అనలాగ్, ఇంజనీరింగ్ మ్యాథ్స్, ఈడీసీలకు ప్రాధాన్యం దక్కింది.

కెమికల్.. ప్రశ్నలు ట్రికీ

రెండు సెషన్ల పేపర్లు సులభం నుంచి మధ్యస్థంగా ఉన్నాయి. టెస్టు సిరీస్‌ల్లో ప్రాక్టీస్ చేసిన ప్రశ్నల్లో చాలా వరకు పరీక్షలో వచ్చాయి. పలు ట్రికీ ప్రశ్నలు అడిగారు. ఔట్ ఆఫ్ ది బాక్స్ ప్రశ్నలు 30-40 శాతం. ఫ్లూయిడ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్ ప్రశ్నల్లో ఎక్కువ శాతం టెస్టు సిరీస్‌ల నుంచే వచ్చాయి. ఎఫ్ఎం అండ్ ఎంవోలో బౌండరీ లేయర్, పాస్కల్స్ లా, పంప్, ఎంట్రీ లెంగ్త్, పవర్ నంబర్స్‌పై ప్రశ్నలు అడిగారు. థర్మోడైనమిక్స్‌లో మెకానికల్ ఈక్విలిబ్రియం, ఎక్స్‌టెంట్ ఆఫ్ రియాక్షన్, క్లాసికల్ థర్మోడైనమిక్స్, ప్యూర్ సబ్‌స్టెన్సెస్ నుంచి ప్రశ్నలు వచ్చాయి. పీడీఈ, పీడీసీ, మాస్ ట్రాన్స్‌ఫరెన్స్, కెమికల్ టెక్నాలజీపై ప్రశ్నలు ఎదురయ్యాయి. మాస్ ట్రాన్స్‌ఫరెన్స్ ప్రశ్నలు గతేడాది కంటే సులభంగా ఉన్నట్లు చెబుతున్నారు.

దీటైన ప్రత్యామ్నాయాలు

సీయూ సెట్

సీయూసెట్ ద్వారా పద్నాలుగు సెంట్రల్ యూనివర్సిటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఇవి హరియాణా, జమ్ము, జార్ఖండ్, కర్ణాటక, కశ్మీర్, కేరళ, పంజాబ్, రాజస్థాన్, సౌత్ బిహార్, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహాత్మాగాంధీ సెంట్రల్ యూనివర్సిటీ, అసోం యూనివర్సిటీ. **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్.

పీజీఈసెట్

✦ రాష్ట్ర స్థాయిలో ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో చేరడానికి పీజీఈసెట్ రాయాలి. సంబంధిత బ్రాంచ్‌లో 50 శాతం మార్కులతో బీటెక్, బీఈ, బీఫార్మసీ, బీఆర్క్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్

తిలక్ వర్మ

అయినా... గెలుస్తామనుకున్నాం!

- అండర్-19 ఫైనల్‌పై భారత ఆటగాడు తిలక్ వర్మ
- వ్యక్తిగత ప్రదర్శనకంటే జట్టు గెలవడమే ముఖ్యం
- 'సాక్షి'తో హైదరాబాద్ యువ క్రికెటర్

ప్రపంచకప్‌లో భారత యువ జట్టు తొలి మ్యాచ్ నుంచి చక్కటి ప్రదర్శన కనబర్చినా... చివరి మెట్టుపై అనూహ్యంగా తలవంచింది. బంగ్లాదేశ్ చేతిలో ఓటమితో రన్నరప్‌గానే సంతృప్తి చెందాల్సి వచ్చింది. అయితే ఈ మెగా టోర్నీలో పాల్గొనడం ద్వారా ప్రతీ యువ క్రికెటర్ తన కలను నెరవేర్చుకున్నాడు. వారిలో హైదరాబాద్‌కు చెందిన నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ కూడా ఒకడు. గత రెండేళ్లుగా భారత అండర్-19 టీమ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగిన అతను తాజా వరల్డ్ కప్ జట్టు సభ్యుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. తుది పోరు అనంతరం బుధవారం స్వస్థలం చేరుకున్న అతను తన అనుభవాన్ని 'సాక్షి'తో పంచుకున్నాడు.

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ కప్‌ను గెలిచేందుకు అన్ని రకాలుగా అర్హతలు ఉన్న తమ జట్టు త్రుటిలో ఆ అవకాశం చేజార్చుకోవడం నిరాశ కలిగించిందని భారత అండర్-19 జట్టు బ్యాట్స్‌మన్ తిలక్ వర్మ అన్నాడు. ఈ టోర్నీలో టీమిండియా యువ జట్టు ఆడిన ఆరు మ్యాచ్‌లలోనూ తిలక్ వర్మ భాగంగా ఉన్నాడు. బంగ్లాదేశ్‌పై చివరి వరకూ గెలవగలమని నమ్మామని... అయితే చివరకు అది సాధ్యం కాలేదంటూ తిలక్ చెప్పిన విశేషాలు అతని మాటల్లోనే...

ఫైనల్లో పరాజయంపై...

మ్యాచ్‌కు ముందు చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఎప్పుడు కూడా బంగ్లా చేతిలో ఓడిపోతామనే ఆలోచనే రాలేదు. అయితే అనూహ్య ఫలితం వచ్చింది. నిరాశపడటం సహజమే. అయితే మా కోచ్ అభయ్ శర్మ తన మాటలతో మాలో మళ్లీ స్ఫూర్తి నింపారు. ఓడిపోవడంలో తప్పు లేదని, అద్దంలో మనల్ని మనం చూసుకొని ఎలాంటి ప్రదర్శన ఇచ్చామో నిజాయితీగా తెలుసుకుంటే చాలని చెప్పారు. ఆ రకంగా చూస్తే మా ఆట ఎంతో సంతృప్తినిచ్చింది. ద్రవిడ్ సర్ కూడా ప్రతీ మ్యాచ్‌కు ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాతో సంభాషించేవారు.

ఫైనల్ సాగిన తీరుపై...

మ్యాచ్ ముందు రోజు కురిసిన వర్షం కారణంగా పిచ్‌పై తేమ ఉండిపోయింది. మేం ముందుగా బౌలింగ్ చేసి ఉంటే ఫలితం భిన్నంగా ఉండేదేమో. అయితే పిచ్‌తో మేం ఇబ్బంది పడలేదు. నేను, యశస్వి చక్కటి భాగస్వామ్యం నెలకొల్పాం. నేను అవుటైన తర్వాత జట్టు బ్యాటింగ్ తడబడింది. అయినా సరే 220-230 పరుగులు చేయగలమని భావించాం. కానీ అంతకంటే చాలా తక్కువ స్కోరుకే పరిమితమయ్యాం. మా బౌలింగ్‌పై నమ్మకముంది కాబట్టి కాపాడుకోగలమనిపించింది. 150 పరుగులు చేసినా గెలవగలమని భావించాం. ఆసియా కప్‌లో 105 పరుగులు చేసి కూడా ఇదే బంగ్లాపై గెలిచాం కాబట్టి నమ్మకముంది. నిజంగానే మా బౌలర్లు బాగా కట్టడి చేశారు. అయితే ఒక్క కెప్టెన్ ఇన్నింగ్ ఫలితాన్ని మార్చింది.

టాస్ కీలకంగా మారిందా...

అలా ఏమీ లేదు. రాహుల్ ద్రవిడ్ సర్ శిక్షణలో మేం అన్ని రకాల కాలమాన పరిస్థితుల్లో ఆడేందుకు సన్నద్ధమయ్యాం. పిచ్ ఏదైనా, వాతావరణం ఎలా ఉన్నా, ప్రత్యర్థి ఎలా ఉన్నా సమస్య లేదు. గత రెండేళ్లుగా ఇంతకంటే కఠినమైన, విభిన్నమైన పరిస్థితుల్లో మ్యాచ్‌లు గెలిచాం. కాబట్టి ముందుగా బ్యాటింగ్ చేయడం సమస్య కాదు. ఆ రోజు మాకు కలిసి రాలేదు.

ఫైనల్ తర్వాత జరిగిన ఘటనలపై...

నిజానికి ఇందులో భారత ఆటగాళ్ల తప్పేమీ లేదు. బంగ్లా కుర్రాళ్లే తొలిసారి ప్రపంచ కప్ గెలిచిన ఆనందంలో నిలవలేకపోయారు. వారే దూషణలకు దిగారు. దాంతో మా ఆటగాళ్లు ఒకరిద్దరు వారిని నిరోధించేందుకు ప్రయత్నించాల్సి వచ్చింది. దాదాపు పది నిమిషాల పాటు కాస్త ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. అయితే ఆ తర్వాత అంతా మామూలుగా మారిపోయింది. సారీలు చెప్పుకొని షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నాం. నిజంగా చెప్పాలంటే ఆటగాళ్లకంటే బంగ్లా అభిమానుల వల్లే సమస్య వచ్చింది. ఫైనల్‌కు వారు పెద్ద సంఖ్యలో వచ్చారు. వారితో పోలిస్తే భారత అభిమానులు కొద్ది మందే. దాంతో రెచ్చగొట్టి సమస్యగా మార్చారు.

పాకిస్తాన్‌తో మ్యాచ్‌పై...

ఆ జట్టుతో పోలిస్తే మా జట్టు బాగా బలంగా ఉందని తెలుసు కాబట్టి దానిని మరో మ్యాచ్‌గానే చూశాం తప్ప ప్రత్యేకంగా ఏమీ లేదు. ఇక ఆటగాళ్లతో దూరం పాటించడం, గంభీరంగా ఉండటం కూడా బయట రాసినంత ఎక్కువగా ఏమీ లేదు. అదేమీ తెచ్చి పెట్టుకున్నది కూడా లేదు. అసలు ఆ విషయం గురించి ఆలోచించాల్సిన అవసరమే లేకపోయింది.

వరల్డ్ కప్‌లో వ్యక్తిగత ప్రదర్శనపై...

ఆరు మ్యాచ్‌లలో మూడు ఇన్నింగ్స్‌లలోనే బ్యాటింగ్ అవకాశం వచ్చింది. మిగతా మూడు మ్యాచ్‌లు ఓపెనర్లే కొట్టేశారు. బ్యాటింగ్ ఎక్కువగా రాకపోవడం కొంత నిరాశ కలిగించినా... జట్టు విజయమే అన్నింటికంటే ముఖ్యం కాబట్టి దాని గురించి ఆలోచన అనవసరం. ఆస్ట్రేలియాతో విఫలమైనా శ్రీలంక, ఫైనల్లో బంగ్లాపై బాగా ఆడాను. ఫైనల్ ఇన్నింగ్స్ కూడా చాలా ఆత్మవిశ్వాసంతో ఆడాను. సెంచరీ చేస్తానని అనిపించింది. కానీ అద్భుతమైన క్యాచ్‌కు వెనుదిరిగాను. వరల్డ్ కప్‌కు ముందు నాలుగు జట్ల టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలవడంతో పాటు 9 ఇన్నింగ్స్‌లలో 6 అర్ధ సెంచరీలు చేయడం ద్వారా మంచి ఫామ్‌తో నేను టోర్నీకి వచ్చాను. దక్షిణాఫ్రికా బయల్దేరే ముందు హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహరుద్దీన్ సర్, నా వ్యక్తిగత కోచ్ సాలమ్ బయాష్ ఇచ్చిన అమూల్య సూచనలు ఎంతో పనికొచ్చాయి.

టోర్నీలో మరచిపోలేని క్షణం...

ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఆరు వికెట్లు కోల్పోయిన సమయంలో ఇక ఓడిపోతామేమో అనిపించింది. తీవ్ర ఉత్కంఠను అనుభవించిన క్షణం అది. అయితే చివరకు గెలుపు అందుకోవడం అందరికీ ఎంతో సంతృప్తినిచ్చింది. మైదానం బయట మేం క్రూగర్స్‌పార్క్ సహా చాలా చోట్ల విహరించాం. అన్నింటికంటే బంగారం తయారీని చూడటం ఒక చక్కటి జ్ఞాపకం.



బుధవారం దక్షిణాఫ్రికా నుంచి హైదరాబాద్ చేరుకున్నాక కోచ్ సాలమ్ బయాష్‌తో తిలక్ వర్మ

రాబోయే టోర్నీలపై...

ముందు ఇప్పట్లో అండర్-19 ఈవెంట్‌లు ఏవీ లేవు కాబట్టి ఇక దృష్టి అంతా సీనియర్ క్రికెటర్‌గా ఎదగడంపైనే పెడతాను. ప్రాక్టీస్‌తో పాటు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనిస్తా. రంజీ సీజన్ కూడా ఇప్పుడు ముగిసిపోయింది. ఐపీఎల్‌కు ఎంపిక కాకపోవడం కొంత నిరాశ కలిగించింది. ఒకటి రెండు జట్ల ట్రయల్స్‌కు వెళ్లాను కూడా. కానీ అవకాశం దక్కలేదు. అయితే ఇకపై మరింత కష్టపడి సీనియర్ స్థాయిలోనూ రాణించడమే నా లక్ష్యం.

చేజేతులా...

- మహిళల ముక్కోణపు టి20 టోర్నీ ఫైనల్లో భారత్ పరాజయం
- ఒకదశలో 115/3... ఆ తర్వాత 144కు ఆలౌట్
- ఆస్ట్రేలియాను గెలిపించిన జెస్సికా (5/12)

మెల్‌బోర్న్: కీలకదశలో ఒత్తిడికి లోనైన భారత మహిళల క్రికెట్ జట్టు మూల్యం చెల్లించుకుంది. విజేతగా నిలవాల్సిన చోట పరాజయాన్ని పలకరించింది. ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా ఆస్ట్రేలియాతో బుధవారం జరిగిన ఫైనల్లో భారత్ 11 పరుగుల తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఒకదశలో 15 ఓవర్లలో 3 వికెట్లకు 115 పరుగులు చేసి విజయందిశగా సాగుతోంది. భారత్ విజయానికి 30 బంతుల్లో 41 పరుగులు అవసరమైన దశలో... ఆస్ట్రేలియా లెఫ్టార్మ్ స్పిన్నర్ జెస్సికా జొనాస్సెన్ మాయాజాలం చేసింది. జెస్సికా స్పిన్ వలలో చిక్కుకున్న భారత మహిళల జట్టు చివరి 7 వికెట్లను 29 పరుగుల తేడాలో కోల్పోయి సరిగ్గా 20 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటై ఓటమి చవిచూసింది. జోరు మీదున్న స్మృతి మంధాన (37 బంతుల్లో 66; 12 ఫోర్లు)ను మేగన్ షుట్ అవుట్ చేయగా... ఆ తర్వాత జెస్సికా స్పిన్‌కు హర్మన్‌ప్రీత్ (14; 2 ఫోర్లు)... దీప్తి శర్మ (10), అరుంధతి రెడ్డి (0), రాధా యాదవ్ (2), తానియా భాటియా (11; 2 ఫోర్లు) పెవిలియన్ చేరుకున్నారు. శిఖా పాండే (4)ను ఎలీస్ పెర్రీ అవుట్ చేసింది. అంతకుముందు ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 155 పరుగులు సాధించింది. బెథానీ మూనీ (54 బంతుల్లో 71 నాటౌట్; 9 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. యాష్లే గార్డెనర్ (26; 5 ఫోర్లు), మేగన్ లానింగ్ (26; 2 ఫోర్లు, సిక్స్) రాణించారు. భారత స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఆస్ట్రేలియా ఏకంగా 19 పరుగులు సాధించి భారత్ ముందు క్లిష్టమైన లక్ష్యాన్ని ఉంచింది.

జీఎస్ లక్ష్మి మరో ఘనత

ఐసీసీ మహిళల టి20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ రిఫరీగా బాధ్యతలు

దుబాయ్: గతేడాది డిసెంబర్‌లో పురుషుల అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన తొలి మహిళగా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ మాజీ క్రికెటర్ గండికోట సర్వ (జీఎస్) లక్ష్మి మరో ఘనతను సాధించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రపంచ స్థాయి టోర్నీలో తొలి మహిళా మ్యాచ్ రిఫరీగా ఆమె వ్యవహరించనున్నారు. రాజమండ్రికి (రాజమహేంద్రవరం) చెందిన 51 ఏళ్ల జీఎస్ లక్ష్మి ఈనెల 21న ఆస్ట్రేలియాలో మొదలుకానున్న మహిళల టి20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ రిఫరీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ మెగా టోర్నీకి మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరించే ముగ్గురిలో ఏకైక మహిళ జీఎస్ లక్ష్మినే కావడం విశేషం. లక్ష్మి తోపాటు స్టీవ్ బెర్నార్డ్, క్రిస్ బ్రాడ్‌లను మ్యాచ్ రిఫరీలుగా ఐసీసీ నియమించింది. మ్యాచ్ అంపైర్లుగా 12 మందిని నియమించగా అందులో ఐదుగురు మహిళలకు (లారెన్ అగెన్‌బాగ్, కిమ్ కాటన్, క్లెయిరీ పొలోసక్, స్యు రెడ్‌ఫెర్న్, జాక్వెలైన్ విలియమ్స్) చోటు దక్కింది. ఏడుగురు పురుష అంపైర్లలో భారత్ నుంచి నితిన్ మీనన్‌కు మాత్రమే అవకాశం లభించింది. లీగ్ మ్యాచ్‌లు ముగిశాకే సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు ఎవరు అంపైరింగ్ చేస్తారో ప్రకటిస్తారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవం మార్చి 8న మెల్‌బోర్న్ స్టేడియంలో జరిగే ఫైనల్‌తో టి20 వరల్డ్ కప్ ముగుస్తుంది.

అమెరికా 35 ఆలౌట్

వన్డేల్లో అత్యల్ప స్కోరు రికార్డు సమం

కఠ్మాండు (నేపాల్): అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా జింబాబ్వే పేరిట ఉన్న రికార్డును అమెరికా జట్టు సమం చేసింది. వరల్డ్ కప్ లీగ్-2లో భాగంగా బుధవారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 12 ఓవర్లలో కేవలం 35 పరుగులకే కుప్పకూలింది. 2004లో హరారేలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే కూడా 35 పరుగులకే ఆలౌటైంది. నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానే 16 పరుగులిచ్చి 6 వికెట్లు తీసుకొని అమెరికా ఇన్నింగ్స్ పతనాన్ని శాసించాడు. మరో బౌలర్ సుశాన్ భరీ 5 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అమెరికా జట్టులో జేవియర్ మార్షల్ 16 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాట్స్‌మెన్ ఎవరూ రెండంకెల స్కోరు దాటలేకపోయారు. నేపాల్ 5.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 36 పరుగులు చేసి గెలిచింది. గతేడాది అమెరికాకు ఐసీసీ వన్డే హోదా కల్పించింది.

హంపి విజయం... హారిక పరాజయం

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఐదో రౌండ్‌లో నల్లపావులతో ఆడిన హంపి 64 ఎత్తుల్లో నానా జాగ్‌నిద్జే (జార్జియా)పై గెలుపొందగా... నల్లపావులతో ఆడిన హారిక 38 ఎత్తుల్లో వాలెంటినా గునీనా (రష్యా) చేతిలో ఓడిపోయింది. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత హంపి మూడు పాయింట్లతో మూడో స్థానంలో, హారిక 2.5 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నారు.

క్వార్టర్స్‌లో బోపన్న జంట

న్యూఢిల్లీ: రోటర్‌డామ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-డెనిస్ షపోవలోవ్ (కెనడా) జంట శుభారంభం చేసింది. నెదర్లాండ్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-షపోవలోవ్ ద్వయం 7-6 (7/0), 6-7 (5/7), 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ 12 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్)-హొరియా టెకావ్ (రొమేనియా) ద్వయంతో బోపన్న జంట ఆడుతుంది.

ఆంధ్ర తడబాటు...

నడియాడ్: క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకున్న ఆంధ్ర జట్టు... రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నీలో భాగంగా గుజరాత్ జట్టుతో బుధవారం మొదలైన చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో తడబడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర 84.2 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైంది. ప్రశాంత్ కుమార్ (30; 3 ఫోర్లు), కరణ్ షిండే (49; 8 ఫోర్లు), బోడపాటి సుమంత్ (40; 4 ఫోర్లు) రాణించారు. కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ (1), రికీ భుయ్ (2) విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో అర్జన్ నాలుగు వికెట్లు, అక్షర్ పటేల్ మూడు వికెట్లు తీశారు. ఆట ముగిసే సమయానికి గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా రెండు పరుగులు చేసింది.

హైదరాబాద్ 239/7

మరోవైపు హైదరాబాద్‌లో విదర్భతో మొదలైన మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. తొలి రంజీ మ్యాచ్ ఆడుతున్న ప్రతీక్ రెడ్డి (76 బ్యాటింగ్; 8 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. బుద్ధి రాహుల్ (52; 9 ఫోర్లు), టి.రవితేజ (44; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా రాణించారు. ప్రస్తుతం మెహదీ హసన్ (27 బ్యాటింగ్)తో కలిసి ప్రతీక్ రెడ్డి క్రీజులో ఉన్నాడు. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 88 పరుగులు జోడించారు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ నాలుగు, గుర్బానీ మూడు వికెట్లు తీశారు.

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM
(WOMEN'S UNIVERSITY)
TIRUPATI-517502, Andhra Pradesh
18th ANNUAL CONVOCATION
The Eighteenth Annual Convocation of the Sri Padmavati Mahila Visvavidyalayam to confer Degrees and Diplomas either 'IN PERSON' or 'IN ABSENTIA' is proposed to be held in the month of June / July, 2020. For Applications and other details please visit the website www.spmvv.ac.in.
Tirupati, Date: 12.02.2020
REGISTRAR

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM
TIRUPATI
Admission into Ph.D Programme
Applications are invited from the qualified candidates of UGC-JRF, UGC-CSIR-JRF, GATE/GPAT, FDP, SLET/ APSET etc. for admission into Ph.D Programme at Sri Padmavati Mahila Visvavidyalayam. For details please visit the University website www.spmvv.ac.in.
Tirupati.
Date: 11.02.2020
REGISTRAR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, జలవనరుల శాఖ
పర్యవేక్షక ఇంజనీరు, నీటిపారుదల సర్కిల్, శ్రీకాకుళం కార్యాలయం
'ఇ' ప్రొక్యూర్మెంట్ టెండర్ కమ్ ఆక్షన్ (రివర్స్ టెండరింగ్)
నోటీసు నెం. 02/2019 -20, తేది: 07.02.2020

క్రమ సంఖ్య	పనిపేరు	పని విలువ మరియు పని పూర్తి చేయు కాలము
1	శ్రీకాకుళం జిల్లా పర్లాకిమిడి మండలం మంబిసీళ్ల పేట గ్రామం దరి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఇతర తీర ఆధారిత సౌకర్యాలతో నిర్మాణం	రూ. 865.24 లక్షలు (18 నెలలు)

బిడ్ డాక్యుమెంట్ లభించు తేది మరియు సమయం:	13.02.2020 @ 04.00 PM నుండి 27.02.2020 @ 04.00 PM వరకు
బిడ్ స్వీకరించు చివరి తేది మరియు సమయం	27.02.2020 @ 05.00 PM వరకు
BG/EMD & సెల్ఫ్ డిక్లరేషన్ హార్డ్ కాపీలు సమర్పించు చివరి తేది మరియు సమయం	28.02.2020 @ 05.00 PM
పి.క్యు స్టేజి	28.02.2020 @ 05.00 PM
కమర్షియల్ స్టేజి (రివర్స్ టెండర్ 'ఇ' - ఆక్షన్)	29.02.2020 @ 12.00 Noon
రివర్స్ ఆక్షన్ తేది మరియు సమయం	29.02.2020 @ 03.00 PM
T.Q స్టేజి	03.03.2020 @ 11.00 AM

తదుపరి వివరములకై ఇ-ప్రొక్యూర్మెంట్ వెబ్‌సైట్ : // tender.apeprocurement.gov.in ను చూడగలరు.
కాంటాక్ట్ నెం. +91 8919664858
సం/- బి.రాంబాబు,
పర్యవేక్షక ఇంజనీరు, జలవనరుల శాఖ,
నీటిపారుదల సర్కిల్, శ్రీకాకుళం

సాక్షి బిజినెస్
గురువారం
13-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
350	93
41,566	12,201

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

నాస్‌డాక్	9,714	75
డోజోన్స్	29,462	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,534	35
డాక్స్	13,745	122
షాంఘై	2,927	25
నికాయ్	23,861	175

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.47	72.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.84	94.07
€	యూరో	ఎస్‌బీఐ	76.39	79.25
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.71	66.10
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	46.97	49.11
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.57	52.33
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుక్	18.23	19.84
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుక్	18.96	19.96
¥	చైనా యువాన్	ఫామ్‌కుక్	9.61	11.02

'గెలాక్సీ ఎస్20' వచ్చింది..

శాన్ ఫ్రాన్సిస్కో: దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజ కంపెనీ శాంసంగ్.. 'గెలాక్సీ ఎస్20' స్మార్ట్‌ఫోన్‌ను బుధవారం ఆవిష్కరించింది. ఈ నూతన సిరీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరా టెక్నాలజీ ఉన్నట్లు ప్రకటించింది. ఇందులో 'గెలాక్సీ ఎస్20', 'గెలాక్సీ ఎస్20 ప్లస్', 'గెలాక్సీ ఎస్20 అల్ట్రా' పేర్లతో మూడు వేరియంట్లు ఉన్నాయి. తొలి రెండు వేరియంట్లలో 64 మెగా పిక్సెల్ కెమెరా ఉండగా, అల్ట్రాలో ఏకంగా 108 ఎంపీ కెమెరా ఉన్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, మొబైల్ కమ్యూనికేషన్స్ బిజినెస్ హెడ్ టీఎం రోహ్ వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 6 నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్న ఈ మోడల్ ధరల శ్రేణి 999 నుంచి 1,399 డాలర్లుగా ఉన్నట్లు ప్రకటించారు. ఇక ఇదే కార్యక్రమంలో గెలాక్సీ జెడ్ ఫ్లిప్ పేరిట ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను కంపెనీ విడుదలచేసింది. ఫిబ్రవరి 14 నుంచి అందుబాటులోకి రానున్న దీని ధర 1,380 డాలర్లు.

200 కోట్లకు వాట్సాప్ యూజర్ల సంఖ్య

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా మెసేజింగ్ యాప్ వాట్సాప్ యూజర్ల సంఖ్య 200 కోట్లకు చేరింది. ప్రపంచ జనాభాలో ఇది సుమారు 25 శాతం. వాట్సాప్ బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపింది. ప్రతీ వ్యక్తిగత మెసేజీకి పూర్తి స్థాయిలో గోప్యత ఉండేలా ఎప్పటికప్పుడు తమ ప్లాట్‌ఫాంను సురక్షితంగా తీర్చిదిద్దుతున్నట్లు సంస్థ వివరించింది. గతేడాది జూలై గణాంకాల ప్రకారం వాట్సాప్‌నకు భారత్‌లో 40 కోట్ల మందికి పైగా యూజర్లు ఉన్నారు.

రెడ్డీస్ చేతికి వొకార్డ్ జనరిక్స్

డీల్ విలువ రూ.1,850 కోట్లు • మొత్తం 62 బ్రాండ్ల కొనుగోలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్.. ఇదే రంగంలోని వొకార్డ్‌కు చెందిన కొన్ని విభాగాల బ్రాండెడ్ జనరిక్స్ దేశీ వ్యాపారాన్ని కొనుగోలు చేయనుంది. ఈ మేరకు వొకార్డ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ బుధవారం వెల్లడించింది. ఇందులో భాగంగా భారత్‌తో పాటు నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవుల బిజినెస్‌ను సైతం చేజిక్కించుకోనుంది. డీల్ విలువ రూ.1,850 కోట్లు. డీల్ ద్వారా వొకార్డ్‌కు చెందిన 62 బ్రాండ్లు డాక్టర్ రెడ్డీస్ పరంకానున్నాయి. శ్వాసకోస, కేంద్ర నాడీ మండల, చర్మ, జీర్ణకోశ, నొప్పుల విభాగాలకు చెందిన పలు బ్రాండ్లను రెడ్డీస్ సొంతం చేసుకోనుంది. వొకార్డ్‌కు చెందిన అమ్మకాలు, మార్కెటింగ్ టీమ్‌లతో పాటు.. హిమాచల్‌ప్రదేశ్‌లోని బద్దిలో గల తయారీ ప్లాంటు సైతం డాక్టర్ రెడ్డీస్‌కు దక్కుతుంది. స్లంప్‌సేల్ ప్రాతిపదికన ఈ డీల్ కుదుర్చుకున్నట్లు రెడ్డీస్ వెల్లడించింది. భారత మార్కెట్ తమకు ముఖ్యమని, వొకార్డ్ వ్యాపారాల కొనుగోలుతో ఇక్కడ మరింత విస్తరించేందుకు మార్గం సుగమం అయిందని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. తాజా కొనుగోలుతో అధిక వృద్ధికి ఆస్కారమున్న విభాగాలలో కంపెనీకి మరిన్ని అవకాశాలు లభిస్తాయని వివరించారు.

హిందాల్కో లాభం రూ.1,062 కోట్లు



న్యూఢిల్లీ: హిందాల్కో ఇండస్ట్రీస్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) డిసెంబర్ క్వార్టర్‌లో రూ.1,062 కోట్ల నికర లాభాన్ని (కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) క్యూ3లో ఆర్జించిన నికర లాభం, రూ.1,394 కోట్లతో పోల్చితే 24 శాతం క్షీణించిందని కంపెనీ ఎండీ సతీశ్ పాయి చెప్పారు. ఆదాయం రూ.33,483 కోట్ల నుంచి రూ.29,494 కోట్లకు తగ్గిందని పేర్కొన్నారు.

పటిష్టంగా నొవెలిస్ పనితీరు....
ఆర్థిక మందగమన పరిస్థితులున్నప్పటికీ, ఈ క్యూ3లో మంచి ఫలితాలే సాధించామని కంపెనీ తెలిపింది. అమెరికా అనుబంధ సంస్థ, నొవెలిస్ పటిష్టమైన పనితీరు, ఉత్పత్తి వ్యయాలు తక్కువగా ఉండటం, భారత వ్యాపారాల కార్యకలాపాలు నిలకడగా ఉండటం దీనికి కారణమని వెల్లడించింది. ఈ క్యూ3లోనే 160 కోట్ల డాలర్ల బాండ్లను నొవెలిస్ కంపెనీ జారీ చేసింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో హిందాల్కో షేర్ 0.1 శాతం లాభంతో రూ.194 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం 87 శాతం డౌన్

న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్‌నకు చెందిన ప్రధాన కంపెనీ అశోక్ లేలాండ్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) మూడో త్రైమాసిక కాలంలో 87 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) క్యూ3లో రూ.429 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.57 కోట్లకు పడిపోయినట్లు అశోక్ లేలాండ్ ఎమ్‌డీ, సీఈఓ విపిన్ సోంధి చెప్పారు. కార్యకలాపాల ఆదాయం కూడా రూ.7,490 కోట్ల నుంచి రూ.5,189 కోట్లకు తగ్గిందని తెలియజేశారు.

తగ్గిన వ్యయాలు..: ఈ క్యూ3లో మొత్తం వాహన పరిశ్రమ అమ్మకాలు 39 శాతం మేర తగ్గటంతో తమ కంపెనీ అమ్మకాలు కూడా అందుకు తగ్గట్టే ఉన్నట్లు విపిన్ వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 2020కు ముందే భారీ వాహనాల మోడళ్లలో బీఎస్-6 వేరియంట్లను మార్కెట్లోకి తెస్తామని చెప్పారు. వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా వాహనాలను కొనుగోలు చేసేందుకు వినూత్నమైన మాడ్యులర్ బిజినెస్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. వ్యయ నియంత్రణ పద్ధతులను కొనసాగిస్తున్నామని కంపెనీ సీఎఫ్ఓ గోపాల్ మహదేవన్ పేర్కొన్నారు. నికర లాభం 87 శాతం పతనం కావడంతో బీఎస్ఈలో అశోక్ లేలాండ్ షేర్ 1.8 శాతం నష్టంతో రూ.81.35 వద్ద ముగిసింది.

గల్ఫ్ ఆయిల్ నికర లాభం 12% వృద్ధి

హైదరాబాద్: డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో గల్ఫ్ ఆయిల్ నికర లాభం 12.21 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2019-20 క్యూ3లో రూ.55.87 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం 49.79 కోట్లుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నికర ఆదాయం మాత్రం 8.69% తగ్గింది. గత ఆర్థికం క్యూ3లో రూ.462.02 కోట్లుగా ఉన్న ఆదాయం ఈ క్యూ3 నాటికి రూ.421.86 కోట్లకు తగ్గింది. ఎబిటా రూ.77.52 కోట్లుగా ఉంది

తగ్గిన నాట్కో లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మా డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 34 శాతం తగ్గి రూ.104.4 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.580 కోట్ల నుంచి రూ.513 కోట్లకు వచ్చి చేరింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 3వ మధ్యంతర డివిడెండు రూ.3.50 చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది.

పరిశ్రమలు వెనక్కి.. ధరలు పైపైకి!

మళ్లీ 'మైనస్'లోకి పారిశ్రామిక ఉత్పత్తి • డిసెంబర్‌లో 0.3 శాతం క్షీణత
తయారీ, విద్యుత్ రంగాల పేలవ పనితీరు • ఆరేళ్ల గరిష్టస్థాయికి రిటైల్ ధరల సెగ...

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రతికూల పరిస్థితుల నుంచి బయట పడలేదనడానికి స్పష్టమైన గణాంకాలు బుధవారం వెలువడ్డాయి. పారిశ్రామిక ఉత్పత్తి డిసెంబర్‌లో మైనస్‌లోకి జారిపోతే... రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల గరిష్టానికి చేరింది.

పారిశ్రామిక ప్రగతి శూన్యం...
పారిశ్రామిక ఉత్పత్తి నవంబర్‌లో కొంచెం పుంజుకుందనుకుంటే, డిసెంబర్‌లో మళ్లీ నీరసించిపోయింది. ఉత్పత్తి సూచీ (ఐఐపీ) -0.3 శాతంగా నమోదయ్యింది. అంటే 2018 డిసెంబర్‌తో పోల్చిచూస్తే, 2019 డిసెంబర్‌లో అసలు వృద్ధిలేకపోగా -0.3 శాతం క్షీణతలోకి జారిందన్నమాట. తయారీ, విద్యుత్ రంగాలూ క్షీణబాటలోనే నిలిచాయి. ఐఐపీ గతేడాది వరుసగా మూడు నెలల పాటు క్షీణబాటలోనే ఉన్నప్పటికీ (ఆగస్టులో -1.4 శాతం, సెప్టెంబర్‌లో - 4.6 శాతం, అక్టోబర్‌లో -4 శాతం) నవంబర్‌లో కాస్త పుంజుకుని 1.8 శాతంగా నమోదైంది. కానీ ఆ తర్వాత నెల డిసెంబర్‌లో మళ్లీ క్షీణించడం గమనార్హం. 2018 డిసెంబర్‌లో ఐఐపీ వృద్ధి రేటు 2.5 శాతం.



కీలక రంగాలను చూస్తే...

- **తయారీ:** 2019 డిసెంబర్‌లో తయారీ రంగ ఉత్పాదకత క్షీణించి మైనస్ 1.2 శాతానికి పరిమితమైంది. 2018 డిసెంబర్‌లో ఇది 2.9 శాతం వృద్ధిలో ఉంది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ చూస్తే, 0.5 శాతం వృద్ధిలో ఉన్నా... ఇది 2018 ఇదే కాలంతో పోల్చిచూస్తే (4.7 శాతం) తక్కువకావడం గమనార్హం.
- **విద్యుత్:** ఈ రంగంలో ఉత్పత్తి 4.5% వృద్ధి నుంచి నుంచి -0.1%కి పడింది.
- **మైనింగ్:** 5.4 శాతం పెరిగింది. అంతక్రితం ఏడాది డిసెంబర్‌లో ఇది మైనస్ 1 శాతంగా నమోదైంది.అయితే ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ ఈ రేటు 3.1 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గింది.
- **క్యాపిటల్ గూడ్స్:** పెట్టుబడులకు, భారీ యంత్ర సామాగ్రి కొనుగోలుకు కొలమానంగా నిల్చే క్యాపిటల్ గూడ్స్ విభాగంలో రేటు ఏకంగా -18.2 శాతం క్షీణించింది. 2018 డిసెంబర్‌లో ఇది 4.2 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది.
- **కన్జూమర్ డ్యూరబుల్స్:** రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్ల వంటి ఉత్పత్తికి సంబంధించిన ఈ విభాగంలో ఉత్పత్తి మైనస్ 6.7 శాతం.

> గత నెల దాకా పారిశ్రామిక కార్యకలాపాలు పుంజుకుంటున్న దాఖలాలు కనిపించినప్పటికీ డిసెంబర్‌లో గణాంకాలు ఆందోళన రేకెత్తించేవిగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పవనాలతో అన్ని పరిశ్రమలకు సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో ఎకానమీకి ఇది అంత మంచిది కాదు.
> **ఆందోళనకరం...**
> – రుమ్‌కీ మజుందార్, డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త

తొమ్మిది నెలల్లో ఇలా...
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 0.5 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇది 4.7 శాతం.

నిత్యావసర ధరల మంట

ఇక వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం చూస్తే, 2020 జనవరిలో భారీగా 7.59 శాతం పెరిగింది. అంటే 2019 జనవరితో పోల్చితే నిత్యావసర వస్తువుల బాస్కెట్ రిటైల్ ధర భారీగా 7.59 శాతం పెరిగిందన్నమాట. గడచిన ఆరేళ్లలో (2014 మేలో 8.33 శాతం) ఈ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి.

కట్టుదాటి...!
రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం ఉండాలన్నది ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశం. అయితే, దీనికి 'ప్లస్ 2' లేదా 'మైనస్ 2' శాతాన్ని తగిన స్థాయిగా పరిగణనలోకి తీసుకుంటారు. కాగా ఉల్లి తదితర కూరగాయల రేట్లు ఆకాశాన్నంటడంతో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా ఎగిసింది. ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న స్థాయికి దూరంగా నవంబర్ (4.62 శాతం), డిసెంబర్ (7.35 శాతం), జనవరి (7.59 శాతం)ల్లో జరుగుతూ వచ్చింది. 2014 జూలైలో తొలిసారిగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు.. రిటైల్ ద్రవ్యోల్బణం 7.39 శాతం. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయిని డిసెంబర్‌లో తాకింది. ఆర్‌బీఐ పాలసీ విధానానికి రిటైల్ ద్రవ్యోల్బణమే ప్రాతిపదిక. 2019 ఫిబ్రవరి 7వ తేదీతో మొదలుకొని ఈ నెల మొదటి వారంలో జరిగిన ఏడు ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షా సమావేశాల సందర్భంగా చివరిసారి రెండుసార్లు మినహా అంతకుముందు వరుసగా ఐదుసార్లు బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు-రెపోను 135 బేసిస్ పాయింట్లమేర ఆర్‌బీఐ తగ్గించింది. దీనితో ఈ రేటు 5.15 శాతానికి దిగివచ్చింది. ధరల పెరుగుదల రేటు అదుపులో ఉండడంతో వృద్ధే లక్ష్యంగా రేటు కోత నిర్ణయాలు తీసుకోగలిగిన ఆర్‌బీఐ, ద్రవ్యోల్బణం భయాలతోనే చివరి రెండు సమావేశాల్లో ఈ దిశలో నిర్ణయాలు తీసుకోలేకపోయింది.

తెలంగాణలో హట్సన్ ఐస్‌క్రీమ్ ప్లాంట్

- 207 కోట్ల పెట్టుబడి; 250 ఉద్యోగాలు
- అక్టోబర్ నుంచి కార్యకలాపాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చెన్నైకి చెందిన పాలు, పాల ఉత్పత్తుల కంపెనీ హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్... తెలంగాణలో అతిపెద్ద ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. రూ.207 కోట్ల పెట్టుబడులతో సంగారెడ్డి జిల్లాలోని గోవిందూర్‌లో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా 250 మందికి ఉద్యోగాలతో పాటు, పరోక్షంగా మరో 250 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, స్థానికంగా ఉన్న సుమారు 4 వేల మంది పాడి రైతులు ప్రయోజనం పొందుతారని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ప్లాంట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది అక్టోబర్ నాటికి ప్లాంట్ కార్యకలాపాలు ఆరంభమవుతాయని పేర్కొంది. హట్సన్ సంస్థ అరుణ్ ఐస్ క్రీమ్, హట్సన్, ఆరోక్య మిల్క్, ఐబాకో ఐస్‌క్రీమ్స్, ఓయాలో, అనీవా, సంటోసా బ్రాండ్లతో పాలు, పెరుగు, ఐస్‌క్రీమ్స్, నెయ్యి, పన్నీర్ వంటి అన్ని రకాల పాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ కార్యకలాపాల్లో ఉంది. మన దేశంలో విక్రయించడంతో పాటు అమెరికా, మధ్యప్రాచ్యం వంటి 38 దేశాలకు ఎగుమతులూ చేస్తోంది.

పవర్‌గ్రిడ్ ఈడీగా అనూప్ కుమార్

హైదరాబాద్: ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ దక్షిణ భారత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా అనూప్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1 (ఎస్ఆర్‌టీఎస్-1)కు ఈయన్ను నియమించగా... ఈ రీజియన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలోని కొంత భాగం ఉన్నట్లు కంపెనీ తెలిపింది.

సెలెక్ట్ మొబైల్స్ 'గ్రాండ్ వాలంటైన్స్ డే ఆఫర్స్'

హైదరాబాద్: ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మొబైల్ రిటైల్ కంపెనీ సెలెక్ట్ మొబైల్స్ గ్రాండ్ వాలంటైన్స్ డే ఆఫర్లను ప్రకటించింది. ఈ నెల 13, 14 తేదీల్లో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని కంపెనీ సీఎండీ వై గురు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలోని అన్ని సెలెక్ట్ మొబైల్ షోరూమ్‌లలో ఈ ఆఫర్లు లభ్యమవుతాయని పేర్కొన్నారు. రూ.25,500 విలువ చేసే శాంసంగ్ ఏ6 కేవలం రూ.8,999లకు, రూ.8,999 విలువ చేసే 4జీ మొబైల్ రూ.3,999లకు, రూ.6,999 విలువ చేసే స్మార్ట్‌ఫోన్ రూ.3,999లకు వంటి రకరకాల ఆఫర్లున్నాయని తెలిపారు

ఐఆర్‌సీటీసీ లాభం 3 రెట్లు అప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఐఆర్‌సీటీసీ నికర లాభం 3 రెట్లు పెరిగింది. గతేడాది (2018-19) క్యూ3లో రూ.74 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3(2019-20)లో 180 శాతం ఎగసి రూ.206 కోట్లకు ఎగసింది. ఆదాయం 65 శాతం పెరిగి రూ.716 కోట్లకు, నిర్వహణ లాభం 169 శాతం వృద్ధితో రూ.266 కోట్లకు పెరిగాయి. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.10 డివిడెండ్ (వంద శాతం)ను ప్రకటించింది.

ఎకానమీకి వైరస్!!

- ప్రపంచ వృద్ధి రేటు అంచనాలు కట్
- 2.2 శాతానికి కుదించిన ఈఐయూ
- కోవిడ్-19 వైరస్ భయాలే కారణం

న్యూఢిల్లీ: చైనాలో బైటపడిన కోవిడ్-19(కరోనా) వైరస్ ధాటికి ఈ ఏడాది ప్రపంచ ఎకానమీ వృద్ధి కుంటుపడనుంది. 2020లో ప్రపంచ వృద్ధి రేటు అంచనాలను 2.3 శాతం నుంచి 2.2 శాతానికి కుదిస్తున్నట్లు ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) ఒక నివేదికలో వెల్లడించింది. 'ప్రపంచ ఎకానమీకి కరోనా వైరస్ ముప్పుగా పరిణమించింది. ఇది మరింతగా ప్రబలకుండా నివారించేందుకు చైనా ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ రిస్కులు పొంచి ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వృద్ధి అంచనాలను తగ్గించాల్సిన పరిస్థితి నెలకొంది' అని ఈఐయూ పేర్కొంది. వాణిజ్య యుద్ధ భయాల మూలంగా 2019లో ప్రపంచ వృద్ధి మందగించిన సంగతి తెలిసిందే. యూరోపియన్ యూనియన్‌లోని పలు దేశాల్లో రాజకీయ అనిశ్చితి, అమెరికా.. చైనాలతో పాటు భారత్‌లోనూ స్థూల దేశీయోత్పత్తి మందగించింది. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధ భయాలు తగ్గి, కొత్త ఏడాదిలో పరిస్థితులు చక్కబడవచ్చని సర్వత్రా ఆశాభావం వ్యక్తమవుతున్న తరుణంలో హఠాత్తుగా కరోనా వైరస్ తెరపైకి రావడం గమనార్హం. చైనా హుబెయ్ ప్రావిన్స్‌లోని వుహాన్ నగరంలో బైటపడిన ఈ వైరస్ ఆ దేశంతో పాటు ఇతరత్రా పలు దేశాలకు కూడా విస్తరించడం ప్రస్తుతం అందర్నీ కలవరపెడుతోంది. వైరస్ ప్రతికూల ప్రభావాల కారణంగా చైనా వృద్ధి రేటు అంచనాలను కూడా ఈఐయూ తగ్గించింది. 'మార్చి ఆఖరు నాటికల్లా వైరస్ వ్యాప్తి.. అదుపులోకి రాగలదని భావిస్తున్నాం. దీనికి అనుగుణంగా 2020లో చైనా వాస్తవ జీడీపీ వృద్ధి అంచనాలను ముందుగా పేర్కొన్న 5.9 శాతం నుంచి 5.4 శాతానికి తగ్గిస్తున్నాం' అని ఈఐయూ తెలిపింది.

భారత్‌పై బుల్లిష్..: ప్రపంచ ఎకానమీ, చైనా విషయంలో నిరుత్సాహపర్చే అంచనాలు ప్రకటించిన ఈఐయూ.. భారత్‌పై మాత్రం బులిష్ ధోరణి కనపర్చింది. కరోనా వైరస్ తాకిడి భారత్‌లో గణనీయంగా విస్తరించని పక్షంలో దేశ ఆర్థిక వృద్ధి రేటు చాలా మెరుగ్గా ఉండగలదని పేర్కొంది.

192 బిలియన్ డాలర్లకు ఐటీ ఆదాయాలు

- 2019-20పై నాస్కామ్ అంచనా
- డిజిటల్ ఆదాయాల ఊతం

ముంబై: దేశీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (ఐటీ-బీపీఎం రంగం ఆదాయాలు 2020 ఆర్థిక సంవత్సరంలో 8.4 శాతం మేర వృద్ధి నమోదు చేయొచ్చని ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ తెలిపింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన 192 బిలియన్ డాలర్లకు చేరవచ్చని పేర్కొంది. 2019-20లో కొత్త తరం డిజిటల్ విభాగాల ఆదాయాలు 23 శాతం పెరగడం, నికరంగా 2.05 లక్షల ఉద్యోగాల కల్పన జరగడం తదితర అంశాలు ఇందుకు దోహదపడగలవని నాస్కామ్ వివరించింది. భవిష్యత్ అంచనాలకు సంబంధించి పరిశ్రమ ఆశావహంగానే ఉన్నప్పటికీ కాస్త ఆచితూచి వ్యవహరించే ధోరణే కొనసాగించనున్నట్లు నాస్కామ్ చైర్మన్ కేశవ్ మురుగేశ్ విలేకరులకు తెలిపారు. 43.6 లక్షల మంది సిబ్బందికి కొత్త నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. కరోనా వైరస్ ప్రతికూల ప్రభావాలు కచ్చితంగా ఎంత స్థాయిలో ఉంటాయన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదని ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సీవోవో ప్రవీణ్ రావు చెప్పారు. అయితే, సరఫరా వ్యవస్థలో చైనా కీలక దేశం కావడంతో క్లయింట్లపైనా, ఫలితంగా పరిశ్రమపైనా పరోక్ష ప్రభావాలు ఉండొచ్చన్నారు.

మెషీన్ లెర్నింగ్‌తో ప్రయోజనమే: చంద్రశేఖరన్
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలు.. భారత్ వంటి వర్ధమాన దేశాలకు ప్రయోజనకరమేనని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు.

పన్నుల పరిష్కార పథకం పరిధి పెంపు...

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వివాదాల పరిష్కారానికి ఉద్దేశించిన 'వివాద్ సే విశ్వాస్' పథకం పరిధిని విస్తరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. రుణ రికవరీ ట్రిబ్యునల్స్‌లో (డీఆర్‌టీ) ఉన్న పెండింగ్ కేసులను కూడా ఇందులోకి చేర్చే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. 2019 నవంబర్ దాకా గణాంకాల ప్రకారం.. వివాదాల్లో చిక్కుబడిన ప్రత్యక్ష పన్ను బకాయిలు సుమారు రూ. 9.32 లక్షల కోట్లుగా ఉన్నాయి. సంబంధిత వర్గాల సిఫార్సులకు అనుగుణంగా వివాద్ సే విశ్వాస్ బిల్లుకు కొత్త సవరణలను ప్రస్తుత పార్లమెంటు సెషన్‌లో ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. ఈ బిల్లు ప్రకారం పథకాన్ని ఎంచుకున్న వారు.. మార్చి 31లోగా వివాదాస్పద పన్ను మొత్తం కడితే వడ్డీ నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. మరోవైపు, 12 ప్రధాన పోర్టులకు స్వయంప్రతిపత్తినిచ్చే దిశగా 1963 నాటి చట్టం స్థానంలో కొత్త మేజర్ పోర్ట్ అథారిటీ బిల్లు 2020కి కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధాన పోర్టుల సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని పెంచేందుకు ఇది తోడ్పడనుంది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో దీన్ని ప్రవేశపెట్టనున్నారు.

ఈ నెలాఖరు వరకు ఉచిత ఫాస్టాగ్

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ టోల్ సేకరణను మ

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	41,580	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	39,600	▼ 50
వెండి (కిలో)	49,400	▼ 600
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	40,550	▼ 110
బంగారం (22 క్యారెట్లు)	38,620	▼ 100
వెండి (కిలో)	49,400	▼ 600
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	41,480	▼ 120
బంగారం (22 క్యారెట్లు)	38,580	▼ 110
వెండి (కిలో)	47,500	0
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	40,820	▼ 180
బంగారం (22 క్యారెట్లు)	37,880	0
వెండి (కిలో)	47,000	▼ 500
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	41,790	▼ 80
బంగారం (22 క్యారెట్లు)	38,620	▼ 100
వెండి (కిలో)	47,000	▼ 500

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన పాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	51.23 (రాత్రి 11.30కు)	$	49.94 (మంగళవారం మూసివేసిన)
బ్రెంట్	55.86 (రాత్రి 11.30కు)	$	54.01 (మంగళవారం మూసివేసిన)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 13-2-2020

విశాఖ	410-00
చిత్తూరు	428-00
వరంగల్	383-00
విజయవాడ	400-00
గోదావరి	400-00
12-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	380-00

12,200 పాయింట్లపైకి నిఫ్టీ

- రెండో రోజూ తగ్గిన కరోనా కొత్త కేసులు
- ప్రపంచ మార్కెట్ల రికవరీ
- 41,500 పాయింట్లపైకి సెన్సెక్స్
- 350 పాయింట్ల లాభంతో 41,566కు...
- 12,200 పాయింట్లపైకి నిఫ్టీ
- 93 పాయింట్లు పెరిగి 12,201 వద్ద ముగింపు

కోవిడ్-19 (కరోనా) వైరస్ భయాలు తగ్గడంతో ప్రపంచ మార్కెట్లతో పాటే మన మార్కెట్ కూడా బుధవారం లాభపడింది. ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంక్, ఐటీ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడం సానుకూల ప్రభావం చూపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ కీలకమైన 41,500 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 12,200 పాయింట్లపైకి ఎగబాకాయి. సెన్సెక్స్ 350 పాయింట్ల లాభంతో 41,566 పాయింట్ల వద్ద, నిఫ్టీ 93 పాయింట్లు పెరిగి 12,201 పాయింట్ల వద్ద ముగిశాయి. ఈ సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు తగ్గినా, ముడి చమురు ధరలు 2% మేర ఎగసినా, మన మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 456 పాయింట్లు, నిఫ్టీ 124 పాయింట్ల మేర లాభపడ్డాయి. చైనాలో కోవిడ్-19 (కరోనా) వైరస్‌కు సంబంధించి కొత్త కేసులు వరుసగా రెండో రోజూ తగ్గాయి. దీంతో ఈ వైరస్ విస్తృతి తగ్గుముఖం పడుతుందన్న ఊరటతో ప్రపంచ మార్కెట్లు రికవరీ అయ్యాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

ఆల్‌టైమ్ హైకి హెచ్‌యూఎల్...

హిందుస్తాన్ యూని లీవర్ షేర్ 5% లాభంతో రూ.2,260 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఇంట్రాడేలో ఈ షేర్ ఆల్‌టైమ్ హై, రూ.2,271ను తాకింది. ఈ నెలలో ఇప్పటివరకూ ఈ షేర్ 14% లాభపడటం విశేషం. ఈ షేర్‌తో పాటు పలు షేర్లు ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. పీవీఆర్, అపోలో హాస్పిటల్స్, ఏషియన్ పెయింట్స్, డాబర్ ఇండియా, దివీస్ ల్యాబ్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇప్కా ల్యాబ్స్, ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, ఫైజర్, రిలాక్సో ఫుట్‌వేర్, ట్రెంట్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇక వందకు పైగా షేర్లు ఏడాది గరిష్ట స్థాయిలకు పెరిగాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,678
ఎన్ఎస్ఈ	35,861
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	13,02,740
ఎఫ్ఐఐ	49
డీఐఐ	339

- క్యూ3 ఆర్థిక ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండటంతో పలు ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు పతనమయ్యాయి. పీఎన్‌బీ, అలహాబాద్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఓబీసీ షేర్లు ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు 2-3% రేంజ్‌లో నష్టపోయాయి.
- ప్రైవేట్ రంగ లక్ష్మీ విలాస్ బ్యాంక్ షేర్ వరుసగా నాలుగో రోజూ 5% అప్పర్ సర్క్యూట్‌తో రూ.21 వద్ద ముగిసింది. గత వారం రోజుల్లో ఈ షేర్ 41% ఎగసింది. ఈ బ్యాంక్‌లో మెజారిటీ వాటాను అమెరికాకు చెందిన ఫండ్ కొనుగోలు చేయనున్నదన్న వార్తలతో ఈ షేర్ జోరుగా పెరుగుతోంది.

మార్కెట్లోకి బీఎస్-6 'పల్సర్ 150'

ప్రారంభ ధర రూ. 94,956

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ బజాజ్ ఆటో.. భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న 'పల్సర్ 150' బైక్‌ను బుధవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ. 94,956 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ)గా ప్రకటించింది. హై ఎండ్ మోడల్‌లో 150 ట్విన్ డిస్క్ ధర రూ.98,835. కంపెనీకి చెందిన ఈ పాపులర్ బైక్ నూతన వెర్షన్ ధర, మునుపటి మోడళ్ల కంటే రూ. 8,998 అదనంగా ఉందని పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ మోటార్ సైకిల్స్ విభాగం ప్రెసిడెంట్ సారంగ్ కనడే మాట్లాడుతూ.. 'ఫుయల్ ఇంజెక్షన్ (ఎఫ్ఐ) వ్యవస్థను నూతన ప్రమాణాలకు తగిన విధంగా రూపొందించాం. ఇదే విధంగా ఇక నుంచి విడుదలయ్యే వాహనాలు కూడా బీఎస్-6 ప్రమాణాలతోనే రానున్నాయి' అని అన్నారు.

50 ఏళ్ల ప్రణాళిక అవసరం: గ్రండ్‌ఫోస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నీటి నిర్వహణ విషయంలో భారత్‌కు 50 ఏళ్ల ప్రణాళిక అవసరమని వాటర్ సొల్యూషన్స్, టెక్నాలజీ కంపెనీ గ్రండ్‌ఫోస్ పేర్కొంది. నీటిని జాతీయ అంశంగా తీసుకోవాలని కంపెనీ ఇండో రీజియన్ ఎండీ ఎన్.కె.రంగనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. పంప్‌లు, ఇతర నీటి సొల్యూషన్స్ అందించే ఈ డెన్మార్క్ కంపెనీ తరపున బుధవారమిక్కడ విలేకరులతో ఆయన మాట్లాడారు. నీటి కొరత సమస్య దూసుకొస్తోందని, ప్రభుత్వం తగు కార్యాచరణ చేపట్టాలని చెప్పారాయన. నీటి పొదుపు, పునర్వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనికోసం కఠిన విధానాలను అమలు చేయాలని అభిప్రాయపడ్డారు.

జనవరిలో జోరుగా ఫండ్స్‌లోకి పెట్టుబడులు

- రూ.1.2 లక్షల కోట్ల ప్రవాహం..
- లిక్విడ్ ఫండ్స్‌లోకి అత్యధికం
- యాంఫీ వెల్లడి

న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లు వివిధ మ్యూచువల్ ఫండ్స్ స్కీముల్లో గత నెలలో రూ.1.2 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అంతకు ముందటి నెల (గత ఏడాది డిసెంబర్)లో రూ.62,000 కోట్ల మేర పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. లిక్విడ్, ఓవర్‌నైట్ స్కీమ్‌ల కారణంగా ఈ జనవరిలో జోరుగా ఫండ్స్‌లోకి పెట్టుబడులు వచ్చాయని నిపుణులంటున్నారు. రానున్న రోజుల్లో ఈ జోరు ఇంకా పెరగగలదని యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సీఈఓ జి. ప్రదీప్ కుమార్ అంచనా వేస్తున్నారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఆంఫి) వెల్లడించిన వివరాల ప్రకారం..,

- ఈ ఏడాది జనవరిలో డెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్‌ల్లో రూ.1.09 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి.
- ఇక డెట్ స్కీమ్‌ల్లో లిక్విడ్ ఫండ్స్‌లోకి రూ.59,683 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. అత్యధిక ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చిన ఫిక్స్‌డ్-ఇన్‌కమ్ సెగ్మెంట్ ఇదే. ట్రెజరీ బిల్లులు, సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్లు, స్వల్ప కాలిక కమర్షియల్ పేపర్ తదితర సాధనాల్లో ఈ లిక్విడ్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తాయి.
- ఒక్క రోజు మెచ్యూరిటీ ఉన్న సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే ఓవర్‌నైట్ ఫండ్స్‌లో రూ.22,652 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో లిక్విడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు తగ్గుతుండగా, ఓవర్‌నైట్ ఫండ్స్‌లో మాత్రం పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఈ పోకడ కొనసాగనున్నది. లిక్విడ్ ఫండ్స్‌లో ఎగ్జిట్ లోడ్ ప్రవేశపెట్టడం, ఇంకా కొన్ని అదనపు ఆంక్షలు దీనికి కారణం.
- ఈక్విటీ, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్‌ల్లో పెట్టుబడులు రూ.7,877 కోట్ల పెట్టుబడులు రాగా, క్లోజ్ ఎండెడ్ ఈక్విటీ ప్లాన్‌ల్లో రూ.330 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది.
- నికరంగా ఈక్విటీ ఫండ్స్ పెట్టుబడులు రూ.7,547 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో ఈక్విటీ ఫండ్స్‌లో నికర పెట్టబడులు రూ.4,432 కోట్లు మాత్రమే.
- ఇక స్మాల్ క్యాప్ ఫండ్స్‌ల్లో రూ.1,073 కోట్లు, మిడ్-క్యాప్ ఫండ్స్‌ల్లో 1,798 కోట్లు, లార్జ్-క్యాప్ ఫండ్స్‌ల్లో రూ.1,154 కోట్ల మేర ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి.

భారత్ ఎగుమతుల పెరుగుదలకు 'కోవిడ్-19' అవకాశం!

కోల్‌కతా: చైనా కోవిడ్-19 (కరోనా) వైరస్ ప్రతికూల పరిస్థితులు.. భారత్ ఎగుమతుల పెరుగుదలకు ఒక అవకాశమని ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యం బుధవారం పేర్కొన్నారు. అయితే ఎగుమతులకు సంబంధించి చైనా అనుసరించిన విధానాన్నే భారత్ అనుసరిస్తే, మంచి ఫలితాలు ఉంటాయన్నారు. పలు విడి భాగాలను దిగుమతి చేసుకుని, అసెంబ్లింగ్ తర్వాత ఎగుమతులు చేస్తున్న చైనా విధానాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారత్ ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని పేర్కొన్న ఆయన, రానున్న త్రైమాసికాల్లో వృద్ధి మందగమనంలో నుంచి బయటపడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

నేటి బోర్డ్ మీటింగ్స్...

పీఎఫ్‌సీ, హిందాల్కో, ఐఆర్‌సీటీసీ, దివీస్ ల్యాబ్స్, డిష్ టీవీ, ఎన్‌బీసీసీ, ఇన్ఫోఎడ్జ్ ఇండియా, ఓమాక్స్, ఆర్తి ఇండస్ట్రీస్, ఏబీబీ ఇండియా, జైప్రకాశ్ పవర్ వెంచర్స్

సెబీకి ఎన్‌సీడీఈఎక్స్ ఐపీఓ పత్రాలు

న్యూఢిల్లీ: నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (ఎన్‌సీడీఈఎక్స్) ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) పత్రాలను సెబీకి సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.100 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. అంతే కాకుండా 1.44 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో విక్రయిస్తారు. మొత్తం మీద ఈ కంపెనీ ఐపీఓ పరిమాణం రూ.500 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈ నిధులను సాధారణ వ్యాపార కార్యకలాపాలకు, సెటిల్‌మెంట్ గ్యారంటీ ఫండ్ అవసరాలకు, ఇతర అంశాలకు వినియోగించుకోవాలని ఎన్‌సీడీఈఎక్స్ యోచిస్తోంది. బీఎస్ఈ, ఎమ్‌సీఎక్స్‌ల తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ కాబోతున్న మూడో ఎక్స్ఛేంజ్ ఇది.

వచ్చే నెలలో యస్ బ్యాంకు ఫలితాలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటించడానికి మరికాస్త సమయం పడుతుందని ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ వెల్లడించింది. మార్చి 14లోపు వెల్లడించగలమని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. నిధుల సమీకరణ ప్రయత్నాల్లో భాగంగా పలువురు ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతుండటమే ఇందుకు కారణమని వివరించింది. జేసీ ఫ్లవర్స్ అండ్ కో, టిల్డెన్ పార్క్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, ఓహెచ్ఏ (యూకే), సిల్వర్ పాయింట్ క్యాపిటల్ వంటి సంస్థల నుంచి పెట్టుబడులకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు వచ్చాయని యస్ బ్యాంక్ పేర్కొంది. ఇటీవలే 2 బిలియన్ డాలర్ల సమీకరణ ప్రతిపాదనకు షేర్‌హోల్డర్లు ఆమోదముద్ర వేశారు. బుధవారం బీఎస్ఈలో యస్ బ్యాంకు షేరు 4 శాతం క్షీణించి రూ. 35.20 వద్ద క్లోజయ్యింది.

డిష్ టీవీ నష్టాలు రూ.67 కోట్లు

రూ.871 కోట్లకు తగ్గిన మొత్తం ఆదాయం

న్యూఢిల్లీ: డిష్ టీవీ ఇండియా కంపెనీకి ఈ ఆర్థిక సంవత్సరం(2019-20) డిసెంబర్ క్వార్టర్లో రూ.67 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. డీటీహెచ్(డైరెక్ట్ టు హోమ్) సేవలందించే ఈ కంపెనీ గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.153 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.1,530 కోట్ల నుంచి రూ.871 కోట్లకు తగ్గింది. కొత్త టారిఫ్‌లు అమల్లోకి వచ్చినందున గత క్యూ3 ఫలితాలతో ఈ క్యూ3 ఫలితాలను పోల్చడానికి లేదని కంపెనీ వెల్లడించింది. ఈ క్యూ3లో చందా ఆదాయం రూ.798 కోట్లు వచ్చాయని, మొత్తం వ్యయాలు రూ.846 కోట్లుగా ఉన్నాయని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో డిష్ టీవీ ఇండియా షేర్ 0.5 శాతం నష్టంతో రూ.12 వద్ద ముగిసింది.

రాష్ట్రీయం

సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా తిరుగువారం పండుగ

మేడారంలో మహాజాతర పరిసమాప్తం

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా మేడారంలో శ్రీ సమ్మక్క - సారలమ్మ మహాజాతరలో చివరి ఘట్టమైన తిరుగువారం పండుగను బుధవారం పూజారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సమ్మక్క తల్లికి యాటను నైవేద్యంగా సమర్పించారు. భక్తులను, గ్రామస్తులు సల్లంగ చూడాలని తల్లికి మొక్కుకున్నారు. ఇక కన్నెపల్లి సారలమ్మ గుడిలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో తిరుగువారం పండుగ నిర్వహించారు. దీంతో మహాజాతర ముగిసింది.

వేడుకలో వధూవరులు

బెజ్జూర్‌లో సామూహిక వివాహాలు

119 జంటలకు వివాహాలు జరిపించిన ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు బుధవారం 119 గిరిజన జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. బెజ్జూర్ మండలం సోమిని ప్రాణహిత నదీ తీరాన నిర్వహించిన సామూహిక వివాహాల కార్యక్రమం వేడుకను తలపించింది. కోనప్ప దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించి నూతన వధూవరులకు పట్టువస్త్రాలు, బంగారు తాళిబొట్టు, మెట్టెలను అందజేశారు. అలంకరణ సామగ్రిని సైతం ప్రదానం చేశారు. 41 జంటలకు కల్యాణ లక్ష్మి పథకం చెక్కులు అందించారు.

టీచరైన కలెక్టర్

తొర్రూరు రూరల్: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు మోడల్ పాఠశాలలో కలెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం టీచర్ అవతారమెత్తారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్, గణితం పాఠాలు బోధించారు. బోధనతో పాటు ఇతర సామాజిక అంశాలపైన విద్యార్థులకు అవగాహన కలిగి ఉండేలా బోధన చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు

ప్రభుత్వ యోచన: హరీశ్‌రావు

- అమెరికా తరహాలో ప్రజలకు హెల్త్ కార్డులు
- సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో కార్డియాలజీ, యూరాలజీ విభాగాలు ప్రారంభం

సంగారెడ్డి ఆస్పత్రిలోని కార్డియాలజీ, యూరాలజీ విభాగాలను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సంగారెడ్డి: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.3.5 కోట్లతో ఏర్పాటు చేసిన కార్డియాలజీ, యూరాలజీ విభాగాలను బుధవారం ఆయన ప్రారంభించారు. సంబంధిత విభాగాలను పరిశీలించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు అందించాలని సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని చెప్పారు. త్వరలో ఈ కార్యక్రమం కార్యరూపం దాల్చనుందని తెలిపారు. ప్రపంచంలోని ఒక్క అమెరికాలో ఈ తరహా హెల్త్ కార్డుల విధానం అమలులో ఉందని, తెలంగాణలో కూడా ప్రవేశపెట్టాలని సీఎం భావిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలోనే కార్డియాలజీ, యూరాలజీ విభాగాల ఏర్పాటుతో జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్‌ల ప్రజలను హైదరాబాద్‌కు తరలించకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా, తాలూకా ఆస్పత్రుల్లో ఐసీయూ, అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా తాలూకా స్థాయి ఆస్పత్రుల్లో కిడ్నీ రోగుల కోసం ఉచిత డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులను అందిస్తున్నామని తెలిపారు.

మరణాలు తగ్గాయి.. ప్రసవాలు పెరిగాయి..

కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి మాతా శిశు మరణాలు తగ్గాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగాయని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గతంలో సాధారణ ప్రసవాలు 30 నుంచి 35 శాతం మాత్రమే జరిగేవని, ప్రస్తుతం అవి 65 నుంచి 70 శాతానికి పెరిగాయన్నారు. నవజాత శిశువుల సంరక్షణ కోసం జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక యూనిట్లు నెలకొల్పామని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గతేడాది 8 వేలకు పైగా ప్రసవాలు జరిగితే, అందులో 63 శాతం సాధారణ ప్రసవాలని పేర్కొన్నారు. దీంతో వైద్యుల పనితీరును ఆయన అభినందించారు.

రూ.30 లక్షలతో ఉడాయింపు

- ఖమ్మం హెచ్‌డీఎఫ్‌సీలో ఏజెన్సీ ఉద్యోగి నిర్వాకం
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు

ఖమ్మం క్రైం: బ్యాంకుకు సంబంధించి లావాదేవీలు జరిపే ఓ ఏజెన్సీ ఉద్యోగి రూ. 30 లక్షలతో ఉడాయించాడు. ఈ ఘటన ఖమ్మంలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. బ్యాంకుకు సంబంధించి ఏటీఎంలలో నగదు జమ చేయడంతో పాటు ఒక బ్రాంచి నుంచి మరో బ్రాంచికి నగదును తీసుకెళ్లడానికి ఓ ప్రైవేటు ఏజెన్సీతో హెచ్‌ఎఫ్‌డీసీ బ్యాంకు ఒప్పందం కుదుర్చుకుంది. నగరంలోని టూటౌన్‌కు చెందిన గరిడేపల్లి వెంకన్న ఈ ఏజెన్సీలో పదేళ్లుగా పని చేస్తున్నాడు. మంగళవారం వైరా రోడ్డులోని మెయిన్ బ్రాంచి వారు గాంధీచౌక్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఫోన్ చేసి.. రూ.30 లక్షలు తీసుకురమ్మని వెంకన్నను పంపించారు. దీంతో వెంకన్న అక్కడ రూ.30 లక్షలను తీసుకుని మెయిన్ బ్రాంచికి వెళ్లకుండా ఉడాయించాడు. ఎంత సేపటికీ వెంకన్న రాకపోవడంతో మెయిన్ బ్రాంచి వారు గాంధీచౌక్ బ్యాంక్‌కు ఫోన్ చేయగా.. వెంకన్న డబ్బులు తీసుకుని వెళ్లి చాలా సమయం అయిందని చెప్పారు. వెంటనే వెంకన్న సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ అయి ఉంది. బ్యాంక్ అధికారులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంకన్న గాలింపు కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపాయి. డబ్బులు తీసుకెళ్లిన వెంకన్నకు, బ్యాంకు సిబ్బందికి, ఏజెన్సీలో వెంకన్నతోపాటు పనిచేస్తున్న సిబ్బందికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. వెంకన్న గతంలో ఫైనాన్స్ వ్యాపారం చేసి నష్టపోయినట్లు.. ఈ మేరకు డబ్బులను తీసుకుని ఉడాయించినట్లు అనుమానిస్తున్నారు.

మేడారం హుండీల లెక్కింపు

మొదటి రోజు ఆదాయం రూ.1,01,50,000

- తొలిరోజు 64 హుండీల్లో నగదును లెక్కించిన సిబ్బంది

హన్మకొండ కల్చరల్: ములుగు జిల్లా మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు సంబంధించి హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ లష్కర్ బజార్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో లెక్కింపు చేపట్టారు. ఇప్పటి వరకు మేడారం నుంచి తరలించిన 494 హుండీలను కల్యాణ మండపంలో భద్రపరిచిన విషయం తెలిసిందే. సమ్మక్క గద్దె నుంచి తరలించిన 64 హుండీల్లోని కానుకలను తొలిరోజు లెక్కించగా రూ.1,01,50,000 ఆదాయం నమోదైందని మేడారం ఈఓ రాజేందర్ తెలిపారు. హుండీలలో భక్తులు కరెన్సీతో పాటు బెల్లం, బియ్యం, కుంకుమ, పసుపు, ఆభరణాలు వేయగా వాటిని వేరు చేశారు. వర్షం కారణంగా చాలా వరకు కాగితం కరెన్సీ దెబ్బతిన్నది. పోలీసు బందోబస్తుతో పాటు ప్రత్యేకంగా లైటింగ్ సిస్టమ్, సీసీ కెమెరాల నిఘా మధ్య చేపట్టిన ఈ హుండీల లెక్కింపు పదిరోజుల పాటు జరిగే అవకాశంఉంది.

మేడారం హుండీల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

సీనియర్‌గా నాకే అవకాశం: కోమటిరెడ్డి

సాక్షి, యాదాద్రి: పీసీసీ అధ్యక్ష పదవిపై వారం రోజుల్లో నిర్ణయం వెలువడుతుందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. బుధవారం భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీనియర్‌గా ఆ పదవీ తనకే వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్‌గా తాను పీసీసీ పదవిని కోరానని, వారం రోజుల్లో జరిగే మార్పులు, చేర్పుల్లో తనకు అవకాశం వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 490 కిలోమీటర్ల రహదారులు వస్తున్నాయని తెలిపారు. ఆలేరు, జీడికల్ రోడ్డులో హైవేపై ఆర్వోబీ నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఓఆర్ఆర్ నుంచి గౌరెల్లి, పోచంపల్లి, వలిగొండ మీదుగా కొత్తగూడెం జాతీయ రహదారి, డీపీఆర్ సిద్ధమవుతుందన్నారు. త్వరలో ఎయిమ్స్ ఓపీ సేవలు ప్రారంభమవుతున్నాయని చెప్పారు.

లైంగికదాడి నిందితుడి అరెస్టు

- కారులో పరారైన మరో ఇద్దరు నిందితులు
- అదుపు తప్పి బోల్తా పడటంతో ఒకరు మృతి

జహీరాబాద్: జహీరాబాద్‌లో మహిళపై లైంగిక దాడి జరిపిన కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జహీరాబాద్‌లో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు పవన్‌కుమార్ న్యాల్‌కల్ మండలం మెటల్‌కుంట ప్రాంతంలో ఉన్నాడని సమాచారం అందడంతో ఎస్ఐ వెంకటేష్ అక్కడికి వెళ్లి అతన్ని పట్టుకున్నారు. మిగతా ఇద్దరు నిందితులు కారులో వెళుతున్నట్లు పవన్‌కుమార్ చెప్పడంతో వారిని పట్టుకునేందుకు ఎస్ఐ ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు రాయికోడ్ మండలం మహబత్‌పూర్ గ్రామ శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న సోమాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. అతని తమ్ముడు బ్రహ్మచారిని ఆస్పత్రికి తరలించారు. గతంలో బ్రహ్మచారిపై పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయని, దీనికి సంబం ,దించి పూర్తి

epaper.sakshi.com

MARUTI SUZUKI ARENA

SWIFT NOW 2 MILLION STRONG

The mighty Swift has crossed yet another limit of selling over 2 million units across the country. #BeLimitless

AGS Technology in Petrol & Diesel

SmartPlay Infotainment System

Driver Oriented Cockpit Design

SWIFT (P) SAVE UP TO ₹45 000*

SWIFT (D) SAVE UP TO ₹82 600*

SWIFT

E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki Arena dealership

AUTHORISED DEALERS: TELANGANA STATE: ADARSHA: (KARIMNAGAR) CALL: 9133308022, (WARANGAL) CALL: 0870- 26553319. **VARUN**: (NIZAMBAD) CALL: 8462236236, (KARIMNAGAR) CALL: 0878 – 2950555. **PAVAN:** (NALGONDA) CALL: 8790902131. **SRI JAYARAMA**: (MEHABUBNAGAR) CALL: 8096998841. **WIN MOTORS:** (WARANGAL) CALL: 8688828002. **E-OUTLETS: ADARSHA:** (MANCHERIAL) CALL: 8886006633, (NIRMAL) CALL: 9133307720, (JAGITYAL) CALL: 8886776633, (GODAVARIKHANI) CALL: 8886556633, (ADILABAD) CALL: 7799784536, (JANGAON) CALL: 8886256633, (SIDDIPET) CALL: 9581656633. **VARUN:** (KAMAREDDY) CALL: 9966111132, (ARMUR) CALL: 9052022990, (KOTTAGUDEM) CALL: 9885260333. **PAVAN**: (MIRYALAGUDA) CALL: 8790902154, (KODADA) CALL: 8790902135. **SRI JAYARAMA:** (SHADNAGAR) CALL: 8096998841, (WANAPARTHY) CALL: 8096998841. **MITHRA AUTO:** (KHAMMAM) CALL: 8886063524. **SAI SERVICE:** (SANGAREDDY) CALL: 7331168888, (ZAHEERABAD) CALL: 7331168888.

*Terms and Conditions apply. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from variant to variant. All offers shown are valid for limited period & for limited stock only. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Colors shown may vary from actual body colors due to printing on paper. Images used are for illustration purposes only. Offers valid till 29th February 2020. 2 years standard + 3 years extended warranty is free on Swift Diesel (all variants) and the above offers for the same are inclusive of the warranty offers.